ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం

జులై 2019

వెల రూ. 20



## సాంస్కృతిక యోధుడు

# గిరీష్ కర్నాడ్

1938 - 2019

సాహితీస్రవంతి



సాహిత్య ప్రస్థానం
జూలై 2019

సంపుటి : 18 | సంపాదకీయం | సంచిక : 7

# గిరి శిఖరం

గిరీశ్ కర్నాడ్ అస్తమయంతో ఒక ధిక్కార స్వరం ఆగిపోయినట్టయింది. దశాబ్దాల పాటు సాంస్కృతిక వారధిగా ఉదార ప్రజాస్వామిక విలువల కోసం నిర్భయంగా పోరాడిన వూపిరి నిలిచిపోయింది. కళా సాహిత్య రంగాలలో సమున్నత శిఖరమై జ్ఞానపీఠారోహణం చేసినా అధికార పీఠాలనూ, అహంకార అసహన పోకడలను ఆక్షేపించడానికి అణుమాత్రం సంకోచించని అభీర యోధుడు మనకు దూరమైనారు. పరిశోధకుడుగా, నాటక రచయితగా, దర్శకుడుగా నటుడుగా, వక్తగా, పత్రికా వ్యాఖ్యాతగా, రంగస్థల శిక్షకుడుగా, అధికార అనధికార వ్యవస్థల సంచాలకుడుగా బహుముఖ బాధ్యతలు ప్రతిభావంతంగా నిర్వహించిన ఒక నిబద్ధ మూర్తి నిష్క్రమించారు. జీవితాంతం కన్నడదేశంతో పెనవేసుకుపోయినా గిరీష్ కర్నాడ్ అఖిల భారత స్ఫూర్తి. ఇంకా చెప్పాలంటే ఆక్స్‌ఫర్డ్ ప్రాంగణంలో అంతర్జాతీయ చైతన్యం పెంచుకుని వచ్చిన విజ్ఞాన ఖని. అప్పటి వరకూ భారతీయాత్మ అనేదాని చుట్టూనే పరిభ్రమిస్తుండే తాను ఆలోచనా సీమలు విస్తరించుకోవడానికి అక్కడ అంకురార్పణ జరిగిందని కర్నాడ్ తర్వాత కాలంలో వెల్లడించడం ఆసక్తికరం. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యాన్ని గౌరవిస్తూనే కొత్త విలువల కోసం పోరాడవలసిన మితవాద మతవాదాలను తోసిపుచ్చవలసిన అవసరాన్ని ఆయన గొప్పగా గుర్తించారు. చాలామంది మాజీ ప్రధాని ఇందిరాగాంధీనీ ఇప్పటి ప్రధాని మోడీని మహాశక్తివంతులుగా చెబుతుంటారు. ఈ ఇద్దరి హయాంలోనూ తప్పిదాలను నిర్భయంగా నిలదీసిన నిరసించిన గళం కలం గిరీష్‌వి. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్‌గా మాత్రమే సినిమా టీవీ సంస్థకూ బాధ్యుడుగా వుండిన గిరీష్ కర్నాడ్ ఎమర్జన్సీ విధింపును వ్యతిరేకిస్తూ పదవికి రాజీనామా ఇచ్చారు. వంశపారంపర్య నిరంకుశ పాలనపై ఆయన రాసిన తుగ్లక్ నాటకం ఒక బ్రహ్మాస్త్రమే. ఆ కాలంలోనే విజయ్ టెండూల్కర్, తదితరులు కూడా ప్రయోగాత్మక నాటకాలతో ప్రకంపనాలు సృష్టించారు. తెలుగు వారికి కూడా సుపరిచితుడైన పరిణత నటుడు ఆయన. అయోధ్యలో బాబరీ కూల్చివేతపైనా స్పందించారు. ఇటీవలి కాలంలో దేశంలో పెరిగిన అసహన రాజకీయాలు, హేతువాదుల రచయితల హత్యలపై ఉద్యమాలకు నాయకత్వం వహించి సంఘ పరివార్ ఆగ్రహానికి గురైనారు. కర్ణాటకలోనే మొదట కల్బుర్గి హత్య జరిగినపుడు తర్వాత గౌరీ లంకేశ్ ప్రాణాలు తీసినప్పుడు నిరసనలో ముందు నిలబడ్డారు. ఈ కారణంగా తనను ఎందరు ఎంత బెదిరించినా కాస్తయినా చలించలేదు. భావ ప్రకటనా స్వేచ్ఛ, మతతత్వంపై పోరాటంలో అగ్రభాగాన నిలబడ్డారు. గొప్ప పేరు ప్రఖ్యాతలు బిరుదులూ పదవులు కూడా కాదని ప్రజాస్వామ్య విలువల కోసం భావ స్వాతంత్రం కోసం చివరి వరకూ అంకితమైన గిరిశిఖరం గిరీష్ కర్నాడ్. ఆయనకిదే మా నివాళి.

◆◆◆

ఈ సంచిక అచ్చుకు వెళ్లబోతుండగా దిగంబర కవి మహాస్వప్న కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, నటిదర్శకురాలు విజయ నిర్మల మరణించారు. వారికి మా జోహార్లు. ◆

సంపాదకవర్గం:
**తెలకపల్లి రవి** ప్రధాన సంపాదకుడు
**వొరప్రసాద్** వర్కింగ్ ఎడిటర్
**కె. సత్యరంజన్** ◆ **చీకటి దివాకర్**
**గనారా** ◆ **శమంతకమణి**
**కెంగార మోహన్**
**కె.లక్ష్మయ్య,** *మేనేజర్*

బొమ్మలు: తుంబలి శివాజి, చిదంబరం
గంగాధర్ వీర్ల, వెంకటేష్

కవర్ డిజైన్: బ్రౌన్

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
**సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com

**ISSN No: 2581 - 7477**

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!
**1 సంవత్సర చందా రూ. 240/-** ◆ **5 సంవత్సరాల చందా రూ.1000/**
◆ **10 సంవత్సరాల చందా రూ. 2000/-**
**Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada**
**A/c No. 52001500585, IFSC: SBIN0020343**
చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

## కథలు


మళ్ళీ నీళ్ళు – డా॥ ఉద్యా రమ్యజ్యోతి.................... 5
ధర్మవడ్డీ – త్రిపురనేని గోపిచంద్....................... 22


## కవితలు


మౌనభాష – కుంచెశ్రీ..................................... 4
వారధి – పద్మావతి రాంభక్త.............................. 7
మౌనం ముసుగులో – పి. విజయలక్ష్మి పండిట్......... 13
అనంతాన్ని నేనిప్పుడు – యామినీ దేవి కోడే............ 13
నీటి బాగోతం – డా॥ ఉదారి నారాయణ................ 17
మనిషిచేతిలో పడిందేమో – కొల్లూరు మురళీకుమారి.. 17
నడిచొచ్చిన దారి – చెన్నా రామమూర్తి.................... 21
అప్పుడప్పుడూ – వశిష్ట సోమేపల్లి......................... 21
ధనానీలు – పాలపర్తి ధనరాజ్............................ 26
స్నానం – డా॥ వెన్నా వల్లభరావు
– హిందీమూలం: అబ్దుల్ బిస్మిల్లా.................... 27
ఎవరెస్టు శిఖరమౌదాం! – దామరకుంట శంకరయ్య... 27
వాళ్ళ తిత్తులు నిండవు – శాంతియోగి యోగానంద... 33
పుస్తకం – సుమనశ్రీ....................................... 34
అతని కొలిమి సబ్బండ వర్ణాలకు బలిమి
– గన్నోజు శ్రీనివాసాచారి.......................... 39
చూపు కలపండి – ఎస్.ఆర్. పృథ్వీ...................... 39
ప్రాణం ఒక ప్రహసనం – మూని వెంకటాచలపతి..... 42
జీవన గతులు – వారణాసి భానుమూర్తి రావు........... 42
తెలుగు వెలుగు – ఆవుల చక్రపాణి యాదవ్............. 45
పసిపాపను నేను – కమ్మరి శ్రీనివాస్ చారి............. 53
మిథ్యాభివృద్ధి – మామిడిశెట్టి శ్రీనివాసరావు............. 58


## వ్యాసాలు


ఓనమాలు – మహీధర రామమోహనరావు
– గనారా.......................................... 8
భావాలను 'అద్వంద్వం'గా ప్రకటించిన కవి
– మాకినీడి సూర్యభాస్కర్......................... 14
సాహిత్య ప్రస్థానం జూన్ 2019 పురస్కారాలు......... 16
జీవిత సత్యాన్వేషణ కోసం..పలవరించిన కవిత్వం
– వొరప్రసాద్.......................................18
కథాంశాలు – కేతు విశ్వనాథ రెడ్డి......................28
వృద్ధోపనిషత్ ఒక జీవనసారం – పుట్టి గిరిధర్.......35
మూలాల్ని తడుముకుంటూ వెల్లువెత్తిన కవనఝరి
– వై. హెచ్.కె. మోహన్‌రావు...................... 40
ఆధునిక తెలుగు సాహిత్యం – మానవతా విలువలు
– డా॥ జి. వెంకటరమణ.......................... 43
పర్యావరణాన్ని హత్తుకున్న తెలుగు కవిత్వం
– సుంకర గోపాలయ్య........................... 46
కాళికాంబా సప్తశతిలో గురుప్రశస్తి
– మందరపు హైమవతి........................... 48
బాల సాహిత్యం – కొడవటిగంటి కుటుంబరావు..... 54
సాంస్కృతిక యోధుడు గిరీష్ కర్నాడ్
– డా॥ హెచ్. పల్లవి.............................. 57
స్వీకారం...................................................56
డైరీ .......................................................60


కవిత

## మౌనభాష


- కుంచెశ్రీ
9908830477




*గతం నిన్ను వెంటాడే నీడలో*
*పరుగులు తీస్తున్న గిట్టల శబ్దం*

*మనిషి మనుగడ*
*ముప్పుతిప్పల ప్రయత్నం*
*మాగజీవాల మూతికాడ*
*మూడు ముక్కలాట*

*కాలం గడిచే దారుల్లో*
*ముళ్ళకంచె ఆపగలదా?*
*ధైర్యం పిడికిలిలోని తేమ*

*భయం గుండెల్లోని ధ్వని*
*ఎగిరే పక్షులకు*
*పాకే ఉడుములకు*
*గురువులు లేరుగా?*

*వేకువకూతకు తీతువు పిట్ట పదం*
*సరిపోల్చలేని ఋతురాగం*
*యవ్వనం పొడిచే పొద్దు*
*వృద్ధాప్యం అస్తమించే సందర్భం*

*వెక్కిరింతల లోకంలో*
*లాఫింగ్ బుద్ధలా*
*అసహ్యించుకునే సమాజంలో*
*మదర్ థెరిసాలా గడుపు*

*వెతుక్కో సరికొత్త బాట*
*నిన్ను నువ్వు ఉలితో మలుచుకో !!* ♦

# మళ్ళీ నీళ్ళు

- డా. ఉద్యా రమ్య జ్యోతి
8309379541



"బుజ్జీ సాలమ్మ వచ్చింది గిన్నెలు దొడ్లోవేయ్ కడుగుతుంది" అంటూ కేకేసింది పూర్ణ. బుజ్జి పూర్ణ కూతురు. పన్నెండు సంవత్సరాల అమ్మాయి. రోజూ సాలమ్మ రాగానే దొడ్లో గిన్నెలు వేయడం, ఆమె తోమి, కడిగాక వాటిపై నీళ్ళు చల్లి ఆ గిన్నెల స్టాండు ఇంట్లోకి తెచ్చి పెట్టడం బుజ్జి దిన చర్యలో భాగం. రోజూలాగే ఆ వేళ కూడా సాలమ్మను చూడగానే చకచకా తోమే గిన్నెలన్నీ దొడ్లో వేసి, స్కూలుకు రెడీ అవ్వాలని ఇంట్లోకి పరుగు తీసింది బుజ్జి.

స్కూలు డ్రెస్ వేసుకుని, తయారయి, టిఫిన్ తినేందుకు డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని, "అమ్మా! టిఫిన్ లేటవుతుందీ" అంటూ వంటింట్లో ఉన్న తల్లిని కేకేసింది. "అబ్బబ్బా! ఏమిటి బుజ్జీ నీ అరుపులు? లేటవుతుందని తెలిసినప్పుడు కాస్త తొందరగా రెడీ అవ్వొచ్చుగా" అంటూ ప్రేమగా మందలిస్తూ, టిఫిన్ బుజ్జి చేతికి అందించింది పూర్ణ. "అవును బుజ్జీ! నిన్న నువ్వు తీసుకెళ్ళిన లంచ్ బాక్స్ స్కూలు బ్యాగు నుండీ తీశావా? లేదా?" అంది పూర్ణ కూతురును ఉద్దేశించి.

"అయ్యో! మరచిపోయానమ్మా! సారీ, సారీ ఆ బాక్స్ సాలమ్మ కేసేయమ్మా, నేను టిఫిన్ తినే లోపు కడిగేస్తుంది" అంది బుజ్జి. కూతురి మతిమరపో లేక తన పనుల పట్ల నిర్లక్ష్యమో అర్థం కాక, బ్యాగులోంచి బాక్స్ తీసుకుని దొడ్లోకి వెళ్ళింది పూర్ణ. పూర్ణ వెళ్ళేసరికి సాలమ్మ గిన్నెలన్నీ తోమేసి గట్టిగా రుద్ది కడుగసాగింది. "సాలమ్మా! ఈ మధ్య నువ్వు గిన్నెలు సరిగ్గా తోమటం లేదు. కొంచెం పని శ్రద్ధగా చెయ్" అని అసంకల్పితంగా సాలమ్మ వంగి పోయిన నడుం వైపు చూస్తూ చెప్పింది పూర్ణ.

"రోజూ మూటలు మూటలు బట్టలు చాకలి రేవుల్లో ఉతికీ, ఉతికీ చేతుల్లో సత్తువ లేకుండా పోతుందమ్మా! రేపటి నుండి నా కూతుర్ని పనిలోకి పంపిత్తాలేమ్మా! నాకు చాతకావడం లేదు" అంది సాలమ్మ. "సరేలే ఎవరో ఒకరు. నీ కూతురికి చెప్పు బాగా తోమాలని, అర్థమైందా?"

"అయ్యిందమ్మా"

ఈ మాటలన్నీ టిఫిన్ తింటున్న బుజ్జి చెవిలో పడ్డాయి. పాపం సాలమ్మ! అని మనసులో అనుకుంది. బుజ్జి టిఫిన్ చేసేలోపు సాలమ్మ గిన్నెలు కడగడం పూర్తయ్యిందన్నట్లుగా దొడ్డిని చీపురుతో శుభ్రం చేస్తున్న శబ్దం వినిపిస్తూంది. అంతలో బుజ్జి కూడా టిఫిన్ తినేసి, చేయి కడుక్కోవడానికి దొడ్లోకి వచ్చి, వెళ్తూ, వెళ్తూ కొళాయిలో ఒక చెంబు నీళ్ళు పట్టి సాలమ్మ కడిగిన గిన్నెల మీద చల్లేసి వెళ్ళిపోయింది.

మరుసటి రోజు ఆదివారం కావడంతో, సూర్యుడు తన దుప్పట్లోకి చూస్తున్నా, బుజ్జికి మెలుకువ రావడం లేదు. "బుజ్జీ! ఏంటా మొద్దు నిద్ర? లేచి ముఖం కడుక్కో, బూస్ట్ తాగుదువు గానీ!" అంటూ కూతురికి మేలుకొలుపు పాడింది పూర్ణ. బుజ్జి కళ్ళు తెరిచే సరికి నవ్వుతూ, బెడ్రూం కిటికీలోంచి చెయ్యి ఊపింది మంజు. మంజు సాలమ్మ చిన్న కూతురు. బుజ్జితో పాటు నాల్గవ తరగతి వరకు చదువుకుంది. మంజు తండ్రి తప్ప తాగి, ఆ తాగిన మత్తులోనే మూర్ఛ వచ్చి మరణించాడు.

అందుకని చదువు మాన్పించి కూతుర్ని కూడా పనిలో పెట్టింది సాలమ్మ.

బుజ్జి లేచి ముఖం కడుక్కునే లోగా మంజు కల్లాపి చల్లి, పెద్ద తిప్పుడు ముగ్గు వేసొచ్చి, వాకిట్లో ఓ పక్కగా రెండు కాళ్ళు ముడుచుకుని కూర్చుంది. అంతలో పూర్ణ రెండు చేతుల్లో రెండు గ్లాసులతో వచ్చి, ఒక గ్లాసు తన కూతురికిచ్చి, ఒక గ్లాసు మంజు వైపుగా తీసుకెళ్ళి "ఏమే మంజూ! నీ గ్లాసు ఆ మూలకుంది. మీ అమ్మ చెప్పలేదా? అందులోనే పోయించుకోవాలనీ" అంది కాస్త గట్టిగా. "చెప్పలేదు అమ్మగారు, ఒక్క నిమిషం" అంటూ గబగబా చెప్పుల స్టాండు దగ్గరున్న గ్లాసును తీసుకుని తన గౌనుతో ఆ గ్లాసును తుడిచి 'టీ' పోయించుకుంది మంజు. బుజ్జి, మంజూ కొంత దూరంలో ఎదురెదురుగా కూర్చుని, కళ్ళతోనే నవ్వుకుంటూ తాగసాగారు. "బుజ్జి పాలుతాగటం అయ్యాక గిన్నెలు బయటేయమ్మా!" అంది పూర్ణ.

"అమ్మా! ఈవాళ ఆదివారం. సాలమ్మ రాలేదు, సెలవు హిహిహ్హీ అంటూ తనకు ఇవాళ పనితప్పిపోయిందన్నట్లుగా నవ్వుతూ అంది బుజ్జి. "పనివాళ్ళకు ఆదివారమేమిటే? అయినా మంజు వచ్చింది అందుకేగా వెళ్లి గిన్నెలేసేయ్......పో" అని కసురుకున్నట్లుగా అంది పూర్ణ.

మూతికంటిన పాల నురగను తుడుచుకుంటూ గిన్నెలు బయటేసింది బుజ్జి, వెంటనే తన గౌనును రెండు కాళ్ళ మధ్యకు మడిచి, నడ్డికింద పీటేసుకుని అంట్లు తోమసాగింది మంజు. బుజ్జి కూడా అక్కడే నిలబడుకుని బక్కెట్లోని నీళ్ళలో చేతులు పెట్టి, మంజుపై అప్పుడప్పుడూ నవ్వుతూ చిలకరిస్తోంది. మంజు కూడా బుజ్జి చేష్టలకు నవ్వుతూ, గిన్నెలు, కడిగే పీచుతో బుజ్జి చేతిపై రుద్దబోతుంటే, తన చేతిని వెనక్కి తీసుకుంటూ కిలకిలమని నవ్వుతూంది బుజ్జి. ఇద్దరూ గట్టిగా నవ్వే శబ్దం వంటింట్లో పని చేసుకుంటున్న పూర్ణ చెవిలో పడింది. "బుజ్జీ! నువ్ లోపలకొచ్చి హోమ్ వర్క్ చెయ్" అంటూ గద్దించింది పూర్ణ. ఇంక తప్పదన్నట్లుగా మంజు వైపు చూస్తూ రీడింగ్ రూమ్ లోకి వెళ్ళింది బుజ్జి. అంతలో ఉతికిన బట్టల మూటతో వచ్చింది సాలమ్మ.

"అమ్మా బట్టలు లెక్క చూసుకో"

"నాలుగు టవల్లు వేశాను. మూడే ఉన్నాయ్?"

"ఒకటి పాతదైపోయిందని తీసుకున్నానమ్మా"

"ఎప్పుడూ ఏదో ఒక్కటి తీసుకోనిదే బట్టల మూట తీసుకురావు! సరేలే!"

"అమ్మా! ఇంత టీ ఉంటే పోయమ్మా! పానం బాగాలేదు" అంది సాలమ్మ. అంత క్రితమే మంజుల కోసం చేసినప్పుడు మిగిలిపోయిన టీ ని ఒక గ్లాసులో తీసుకుని వచ్చింది పూర్ణ. ఆమె రావటం చూసిన సాలమ్మ, అంత వరకు ఒక మూలకు కూర్చున్నది కాస్తా పరుగు పరుగున వెళ్లి తనకు కేటాయించబడిన గ్లాసు తీసుకుని, నేల మీద పెట్టింది. పూర్ణ రెండు అడుగుల ఎత్తులోంచి టీని గ్లాసు నుండి సాలమ్మ గ్లాసులోకి వొంపింది. ఆ టీని ఉఫ్ ఉఫ్మని ఊపుకుంటూ చప్పరిస్తూ తాగే శబ్దాన్ని బట్టి సాలమ్మకు టీ అంటే ఎంత ఇష్టమనే విషయం బుజ్జికి అర్థమైంది.

కాసేపయ్యాక మంజు కడిగిన గిన్నెల మీద నీళ్ళు చల్లమంటూ బుజ్జిని కేకేసింది పూర్ణ. "ఏంటమ్మా! నువ్వే చదువుకోమంటావ్, మళ్ళీ నువ్వే పని చెప్తావ్" అంటూ విసుగ్గా దొడ్డి వైపు అడుగులు వేసింది. బుజ్జి వెళ్ళే సరికి మంజు గిన్నెలన్నిటినీ కడిగి, స్టాండులో వేసి, దొడ్డంతా నీళ్ళు పోసి, శుభ్రం చేస్తూంది. ఆ దృశ్యాన్ని చూసిన బుజ్జికి ఎందుకో బాధనిపించి, మంజు వైపు సానుభూతితో చూస్తుండగా "మనం బువ్వ తినేసెల్లి కుంటాట ఆడుకుందాం. తొందరగా గిన్నెలపై నీళ్ళు చల్లేయ్ బుజ్జీ!" అన్న మంజు మాటలకు ఏదో స్ఫురించిన దానిలా మంజు మాట్లాడుతున్నా వినిపించుకోకుండానే వంటింట్లోని తల్లి దగ్గరికి వెళ్ళింది బుజ్జి. "అమ్మా! మంజు కడిగిన గిన్నెలపై మళ్ళీ నీళ్లెందుకు చల్లాలమ్మా?" అంటూ అమాయకంగా, తెలుసుకోవాలనే తాపత్రయంతో అడిగింది బుజ్జి.

వినకూడని మాటేదో విన్నట్లుగా అదిరిపడింది పూర్ణ. సమాధానం చెప్పకుండా తలొంచేసి కూరగాయలు తరుగుతున్న పూర్ణను మరీ మరీ రెట్టించసాగింది బుజ్జి. దొడ్డి వంటింటికి ఆనుకునే ఉండడంతో, బుజ్జి మాటలు 'టీ' ని చప్పరిస్తున్న సాలమ్మకు వినబడ్డాయి. తన 'టీ' ఆస్వాదనను ఆపి, పూర్ణ ఆ ప్రశ్నకు సమాధానం ఏం చెప్తుందనే కుతూహలంతో చెవి వంటింటి వైపుకు ఆన్చింది. కూతురి మాటలకు షాక్ లో ఉన్న పూర్ణకు సమాధానం ఏం చెప్పాలో స్ఫురించక పోగా, ఎందుకు మళ్ళీ నీళ్ళు చల్లాలి అనే ప్రశ్న మెదలసాగింది. దొడ్లో తల్లీ కూతుర్ల సంభాషణను ఆసక్తిగా వింటున్న సాలమ్మకు కూడా నేను కడిగిన గిన్నెల పైన వీళ్ళు మళ్ళీ నీళ్ళు చల్లి వాడుకుంటున్నారెందుకు? అనే ప్రశ్న ఉదయించింది. ఇద్దరి మదిలో మెదిలిన సమాధానం ఒక్కటే అనే విషయం లోకం పోకడ తెలియని బుజ్జికి అర్థం కావడానికి ఇంకా సమయం పడుతుంది. ♦

## కవిత

# వారధి

- పద్మావతి రాంభక్త
9966307777



నా చుట్టూ కమ్ముకున్న
దిగులు పొగలన్నిటినీ చెదరగొట్టి
మసిబారిన కళ్ళద్దాలను తుడిచి
వాటి వెనక వేళ్ళాడే నా దృష్టిని
స్పష్టం చేయాలి
మబ్బుపట్టిన నా ఆకాశాన్ని
కురవకుండా ఆపి
నన్ను తేలికపరచాలి
మలుపు మలుపుల్లో
తారసపడే ముళ్ళపొదలు
నన్ను చీరేయకుండా
నా దారిని మళ్ళించాలి
నా దుఃఖనదులను
నీ సముద్రంలో కలిపేసి
అమ్మలా నాకు జోలపాడి జోకొట్టి
మరిపించాలి
చీకటి పరచుకున్న
నా కనురెప్పల వెనుక
దాగిన కలత నిదురలో
కదిలే పీడకలలను తరిమికొట్టి
హాయైన స్వప్నాలను బహూకరించాలి
నా రాత్రులను
అవతలకు విసిరేసి
పగటి వెలుగుల జిలుగులను
పరిచయం చేయాలి
కూలిపోతున్న
నా లోపలి గోడలను నిలబెట్టి
నన్ను పటిష్టంగా నిర్మించాలి
పిచ్చి గీతలతో నల్లబారి
నలిగిన నా పుస్తకాన్ని
మిలమిలలాడేంత తెల్లగా
తయారుచేయాలి
చిన్న అలల తాకిడికే
అల్లకల్లోలమయే
నా బతుకు పడవను స్థిరపరచాలి
చీడపీడలతో విసిగి
ఆకులు రాల్చేసుకుంటున్న
నాలో ఎదుగుతున్న మొక్కను
పాదు చేసి మళ్ళీ చిగురింపజేయాలి
తుపాను గాలులకు వణికిపోతూ
చెల్లా చెదురవుతున్న నన్ను పోగేసి
నిటారుగా నిలబెట్టాలి
నా కన్నీటికి దోసిలి పట్టాలి
నా చిరునవ్వులకు చప్పట్లు కొట్టి
మురవాలి
నా ఉనికికి అసలైన అర్థాన్ని
నీదైన భాషలో వివరించాలి
ఇవన్నీ చేయాల్సిన నువ్వు
ముఖం చాటేసి
మౌనాన్ని తొడుక్కున్నావేమిటి
స్నేహ మధురిమలో
పొరపాటుగా
గొంతుకడ్డం పడిన చేదుమాత్రలు
అనుకోకుండా తగిలిన
జ్వరాన్ని బాగుజేయాలి కదా
హృదయాల మధ్య
కలకాలం భాసిల్లే
ఆకుపచ్చని వారధిని నిర్మించడమే
నిజమైన స్వచ్ఛమైన స్నేహమని
అప్పుడెప్పుడో నువ్వేగా నిర్వచించావు

♦



♦

విశ్లేషణ

# ఓనమాలు - మహీధర రామమోహనరావు

- గనారా
9949228298





20వ శతాబ్దం ప్రారంభం నుంచి దాదాపు 1950 వరకు తెలుగు ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులు, పరిణామాలని మహీధర రామమోహనరావు కొల్లాయి గట్టితేనేమి, రథచక్రాలు, 'ఓనమాలు'లో నవలల్లో చిత్రించారు.

తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మ పాత్ర సత్తెమ్మది. 'సత్తెమ్మ'కు పదహారు ఏట వివాహం అయింది. ఏడాది తిరగకుండా భర్త పోయాడు. మగదిక్కు లేని పుట్టింటి సంసారాన్ని తన భుజాలపైకి ఎత్తుకుంది. మూలనపడ్డ పొలం చక్కపెట్టడానికి వూళ్ళో పనిమంతుడు అని పేరున్న 'వెంకటయ్య'కు కాస్త గింజలు ఎక్కువ ఇచ్చి, తనకు తోడుగా పెట్టుకుంటుంది. కష్టసుఖాల్లో భాగం పంచుకునే వెంకటయ్య సన్నిహితుడు అవుతాడు.

వీరిద్దరి కలయికను చూసి చూడనట్లు లోకం ఊరుకుంది. కుటుంబం వూరుకుంది. తమ్ముడుకి మరదలుకు కూడా అంగీకరమైంది. ఆ సంబంధం వివాహం కావడానికి సామాజికమైన అడ్డంకి ఉంది. కాని భర్త లేని స్త్రీ యొక్క వాంఛలకు పరోక్ష ఆమోద ముద్ర ఉండేది. సానుభూతి ఉండేది.

ఆ గ్రామంలో ఉండే చాకలి 'పద్దాలు' సంగంతో సంబంధాలు పెట్టుకుంటాడు. అతనితో పాటు చాలామందిని చేర్పిస్తాడు. అసలు పద్దాలే 'సంగాన్ని' వూళ్ళోకి తెచ్చింది. వెట్టికి వ్యతిరేకంగా నిలబడి నాయకత్వం వహిస్తాడు. సత్తెమ్మ, వెంకటయ్యను సంగంలో చేర్పిస్తుంది. కొన్నిరోజులకు నిజామ్ పోలీసులు వూళ్ళోకి ప్రవేశిస్తారు. దొర పెద్దకొడుకు సర్కిల్ఇనస్పెక్టర్. పద్దాల్ని నడిరోడ్డుపై కాల్చేస్తారు. మగవాళ్ళనందరిని చితక్కొట్టి కొందరిని జైళ్ళకు పంపిస్తారు. పద్దాలు భార్యను పోలీసు స్టేషన్‌లో పెట్టి రెండు నెలలు వెట్టిచాకిరి చేయిస్తారు. ఆమెను లొంగదీయడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు.

సత్తెమ్మతో వివాహేతర సంబంధం మంచిది కాదని 'సంగం' నాయకులు చెబుతారు. గర్భవతి అయితే సమాజం ఆమెను చిన్నచూపు చూస్తుందని చెబుతారు. సత్తెమ్మ వెంకటయ్యను పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొని కుటుంబానికి వెల్లడిస్తుంది. అక్క పట్ల ఎంతో అణుకువుగా ఉండే తమ్ముడు రంగయ్య, తల్లి వ్యతిరేకిస్తారు. రంగయ్య భార్య ఒక్కరితే సత్తెమ్మను సమర్థిస్తుంది. కాని కుటుంబం యొక్క ఒత్తిడికి ప్రేమను త్యాగం చేయక తప్పింది కాదు సత్తెమ్మకు. కుటుంబ ఒత్తిడికి సత్తెమ్మ తల వంచి వెంకటయ్యను పంపించేసింది. వెంకటయ్య వెళ్ళిపోతూ తన చేతుల్తో పెంచిన తోట, పొలం నాశనం అవ్వకూడదని సరయ్య అనే ముసలతన్ని సూచించి వెళ్ళిపోతాడు. సరయ్యను కాపలాగా ఉంచుకుంటుంది సత్తెమ్మ.

సరయ్య కాపలాగా ఉన్నాడు కాబట్టి రహస్యంగా పార్టీ కార్యక్రమాలు సాగుతుంటాయి. ఆగిపోయిన రాత్రి పాఠశాల

మళ్ళీ ప్రారంభం అయింది. నిషేధించబడిన 'ప్రజాశక్తి' తెచ్చి రాజకీయాలు చర్చిస్తుంటారు. లంబాడీ పూర్ణయ్య, మేదర మల్లయ్య, చాకలి నారాయడు, కుమ్మరి గురవయ్య, కంసాలి వెంకటాచారి ఆ పాఠశాలలో విద్యార్థులుగా ఉండి పెద్ద పెద్ద పాఠ్యాంశాలు కూడా చదువుతుంటారు.

సరయ్య జీవితం కూడా దొర దౌర్జన్యానికి బలైనదే! తన కొడుకు ప్రాణాల్ని తీసిన సమ్మె అతని మనసులో ఉండిపోయింది.

1946లో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం తెలంగాణ పల్లెల్లో కారుచిచ్చులా వ్యాపించింది. దానిని అణచివేయడానికి 'నిజామ్‌శాహి' ఎన్నో ఘోరాలు సాగించాడు. ఆ దురంతాలు వ్యతిరేకిస్తూ కోస్తా జిల్లాలన్నింటా బ్రహ్మాండమైన ఆందోళన జరిగింది.

సత్తెమ్మ తమ్ముడు రంగయ్య బాగా చదువుకుంటాడు. విద్యార్థి దశ నుండి ఆదర్శాలు కలవాడు. తగుపాటి చదువు చాలనేది అతని అభిప్రాయం. నిజామ్ పాలనలో హిందువులకు జరుగుతున్న అన్యాయాన్ని గురించి, మాతృభాషను అణచివేయడానికి చేస్తున్న అన్యాయాల్ని గురించి చర్చలు వినియోగించాడు. హిందూ మత రక్షణ కోసం ఆర్య సమాజం చేస్తున్న కార్యకలాపాల్ని అభినందించాడు. ఆంధ్రభాష అభివృద్ధి కోసం జరిగే ప్రయత్నాలకు తోడ్పడేవాడు.

రంగయ్యను చిన్ననాటి స్నేహితుడు 'సేతుసిందీ గోవిందు' వచ్చి 'దొర యాదు చేస్తున్నాడు' అని వార్త తెచ్చాడు. పల్లెటూళ్ళలో దొరలది మకుటం లేని రాజరికం. చట్టం ఎరగని శాసనాధికారం, ఒక్క కుల పెద్దరికం వలన లభించిన పెత్తనం మాత్రమే కాదు. డబ్బు, భూమి, కులం, దర్పం, దాష్టీకం వీటన్నింటి మిశ్రమం ఆ దొరతనం. ఒకడు పెద్ద ఇల్లు కట్టుకోవడాన్ని సహించడు. చొక్కా వేసుకోవడానికి ఒప్పుకోడు. ఎండ మాడొస్తున్న, వర్షం కురుస్తున్న వారి ఎదుటనే కాదు వారి ఇంటి ముందు కూడా గొడుగు చంకన పెట్టవలసిందే. జోడు చేతికి తీసుకోవలసిందే. చుట్ట దాచవలసిందే. తలదింపాలసిందే. ప్రతీ మాటలో తన బానిసతనాన్ని, దీరుల పెద్దరికాన్ని గుర్తు చేసుకొంటూ, గుర్తు చేస్తూ మాట్లాడవలసిందే. అదంతా చట్టాలు కెక్కని శాసనం.

రంగయ్యకు చిన్నతనం నుంచి తెలిసిన వాతావరణమే! అనేక ఘోరాలు అతని కళ్ళతో చూసినవే.

'శివరామిరెడ్డి' దగ్గరకు రంగయ్య వెళ్ళాడు.

శివరామరెడ్డి దగ్గర సంభాషణ :

"తమరు ఎందుకో యాగి చేసారట?"

"మా అల్లుడు గారు తరచూ చెప్తుంటాడు. బాగా చదువుకున్నావని, ఈ ఏడాది 'వకాలితు' పెట్టబోతున్నామని చెప్పారు. సంతోషం. మీ తాత తండ్రీ చాలా మంచివాళ్ళు".

"వాళ్ళు తమ జీవితాన్ని మన్నుకి అంకితం చేసారు. అంతటి వాళ్ళు లేరనిపించుకొన్నారు".

శివరామిరెడ్డి తాటాకులు కడుతున్నాడో, నిజంగా పొగుడుతున్నాడో అర్థం కాలేదు" రంగయ్యకు.

అతనితో ఏ విషయములోను వాదనకు దిగే ఉద్దేశ్యం రంగయ్యకు లేదు. కాని మనస్సులో వ్యవసాయం అభివృద్ధి కాకపోవడానికి కారణం దేశంలోని ఆర్థిక పరిస్థితి కారణమని, వెట్టిచాకిరి, భూస్వాముల మూలానా పనివారికి రక్షణ, విశ్వాసం, తాహతు లేకపోవడం కారణమని వాదన చెయ్యాలన్నా రంగయ్య సాహసం చెయ్యలేదు. అందుకే చిన్న, చిన్న కమతాలు, వేదయుగం నాటి పనిముట్లే కారణం అనే వాదన తెచ్చి ఎవ్వరికి ఇబ్బంది కలిగించకూడదని అనుకున్నాడు. ఈ క్రమంలో చిన్న కమతాలు, పనిముట్లే అని చెప్పినా ఆవేశంలో కొట్టుకుపోతూ, అమెరికాలో వ్యవసాయ పరిస్థితులు చదివినవి, విన్నవి గుర్తుకువచ్చి, పెద్ద పెద్ద బ్యాంకులు, కంపెనీలు లక్షలాది ఎకరాల కమతాలు నడిపిస్తున్న విధానం, యంత్రాలు ఉపయోగించే తీరు చెప్పుకుపోయాడు.

శ్రద్ధగా నిశ్శబ్దంగా విన్నాడు. ''ఈ రోజుల్లో పదుచువాళ్ళందరికి ఒకటే పద్ధతి. మా రఘు కూడా ఇదే... సరిగ్గా ఇంతే..."

రఘునందనుడు శివరామరెడ్డి రెండోకొడుకు, చదువుల్లోనూ వ్యవహార విషయంలోనూ తెలివైనవాడు. ప్రభుత్వ ఉద్యోగం చేసి పద్ధతులు సరిపడక, స్వంత సేరీ పట్టేడు ఇంజన్లూ. ట్రాక్టర్లు తెప్పించి, ఆధునిక పద్ధతులపై వ్యవసాయం చేయిస్తున్నారు. రఘునందనుడితో పరిచయం లేకపోయినా తన ఆలోచనతో నరివడుతున్నాయని రంగయ్య బ్రహ్మానందపడ్డాడు.

పైగా "అటువంటివారే దేశానికి ఆదర్శం చూపగలరు. వారికి ఆ అవకాశం, ఆసక్తి వుండడం దేశం అదృష్టం". అని రంగయ్య ప్రకటించడంతో రామిరెడ్డి మీసాలు సవరించుకున్నారు. రంగయ్య ఆదర్శ పద్ధతి వెళ్ళడించిన తరువాత దాన్ని అమలు చేయడానికి సంసిద్ధతను

తెలియజేసాడు.

రఘునందనుడు రెండేళ్ళగా చెదురు చెదురుగా ఉన్న చిల్లరగా ఉన్న రైతుల్ని తన చేతిలో తెచ్చుకొన్నాడు. శివరామిరెడ్డి మాటలతో రంగయ్య నెత్తిన పిడుగు పడినట్లయి బొళ్ళ పొలం కూడా స్వాహా అయింది.

♦♦♦

పది ఎకరాల గొడ్రళ్ళదిబ్బ, తమ కష్టం చాకిరి వీటికి విలువే లేదా? తనచేయి నెత్తినే పెట్టించే విధంగా రెడ్డి మాట్లాడుతుంటే రంగయ్య నోరు ఎత్తలేదు.

"ఇది నాది అనుకొని వుండకపోతే మా తాతయ్య, అయ్య, నేను దీని కోసం ఇంత కష్టపడేవాళ్ళమేనా" సత్తెమ్మ అనుకుంటుంది.

'యాభై ఏళ్ళు పాటు ఏది ఉంటే అదే తిన్నారు. కొంత చిల్లర మిగుల్చుకున్నారు. ఈ యాభై ఏళ్ళల్లో ముగ్గురు పెద్దవాళ్ళు, నలుగురు అజాత శిశువులు ఈ భూమికి బలి అయ్యారు. తాము ఇద్దరు మాత్రమే మిగిలి ఉన్నారు'.

'ఈ భూమి లేకపోతే ఈ ప్రపంచంతో తమకున్న సంబంధం ఏమిటి?' ఇది సత్తెమ్మ ప్రశ్న.

'దొర రోజు ఓ వంద ఎకరాలు యంత్రాలు తెచ్చి దున్నుతాడు. ఆ భూమి దొరలది అయిపోతుందా! దానితో పాటు చెరువు, కాలువలు, గుంటలు అన్ని చదును అయిపోతాయి. ఈ వనరులన్ని భూస్వాములువేనా?' ఇలాంటి ప్రశ్నలు తలెత్తాయి.

"పొలాలన్ని ఏభయ్యేళ్ళు నుంచి మేము చేస్తున్నాం" సత్తెమ్మ రంగయ్యల వాదన.

"అందుకే విశ్వాసం చూపడం మరీ అవసరం. ఏదో కష్టంలో ఉన్నప్పుడు ఆసరా ఇచ్చాం. మీరు నిలదొక్కుకున్నారు కదా! ఇంక దానిని వదలండి."

రెడ్డి ఆఖరు వాక్యం సుగ్రీవాజ్ఞ.

సంతానం ప్రయోజకులలో అప్రయోజకులలో లేక సంతానం లేకున్నా రైతు భూమిని అలాగే కాపాడుకుంటాడు. పంట రానూవచ్చు లేదా పోనూవచ్చు కాని, చాకిరీ అలా చేస్తూనే ఉంటాడు. అందుకే భూమితో రైతు ప్రాణం లంకె పడి ఉండడం.

విషయం తెలిసిన సత్తెమ్మ తల్లి, రంగయ్య విచారంలో పడిపోయారు. అందురూ వచ్చి ఓదార్చారు. కొందరు సత్తెమ్మకు, వెంకటయ్యకు ఉన్న సంబంధం తెరపైకి తెచ్చారు. సంఘంలో ఎవరో ఒకరు అది కారణమై ఉంటుందని అంటారు. 'రకరకాల వాదనతో ఆర్థిక సూత్రాలు, సమాజ దాస్యం నుండి వచ్చిన ఆధ్యాత్మిక వివరణలు ఉన్నాయి.' తమ్ముడు రంగయ్యకు కూడా అక్క నైతిక ప్రవర్తనకు దొరచర్య కారణం అనుకుంటాడు.

'ముండల్లే నాపై పడి ఏడవకపోతే అక్కడే అవేదో ఏడవకపోయావూ. వెదవ చదువు వెలిగించేవు". అంటూ సత్తెమ్మ తమ్ముడుని నిలేస్తుంది.

ఈ కథ నడుస్తున్న కాలం నాటికి ఆంధ్ర మహాసభ ఉనికిలో ఉన్నప్పటికి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం బలంగా ఏర్పడింది. తెలంగాణ అన్ని జిల్లాలలోను తన నిర్మాణయుతమైన శాఖలు ఏర్పరచగలిగింది.

నిజాము జాగీర్దారి విధానానికి దొర ప్రతినిధి. తరిమివెయ్యాలని ప్రజలు ఉద్యమిస్తున్నారు. హిందూ ముస్లిములు వ్యతిరేకతను రెచ్చగొట్టే శక్తుల పట్ల అప్రమత్తత అవసరమని తలచేవారు. ఇండియన్ యూనియన్‌లో నిజామ్ జాగీర్దారి కలిసిపోవాలని వాదన బలంగా వినిపిస్తుంది. అప్పటి పరిస్థితుల్లో మధ్యతరగతి మేధావి వర్గం కాంగ్రెసుతో కలసి ఉంటుంది.

కొద్దిరోజులకు సత్తెమ్మ పొలం చూస్తున్న సరయ్య పరుగున వచ్చి తనపాక తీసి, మండావిసిరేసిన కృష్ణయ్య గూర్చి చెప్పుతాడు. పదిమంది కూలీలతో వచ్చాడని చెబుతాడు. కనీసం పంట కోసుకొనే అవకాశం కూడా ఇవ్వలేదని తల్లి వీరమ్మ లబోదిబో అంటుంది. చుట్టుపక్కలవారు వచ్చారు. ఈ గోల విని సత్తెమ్మ బయటకు వచ్చింది. పొలంలో జరిగిన విషయం తెలిసి తల్లిలా ఏడ్వలేదు. కళ్ళు భగ భగ కనిపించాయి. ఆకారం చూస్తూ వచ్చినవాళ్ళంతా ఆశ్చర్యంతో నోరు తెరిచారు. ఎవ్వరిమాట, ఓదార్పులు వినలేదు. చూరులోని బారెడు పొడుగు జువ్వకర్ర లాగింది. సరయ్యను నడవమంది. అతనికి అర్థం కాలేదు. అలా చూస్తూ ఒక్క నిమిషం నిలబడ్డాడు. భూమి మీదకు వచ్చిన వాళ్ళను ఎదుర్కొవడానికి సిద్ధం అయ్యిందని అక్కడవారికి సంతోషం కలిగింది. వెనక తల్లి అరుస్తూ వచ్చినా వినిపించుకోలేదు. వెనక ఉన్న జనాల్ని గమనించలేదు. ఇదివరకూ పోలీసుల చేతిలో దెబ్బలతిన్న జానకిరామయ్య నలుగుర్ని పోగేసాడు. 'రండేసి' అని ఉత్సాహపరిచాడు.

సాతాని బూసయ్య వీధి మొనలో కోటమ్మ అందరూ

జట్టుకట్టారు. వెనకబడినవాళ్ళను కోటమ్మ తిట్టింది. మగాళ్ళు 'ఆడకూతురు పాటి చేరికలేరూ... అంటూ నోటిదురుసు చూపించింది. ఆడవాళ్ళు కదలడంతో మగవాళ్ళు కదిలారు.

పొలం సమీపించినకొద్ది సత్తెమ్మ నడక తీవ్రం అయింది. వడి వడి నడకైయింది. పరుగైయింది. గుండ్రాయిపై కిష్టయ్య కనిపించాడు. ఈ కోలాహలం గమనించాడు. దూరంగా కేకలు, పిలుపులు వినిపిస్తున్నాయి. జనం పరుగున వస్తున్నారు. రంగురంగు పంచెలు, కండువాలు మగవాళ్ళు తనవైపు వస్తున్నారు. పుంతలకి, చేలకి అడ్డుపడి చేతులు ఎత్తి కేకలు వేస్తున్నారు. పిడికిళ్ళు బిగించి వస్తున్నారు. సంగం ఉనికి కనిపించింది కిష్టయ్యకు.

సత్తెమ్మ చాచికొట్టింది. జువ్వకర్రకు చర్మం లేచేది. కిష్టయ్య తప్పించుకున్నాడు. సత్తెమ్మ వెనకాలే వచ్చిన జనం కిష్టయ్య పరుగుచూసి తరమడం ఓ హుషారు అయింది. అతనితో వచ్చిన కూలీలు గజగజలాడారు.

"కొడుకుల్ని పక్కలిరగ తన్నండి"

"మీ దొరముల్లె గాని దాచిపెట్టేదనుకున్నారంట?" సత్తెమ్మ వాళ్ళను కొట్టింది. నిర్లక్ష్యంగా పొమ్మంది. ఎక్కడినుంచో మంగలి వెంకన్న వచ్చి వారం క్రితం దొర స్వాధీనం చేసుకున్న తన పొలాన్ని కూడా ఇప్పించమని ప్రార్థించాడు.

'మంది ఆజ్ఞ. నీ పొలం నువ్వు చేసుకో ఇంకొకరి గొడవేమిటి?' విజేతలు పెద్ద పెద్ద కేకలతో పొలాలు స్వాధీనం చేసుకున్నారు.

బీళ్ళ పొలం బావి దగ్గర ప్రజలు పోయాక అనేక ఆలోచనల్లో పడ్డారు. శివరామరెడ్డి పగ తీర్చుకుంటాడని, అవసరం అయితే నైజాంకు సైన్యం తోడు తీసుకుంటాడని అనుకోవడం ప్రారంభించారు.

సాయంకాలం అయింది. పోలీసులు రాలేదు. తుపాకులు పేలలేదు. ఏ అలజడి కనిపించలేదు.

శివరామిరెడ్డి దగ్గరకు వెళ్ళిన కిష్టయ్య ఎంత చెప్పినా వినలేదు. చికాకు పడ్డాడు. తన బతుక్కి కిష్టయ్యలాంటి కూలోడి సలహా ఇవ్వడమేనా?

పోలీసు అధికారికి ఉండే అవలక్షణాలు మూర్తిభవించినవాడు దొరకొడుకు రఘునందనడు. ఏదో ఒకటి చెయ్యాలి. లేదంటే సెంటు భూమి కూడా మిగలనివ్వరని హెచ్చరిక చేసాడు తండ్రికి.

శివరామిరెడ్డి వద్ద గతంలో వెంకటయ్య కొంతకాలం పనిచేసాడు. అప్పటికే దొర ప్రవర్తన తెలుసు. పరిచయాలకు, చనువుకు అవకాశం ఇవ్వని రకం. మనుష్యులను ఆప్యాయంగా పలకరిస్తాడని అందరికి తెలుసు. సత్తెమ్మను పెళ్ళి చేసుకుంటాడని అప్పటిలోని వార్త శివరామరెడ్డికి తెలిసి కబురు పంపాడని వెంకటయ్య అనుమానం. పెద్దవాళ్ళు ఇళ్ళల్లో రంకు సాగించడం మామూలే! కాని, శివరామరెడ్డి వితంతు వివాహం ఆయన సమర్థించడం ఆశ్చర్యం. ఉత్సాహం కలిగించింది. తండ్రి తాతల కాలం నాటికి తన పొలం చిన్ననాటి నుండి శివరామరెడ్డి స్వాధీనంలోనే ఉంది. కాని తిరిగి తన స్వాధీనం కావడం సాధ్యం కాదు. దొరల స్వాధీనంలో ఉన్న భూమి హక్కుదారులకు చెందకుండా భయపెడతారు, బెదిరిస్తారు. అవసరం అయితే రంకు చేస్తారు. వాళ్ళ తల్లిని, పిల్లలని, అత్తను, కోడలను మంచాలపైకి రప్పిస్తారు.

తెలంగాణలో భూస్వాములు, రజాకారుల దుర్మార్గాలు మితిమీరిపోతాయి.

ఊరి పొలిమేర నుండి లారీజనం వస్తారు. షాహే ఉస్మాన్ ఇత్తెహార్ అనేవాడు అలీఘర్‌లో సురక్షితుడయిన లాయరు. 'ముస్లిం ప్రతిష్ఠ విషయములలో మహా విశ్వాసమున్నవాడు. రజీవ నాయకత్వంలో ఇత్తెహాద్ ఓపేరా మిలటరీ వ్యవస్థ రజాకార్ పేరున ఏర్పాటు జరిగింది. సుమారు పదిలక్షల మందికి ఆయుధ శిక్షణ లభించింది.

'జిందాబాద్', 'ఆజాద్ హైదరాబాద్' అంటూ ఆయుధాలు ప్రదర్శిస్తూ పోలీసులు మిలటరీ వస్తుంటారు. ప్రజలు రామిరెడ్డి పంపాడనుకుంటూ పరుగులు తీస్తారు. ఊరేగింపుగా బజారులోకి వచ్చిన సైన్యం అక్కడే చాలాకాలంగా అడుక్కునే ఒక ముసలాడిని హత్య చేస్తారు. ఆ దృశ్యం చూసిన జనం ఇళ్ళల్లోంచి పరుగులు పెడుతూ బయటకు వస్తారు. ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారనుకొని మిలటరీ పోలీసులు పరుగులు తీస్తారు.

వీరునికి జరిగే మర్యాదలతో ఆ ముష్టివాడి శవం గ్రామ వీధుల్లో కదిలింది. 'నిజాము పరిపాలన యమలోకానికి పర్యాయం'. జగీర్దారీ దురంతాలకు, వెట్టిచాకిరికి, కరువుకు, అవిద్యకు పుట్టిల్లు తెలంగాణ. ముసలివాని త్యాగాన్ని కీర్తిస్తూ గ్రామం ఉద్రేకపడింది.

ఏడాది క్రితం కాంగ్రెస్ జెండా ఎగరవేసినందుకు

వరంగల్ జిల్లాలో హత్య జరిగింది. ఆ ఆయుధాలు ప్రదర్శిస్తుంటే అధికారులు ఆనందించారు. ముస్లిం గుండాలు అనేక వాడల్లో మనుష్యుల్ని కొట్టారు. దోచారు, ఇల్లు, ఆస్తి తగలబెట్టారు. విషయం తెలిసిన రంగయ్య పరుగన వస్తాడు.

ఇత్తెహాయత్ ముస్లిమాన్, రజకార్లు, దేశముఖులు గూండాలు, పోలీసులు వూళ్ళో సాగిస్తున్న దౌర్జన్యాల గూర్చి కథలు కథలుగా చాలా కనబడుతున్నాయి.

"విసునూరు, తెల్దారుపల్లిలో దేశముఖుల గూండాల అరాచకాలు ఎక్కువ అయ్యాయి. నల్లగొండ జిల్లాలో 25 మంది హత్య చెయ్యబడ్డారు. కొంతమందిని కొట్టారు. లక్షలాది రూపాయలు ఆస్తి నష్టపరచారు."

ఆనాటి ఘోర దురాగతాలు తెలియాలంటే సుందరయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పుస్తకంలో చాలాచోట్ల చూస్తాము.

"మరునాడు భీమిరెడ్డి నరసింహారెడ్డి, చకిలం యాదగిరిరావు, నల్ల ప్రతాపరెడ్డి, కట్టూరు రామచంద్రారెడ్డి అరెస్టు చేసి విసునూరు పోలీసుస్టేషనుకు తీసుకుపోయారు. అక్కడ కచ్చేరి సావడిలో కొట్టి తలలు పొయ్యలలోకి నెట్టాడు. వారి ఆసనాలలో కారం కూరాడు. వాళ్ళ నోళ్ళలో మూత్రం పోసారు. ఫాసిస్టు పైశాచిక చర్యలింకా అనేకం చేశారు. రక్తానికి రక్తం అనే నినాదంతో జమీందార్ల భవనాలు ఆక్రమించి, ప్రజలు కోటకు నిప్పు పెట్టారు. దానితో జమీందారులందరూ తలో దిక్కుకు పారిపోయారు. సైన్య గ్రామాలను చుట్టుముట్టి అత్యాచారాలు చేసారు. హిందూ, ముస్లిమ్‌లను నిర్బందించారు. ముస్లిమ్‌లను వేరుచేసి వదలిపెడితే హిందువులతో పాటు తమని కూడా ఉంచాలని పట్టుపట్టారు ముస్లిమ్‌లు."

ఒక పక్క భూస్వాములు, వారి గూండాలు, మరోపక్క నైజామ్ నవాబు అతని సైన్యం ప్రజలను పీక్కు తినడం తారాస్థాయికి చేరింది. మరోప్రక్క రాజకీయంగా నవాబు ఇండియన్ యూనియన్‌లో చేరమని ఆహ్వానాన్ని తిరస్కరించడం సామాన్యులకు సైతం అర్థం అవుతుంది. 1947 జులై 25న ఢిల్లీలో సంస్థానాదీశుల సభలో నిజామ్‌నవాబు ప్రతినిధుల ప్రతిపాదన తిరస్కరించడం జరిగింది.

ఉద్యమానికి నాయత్వం వహించింది సంగం నాయకుడు సత్తిరెడ్డి గూర్చి ఎంక్వైరీ మొదలుపెట్టాడు. పోలీసు ఆఫీసరు రమణారెడ్డి.

వెంకటయ్యను వేరే గదిలో పడేశారని క్రూరంగా కొడుతున్నారని సత్తెమ్మకు తెలుస్తుంది. కోటమ్మని పిలిచింది. వెంకమ్మ, మంగమ్మ, లక్ష్మి వెంట నడిచారు. భర్తలను తిట్టి తమ వెంట రమ్మని దుమధుమలాడారు. గడీ గుమ్మంలో ముసలి, ముతకా, పిల్లా, మేకా తమవాళ్ళను కొట్టవద్దని ఏడుస్తూ గోడలకు జారపడి ఏడుస్తున్నారు. కాళ్ళు మొక్కుతున్నారు. అపరాధం చెప్పుకున్నారు. 'బాంచల'మని ప్రాధేయపడ్డారు.

సత్తెమ్మ వెంకటయ్యను కాపాడాలని నిర్ణయించుకొని అందుకు సుమిత్ర పరిచయము ఉ పయోగించుకోవాలనుకుంది. (సుమిత్ర సర్కిల్ ఇనస్పెక్టరు చెల్లెలు. రంగయ్య మిత్రుడు రాజారెడ్డికి భార్య) రాజారెడ్డి సత్తిరెడ్డికి చదువుకుంటున్నప్పటి నుండి తెలుసు.

సర్కిల్ రాజారెడ్డి మీదకి దాడి చెయ్యి ప్రయత్నిస్తాడు. సుమిత్ర అన్నగారి చేతిలో పిస్తోలు కర్రతో కొడుతుంది. ఆ గంధరగోళంలో రాజారెడ్డి తన్నిన ఒక బలమైన తన్నుతో సర్కిల్ మూలన పడతాడు.

సుమిత్ర వెనక వెనకనే వున్న సత్తెమ్మ సమయం కనిపెట్టి గొడ్డలితో వెంకటయ్యను వుంచిన గది పగలగొడుతుంది. ఒక పెద్దపులిలా ఒక పెట్టన అరుస్తూ బంధీనలు వెడవేసుకొని తలుపులు పగలుగొడతాడు. ఆ ప్రాంతం అంతా ధ్వంసం చేస్తారు.

'సంగం' జిందాబాద్ అంటూ చెల్లాచెదురుగా పరుగులు పెడతారు. వెంకటప్పయ్య ఎర్రజెండా తీసి కర్రకు తగిలించి ఎత్తి పట్టుకున్నాడు. అతని వెనక జన ఊరేగింపు తీసారు. ప్రతి ఇంటిముందు హారతులిస్తూ పువ్వులు జల్లుతారు.

బట్టలు ఇవ్వడానికి వచ్చిన చాకలి మంగమ్మ ఈ గందరగోళంలో రివాల్వరును తన బట్టల మూటలో దాచి వీధిలోకి వెళ్ళిపోయింది.

'కొల్లాయిగట్టితేనేమి', 'రథచక్రాలు', 'ఓనమాలు' ఈ మూడు నవలలు మహీధర రామమోహనరావు వ్రాసిన ఉ ద్దేశ్యం అప్పటి తెలుగునాట వస్తున్న ఆర్థిక, సామాజిక మార్పుల క్రమాన్ని వివరించడం. శాస్త్రీయ దృక్పథంతో పాఠకులకు అందించిన నవలలు. ఇది ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య నలిగిన ప్రజల చరిత్ర. తెలంగాణ ప్రజల జీవిత చిత్రణ ఒక సోషలిస్టు సమాజానికి పునాదులు వేసిన కమ్యూనిస్టుల పూర్వచరిత్ర. ♦

## కవిత

# మౌనం ముసుగులో

- పి. విజయలక్ష్మి పండిట్
8639061472

ఆ అమాయక బాలలు
మౌనంగా ఏడుస్తున్నారు..!
అవును.. వారి లేత వయసు మనసు
స్వరక్షణ మెలకువలు తెలియని
వారి అమాయకత నిస్సహాయత;
ఇంతకంటే మంచి
అవకాశ లక్షణాలు లేని
బాలల హింసకు దోపిడీకి?!
అంతా మౌనం ముసుగో
చాపకింద నీరులా
అతి వేగంగా అల్లుకుపోతున్న
చిన్నారి బాలల దోపిడి వల...
రహస్యంగా జరిగిపోతున్న
అదృశ్య అమానుష అసాంఘిక
అమానవీయ బాలల హింస
గెలవలేక బలి అవుతున్న
బాలల నిశ్శబ్ద యుద్ధం...



ఎవరు.. కారణం?
ఇంకెవరు; మనమే మానవులం..,
సొంత ఇల్లు, పొరుగిల్లు
పాఠశాలలు, ఆటశాలలు, వనాలు
అనాథ శరణాలయాలు, శరణార్థ శిబిరాలు
పేవ్‌మెంట్లు, రైల్వే ప్లాటుఫామ్‌లు
అన్నీ బాలల పాలిట శాపకూపాలు
మానప్రాణాలను నిలువునా దోపిడిచేసే
వికృత అక్రమార్క నిలయాలు
ఇదో తెలిసితెలియనట్లు వ్యవహరించే
ప్రజల పాలకుల నిర్లక్ష్యపు చర్య
స్వయంకృతాపరాధం,
ఎవరు ఛేదించాలి
ఈ మౌనం ముసుగును?
ఎవరు కాపాడాలి మన అమాయక
బాలభావిపౌరులను?!

♦

# అనంతాన్ని నేనిప్పుడు

- యామినీ దేవి కోడే
9492806520

నాకూ ఓ స్వప్నం ఉండేది.
ఆ స్వప్నానికీ రెండు రెక్కలు తొడిగి..
ఒకానొక దశలో ఎగరాలనే మరిచాను.
నా కలలేవీ.. నావి కాదప్పుడు..
నన్ను నాకు కానివ్వని లోకంలోకి అడుగులు వేసాక..
నన్నెందుకో నేనప్పుడు మరిచి పోయాను.
అప్పటికి రెండు చేతులు నా లోంచి మొలక వేసి
చెంపనద్దుకున్నాయి.
దిగులు చెట్లు ఊడలు పాతుకుంటున్న తరుణంలో..
ఊపిరి తీసుకోవాలన్నా.. అనుమతులవసరమయ్యేంత
అచేతనా స్థితి నుండి
కోలుకునే లోగా..
అసంకల్పితాలోచనారహిత సందర్భంలో మరో రెండు
చేతులు నన్ను చుట్టుకున్నాయి..
కాలం వడిలో కలత పడ్డా..
నాకు నేనే లేకుండా
నా లోకమంతా మర్చిపోయాను.
నా అనేకానేక చేతులు తో
అలవికానివన్నీ అవలీలగా చేసినప్పుడు



ఆత్మ సంతృప్తి అలుముకుని చిరునవ్వొకటి
పరుచుకుంటుంది.
రంగుల కలలెప్పుడూ రాలేదు కానీ..
నిజాన్ని స్వాగతించే సానుకూలత మాత్రం కలిగింది.
నాలుగు చేతులు కలిసి
నాకంటూ ఉన్నాననిపించే
జ్ఞాపకాలన్నీ దోసిట్లో నింపి
నన్ను నాకు తిరిగిచ్చాక..
బ్రతకడం మాని
జీవించడం మొదలెట్టిన క్షణాల సాక్షిగా..
దిగులు చెట్లను కూకటి వేర్లతో పెకలించిన
అనంతాన్ని నేనిప్పుడు..

♦

# భావాలను 'అద్వంద్వం'గా ప్రకటించిన కవి






శ్రీరామ్

- మాకినీడి సూర్య భాస్కర్
9491504045

రెండైనది ద్వంద్వం. కానిది అద్వంద్వం. సామాజిక అసమాన అసహజ చంచల చలనదృశ్యాలను నిర్ద్వంద్వంగా ఖండిస్తూ మండిస్తూ  అద్వంద్వంగా, చెప్పేదేదో ఒకటేగా ఘంటాపథంగా బల్ల చరచి, డప్పు కొట్టి మరీ చెప్పడానికి ప్రయత్నించారు కవి శ్రీరామ్. సీతారాం చెప్పినట్టుగా, కవికి కవిత్వమో నిర్ద్వంద్వ యుద్ధారావం. ఆ యుద్ధారావం సామాజిక అసమానతలపైన, విధ్వంసం పైన, సామాన్యుణ్ణి వ్యవస్థ చేస్తున్న మోసాలపైన, విధానాల అమల్లో వివక్ష పైన - విత్తనాల అడుగులేస్తూ నడిచే పొలంకాళ్ళ, పంటపాద ముద్రల ప్రశ్నల ఆశ్చర్యార్థకాల, భూసేకరణ సింహాసనం కింద నలిగిన అస్తిత్వాల పైన ముఖ్యంగా!

'ఒత్తిడికి పగిలిన నల్ల పలకమీద బుద్ధిగా ఓనమాలు దిద్దడ'మైన నేటి చదువును 'రెక్కలు తెగిన దారి'గా, చిత్రీకరించారు.

*"కలల్ని జోకొడుతున్న నిద్ర కళ్ళతో*
*స్కూల్ దారి మాత్రం*
*రోజూ వచ్చే బోన్సాయ్ దేహాల కోసం బెంగపడుతుం"*

దంటారు.

స్కూలుదారి తప్ప మరింకేమీ బాధపడటం లేదంటే, పిల్లల విద్యతో సంబంధమున్న తల్లిదండ్రులుగాని, గురువులుగాని, విద్యావేత్తలుగాని ఎవరూ బాధపడటం లేదనే విషయం వ్యంజనగా చెప్పడం బాగుంది.

*"నెల తప్పిన అమ్మ ఎదురు చూపుల మీద*
*ఐదీ గంట గురి చూసి వల వేస్తుందిగానీ*
*పోటీ పరీక్షల్ని రాసేసిన ప్రతి బాల్యం*
*తెల్లగుడ్డ కప్పుకుని ముఖం దాచేస్తుంది"* -

తెల్ల గుడ్డ కఫను కాక మరేమిటి? విద్యార్థుల ఆత్మహత్యలకి కారణమెవ్వరన్నది లక్షదాలర్ల ప్రశ్న. అయితే జవాబు తెలిసుండీ పిల్లల్ని అందుకే సమాయత్తపరుస్తున్న వ్యవస్థ మీద గురిపెట్టిన బాణం ఈ కవిత.

ఇరాక్‌లోని మోసూల్ పట్టణంలో ఐసిస్‌కి బలైన, ఉద్యోగం వెతుక్కుంటూ వెళ్ళిన 39 మంది భారతీయుల స్మృతి ఎలిజీ 'మెహరూం-కా-మొహబ్బత్ నామా' - ఇరుకింటి మోరీలాంటి ఆకలి కడుపుల అస్తిత్వాలకు స్పందనగా రాసిన కవిత.

పుట్టినిల్లునీ, సందునీ, పల్లెనీ తడిమిన నాస్టాల్జియా శ్రీరామ్ కవిత్వంలోని ఒక పాయ - బలంగా ఆవిష్కరింపబడింది. తెలియని వాటి ఆచూకీని కనిబెడతారు.

*"నువ్వూ నేనూ పంచుకోవాల్సిన ఆస్తి*
*మధ్యలో కోతొకటి రొట్టెలా తినేస్తుంటే*

*నువ్వూ నేనూ పుట్టిన నేలని*
*కొత్త స్మశానాల కోసం సమీకరిస్తోంటే*
*పచ్చని ఉనికై ఎర్రగా పండిన మనిషిని*
*జనాభా లిస్టులో దొరకని*
*ఆచూకీలా దహనం చేస్తున్నారా"* ంటూ.

తిరుగుబాటు లేని స్వేచ్ఛని పీల్చలేక సగం కాలిన దేహం ఊపిరికడ్డు పడుతోందంటూ గొప్ప అభివ్యక్తితో పలుకుతారు. శ్రీకాకుళ గిరిజన పోరాటాన్ని ప్రేమతో స్పృశిస్తూ సహానుభూతి చూపుతారు. ఎంత సహానుభూతైనా అందులో ఒక విప్లవ స్వరం, శ్రీరామ్ కవిత్వంలో ఎర్రజీరై ప్రతిబింబిస్తూనే ఉంటుంది.

*"పాలింకిన రొమ్ముల్లో ఎప్పుడూ*
*ఏడుపు బంతుల్లా ఎగిరిపడే కన్నీళ్ళుంటాయి*
*దాహంతో సలసలా కాగుతున్న ఆకాశాలూ*
*అస్థిపంజరాల్లో గూళ్ళు కట్టిన పిట్టలూ*
*వలస బట్టిన నేల ఎర్రటి పాటలు"* ఈయన కవితలు.

వలస వేదనల మౌన రోదనలకో 'విరస' కీలల సత్తువిచ్చే అక్షరాల జ్వాలలై ఎగసెగసిపడతాయి వీరి కవితల్లోని భావాలు. స్త్రీ దళితవాదాలు చాల రోజుల తర్వాత ఓ కొత్త డిక్షన్ని ఏర్పరచుకుని చైతన్యవంతంగా పలుకుతాయి.

*"పట్టె మంచం ప్రయోగశాలగా మారాకా*
*మొదటి రాత్రినుంచే / శరీరం మీద గాయాలన్నింటినీ*
*చీకటి దాచి పెడుతుంది ... ...*
*ఆడపిల్లని చూస్తే వేటాడే ఆకలి రోగాన్ని*
*ప్రేమ తీపి తెలీని క్లోనింగ్ శకలాన్ని*
*ఊసే తెలీని ఉత్పరివర్తనాన్ని / జన్మపటం గీసి మరీ*
*విముక్తి లేని చర్చా గోష్ఠి ... ... "*

ఇలా సాగుతూ, ఆడ భ్రూణ హత్యను పతాకస్థాయికి తీసుకెళ్ళి–

*"తన చుట్టూ తాను తిరక్కుండా / భూగోళం మాత్రం*
*మర్మాంగాలు తయారవ్వని / పిండం చుట్టూ*
*మళ్ళీ ఆబగా / ప్రదక్షిణం మొదలెడుతుం"* దంటూ, తీవ్రంగా నిరసిస్తారు.

అలాగే 'అట్రాసిటీ' కవితలో దళిత చైతన్యాన్ని 'సొంత నడకలు తెగ్గోసుకున్న పాదముద్రల' నిర్లజ్జగా జరుగుతున్న విధ్వంస చిత్రాన్ని గీస్తూ ...

*"ఇప్పుడో సారన్నా గుళ్ళో దేవుణ్ణి తాకితే బావుణ్ణు*
*ఇప్పటికైనా వెట్టివాడొకడు రాజైతే బావుణ్ణం'*టూ ఆశావహంగా పలుకుతారు శ్రీరామ్.

అలాగే వృద్ధ పెన్షనర్ల ఆక్రోశం, ఆత్మహత్యలే శరణ్యంగా మిగిలిపోతున్న రైతుల ఆవేదన, రకరకాలుగా అణచివేతకు గురై అస్తిత్వం కోల్పోతున్న స్త్రీల, దళితుల ఆక్రందనలు – అక్షరాలై పదాలై పాదాలై కవితలౌతాయి. అప్పుల జాతిగా మనల్ని మార్చేసినోడే–

*"పాత నోట్ల గాయాలకు కొత్త మారకం మందు రాస్తూ*
*అప్పిచ్చువాడు జాతి శవానికి వైద్యం చేస్తుంటాడ"*ని ఎద్దేవా చేస్తారు.

'పేదరికంపై గెలుపం'టూ రాజ్యం చేస్తున్న పనేమిటంటే, నిప్పు రాజుకున్న ఇంట్లో నివురు దాయడం, కంచె తెగిపోయిన చోట కాపలా కాయడం – కడుంగడు శోచనీయం.

పదునెక్కిన వాక్యం శ్రీరామ్ కవిత్వం. ఖాళీ గిన్నె స్వగతాన్ని వర్ణిస్తూ–

*"నేనొక డొక్కాదని డొమ్మరి డప్పుల చప్పుడులో*
*రెండు కొసలకి వేళ్ళాడదీసిన*
*సన్నని పెద్ద పేగుపై నిలబడ్డప్పుడు*
*భూమ్యాకాశాల చుట్టూ వేల మైళ్ళ దూరం పరిగెట్టేందుకు*
*వెలిగించిన నిరుపేద దీపాలు .... "*

ఇంతకంటె పదునుదేరిన వాక్యాలు ఎంత అరుదుగానోగానీ కనిపించవు.

*"స్వాతంత్ర్యం ఇన్నేళ్ళు అక్షయ పాత్రలో దాచిన*
*అమృతం రుచేమిటో గుర్తులేదు" కానీ,*
*"మిగలని ఒకే ఒక్క మెతుకు కోసం*
*అమ్మ పొగిలి పొగిలి దుఃఖిస్తోంది"* అంటూ, కడుపుకు నోచుకోని అన్నార్తుల మూర్తిచిత్రాన్ని చూపుతారు.

ఇలా ఆర్తితో ఆవేదనతో తాడిత పీడిత జనుల కన్నీటి కథలను వెతలను బలమైన భావాలతో పదునైన డిక్షనుతో ప్రకటించిన అక్షర(య) సమూహాల సమాహారం శ్రీరామ్ కవిత్వం 'అద్వంద్వం'.

అయితే, కొన్ని తావుల్లో తెలియని అనుభవాన్ని కవిత్వీకరించిన తీరు, ఆయా తావుల్లో ఆబ్స్ట్రాక్టుగా సాగుతుంది. అయితే స్థూలంగా, ఒక కవిత 'అద్వంద్వం' శీర్షికనే సంపుటికీ శీర్షికను చేసి విడుదల చేసిన కవి'తల'లోని మీమాంస లేని సూటిదనం నిండా పరచుకున్న కవితలివి.

'అద్వంద్వం' కవిత, రతికాలపు నిర్వేదానుభూతిని

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం జూన్ 2019 పురస్కారాలు

| దగాపడ్డ గొంతుకల కామన్ కోరస్ | పెద్దమ్మ గారి కల్లం | మట్టి పరిమళం |
| --- | --- | --- |
| వ్యాసం: రూ.500/- | కవితకు : రూ .500/- | కవితకు : రూ .500/- |
| రచయిత : డా॥ కె. శశిధర్ | రచయిత : వి. వెంకట్రావు | రచయిత : యు.ఎల్.ఎన్. సింహా |

■■■

*కథకు, కవితకు సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కారం, వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

'సర్వే''క్షణ'ం చేసిన కవితాస్వరం – స్త్రైణ్య భావనాపరంగా సాగుతుంది.

"నా నున్నటి రొమ్ముల రంగులో
కొంత కొండతనముందని చెప్పేవాడివి
కానీ లోపలి గరుకు అంచులు చూడని నువ్వు ..."

అంటూ మగాడి అసమగ్ర అర్థపాక్షిక దృష్టిని ఎత్తి చూపుతుంది.

రక్తదీపాలతో దహించుకుపోయే శరీరాన్ని మాత్రమే ప్రేమించడం మహాద్భుత కళగా భావిస్తాడు మగాడు. ఆ కళ, స్త్రీని మట్టి ముద్దలా పిసుకుతూ వేళ్ళ సారె మీద ఖజురహో శిల్పంగా మార్చింది.

స్త్రీల భావాలను పురుషుడు పూర్తిగా పలకలేడనడానికీ సాక్ష్యమవుతుందీ కవిత. ఎందుకంటే ఆ భావాలూ, భావనలూ ఎంతమాత్రమూ అతనికి అనుభవంలోకి వచ్చేవి కానేకావు.

"పాన్పు కఠిన రాత్రి మీద ఖాళీ
పూల సజ్జలానే పొర్లినాను" –

ఇంతవరకూ బానే ఉంది. కానీ అప్పటి స్త్రీ మనోవేదనను వివరిస్తూ చెప్పే తర్వాతి వాక్యంలో స్త్రీల భావాలతో పూర్తిగా పరిచయం లేని మగాడి పాక్షిక దృష్టి బయటపడిపోతుంది.

"నేనప్పుడు నొప్పి వీణలా మ్రోగి ఉంటాను"

మ్రోగి ఉంటాననే అన్నాడుగాని, 'మ్రోగాను' అని నిర్ద్వంద్వంగా చెప్పలేకపోయాడా పురుషపుంగవుడు.

"నేనప్పుడు పొరలుపొరలుగ
గుల్లబారి తలో దిక్కున
నిర్దయా నక్షత్రంలా ఒరిగి ఉంటా"ననే మీమాంసను కనబరుస్తాడు.

ఒక స్త్రీ రాస్తే ఈ మీమాంసను కొట్టి పడేసి నిర్ద్వంద్వంగా భావాన్ని వెలిబుచ్చి ఉండేది. ఇదంతా ఇంత విపులంగా ఎందుకు రాస్తున్నానంటే, పూర్తిగా మనవి కాని అనుభవాలను, అనుభూతులను కవిత్వీకరించదలచినప్పుడు కొంతైనా పరాయితనం తొంగి చూస్తూనే ఉంటుందని మనవి చేయడానికే.

ఇక్కడ నాకున్న కంప్లెయింట్ కవితలోని మగాడిమీదే కాని, కవిమీద ఎంతమాత్రమూ కాదు. ఎందుకంటే, "ఏ నిబద్ధతా లేకుండా కవి సమాజం పట్ల బాధ్యతగా నిలబడలేడు కనుక అతని సాహిత్య స్పృహ, రచనలో ప్రతిఫలించకుండా దాచలేడ"ని స్వయంగా కవే చెబుతున్నారు.

ఈ స్వల్ప మీమాంస తప్పించి, ఈ కవితంతా, ఆ మాటకొస్తే, శ్రీరామ్ కవిత్వమంతా చాల సహజంగా అద్వంద్వంగానే, 'పడవలా తగువుకు దిగుతా"ననే నిర్ద్వంద్వ నిశ్చితంగా సాగుతూ అలాగే ముగిసింది.

"నేనెప్పుడూ అస్తిత్వ చీకటి రతిలోని ఎంగిల్నే కాదు
నగ్న చైతన్యరహస్యాన్ని కూడా!
ఎన్ని నియంతృత్వ మర్మావయవాల్నైనా
దుప్పట్లోనే దాచిపెట్టు, నువ్వెక్కడున్నా సరే
నీ పక్కలో చురకత్తిన్నేను" అంటూ సదరు స్త్రైణ్య భావనలను అద్వంద్వంగానే ప్రకటించగలిగారు, కవి శ్రీరామ్ అభినందనీయులు. ♦

## నీటి బాగోతం

- డా॥ ఉదారి నారాయణ
9441413666

ఇంకా
ఈ మాటలు పాతబడలేదు
ఏడుపదుల స్వతంత్ర భారతంలో
నన్ను ఎండిన గొంతులకు దూరం చేయడం
కొందరికి నీటి బ్యాంకునై మూల్గడం
పాలకుల విషపూరిత వేషాల మహానటన
నీరు నీరంటూ
నీటితాడుతో మెడను చుట్టెయ్యడం
నీటి నాటకంలో నన్ను
అరగని వస్తువుగా అల్లడం
కరగని మైనపు బొమ్మలా మలచడం
నీటి రాజకీయాల వికృత క్రీడ



ఒక సంక బిడ్డతో
మరో సంక బిందెతో
తానే చేంతాడై రక్తపాదాలతో
రాళ్లని పంగలు పంగలుగా చీలుస్తూ
భూగర్భంలో తలదూర్చి
చెంబెడు ప్రాణజలానికి తండ్లాడుతున్న
ఆదిమ తల్లుల బతుకు పోరుకు ఏదిసాటి
సగం కాలుతున్న కడుపులతో
సగం బతికిన నిద్రతో
దోసెడు జీవజలం కోసం
కోసెడు దూరం ఆయాసపడడం
ఏ ప్రజాస్వామ్య వైభవానికి సంకేతం

కొండల కండరాల మైనింగ్‌ను
లారీల కొద్ది
నా నాభిని ఇసుక లోడ్‌లలో
నీటుగా సప్లయి చేసి

నన్ను బిస్లరీ బాటిల్స్‌గా మలచడం
పైకి పచ్చదనం భజనలు హోరెత్తించడం
పర్యావరణ బుర్రకథలు అల్లడం
పకడ్బందీ మోసం గాక ఇంకేమి!?

అడవుంటేనే నీళ్ల జాతర
నీళ్లుంటేనే భూతల్లి పురుడు పండుగ
చెట్లుంటెనే గాలికెరటాల కేరింతలు

కండ్లలో నీటిగాదెలెండి పోయినా
నా నోటిలో తేమ తూములు తెగిపోయినా
అడవి బిడ్డలు అడవిని గుండెగా మార్చుకుంటారు
వాళ్ల మహాసంకల్ప పాదయాత్ర కింద
నీళ్ల దొంగల ముఠా మొఖం చిట్లి
ముక్కలు ముక్కలుగా చెల్లా చెదురై
మూల్గుతూ మూల్గుతూ...... ♦

---

## మనిషి చేతిలో పడిందేమో!

- కొల్లూరు మురళీ కుమారి
9963744104



కనిపంచక
ఇంటికి రాక
ఊరంతా వెతుకులాట!
చేలల్లో
పాకల్లో
దిగుడు బావిలో
జాడ లేదు
తిరుగుతున్నారు
ఆవేశంగా చూస్తున్నారు
అటు పోయిందా!
ఇటు పోయిందా!
ఎటు పోయిందో!

దండోరా వేయించారు
సోది చెప్పించారు
కళ్ళు చూస్తే కాంతివంతం
మొగ్గల్లే మెరుస్తుంది
శరీరాకృతి విచ్చుకోలేదు
ఆడో మగో చెప్పే నాజూకు రాలేదు
నాన్న, అన్న పదాలకే పరిమితం

ప్రమాదం అంటే తెలియదు
రక్షించే చేతులే
ఆయుధాలని తెలియదు
ఏ మృగం చేతిలో పడినా
రక్షణ ఉంటుంది
మనిషి చేతిలో పడిందేమో! ♦

విశ్లేషణ

# జీవిత సత్యాన్వేషణ కోసం... పలవరించిన కవిత్వం






గంగవరపు సునీత

- వొరప్రసాద్
9490099059

వ్యక్తం చేసే మార్గం దొరకాలే గాని, ప్రతి ఒక్కరిలో పేరుకుపోతున్న జీవిత సంఘర్షణ బయటపడకుండా ఉండదు. దుఃఖం, సంతోషం, నవ్వులు, కన్నీళ్ళు, వేదన, చైతన్యం వీటన్నింటితోనూ కలగలిసిపోయిన జీవితాన్ని అర్థం చేసుకోవటం ఒకింత కష్టమే. ఏది సత్యం, ఏది అసత్యం? అన్న నిర్ధారణకు రావడం కూడా అంత తేలికైన పని కాదు. జీవితాన్ని అర్థం చేసుకోవడానికి జీవితానుభవానికి మించిన ఆధారం ఏముంటుంది? జీవితానుభవాన్ని గీటురాయిగా చేసుకుని జీవితాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నం చేయడం కొంత ఔచిత్యంతో కూడుకున్న పని. తన అనుభవంలోంచి జీవితాన్ని పరిపరి విధాలుగా అర్థం చేసుకోవటానికి చేసిన ప్రయత్నం గంగవరపు సునీత కవితా సంపుటి 'వెన్నెల చివుళ్ళు'లో కనపడ్తుంది.

*బతుకు దుప్పటి దులిపినప్పుడల్లా*
*అనుభూతి రేణువులు అస్తవ్యస్తంగా..*
*రాలిపడుతుంటాయి*
*......*
*మనసు తలుపులను ఎవరో తట్టి పోతున్నపుడు..*
*అంతరంగ అలజడులు*
*అంతర్గత సునామీలు...సృష్టిస్తుంటాయి! (అంతర్గత)*

ప్రతిరోజూ ప్రతిఇంట్లో దుప్పట్లు దులిపేది గృహిణులే. యాంత్రికంగా సాగిపోయే జీవితాన్ని ఒక్కసారి ఆపి తరచి చూసుకొంటే రాలిపడే అనుభూతి రేణువులు గురించి గంగవరపు సునీత మనసుకు హత్తుకునేలా చెప్పారు. కుటుంబాలలో బాధ్యత గల మహిళలంతా భారంగా సాగే బతుకు చిత్రంలో అప్పుడప్పుడూ జీవితాన్ని దులుపుకుంటే ప్రవాహంలా అనుభూతి రేణువులు రాలిపడతాయి. 'మనసు తలుపులను ఎవరో తట్టి పోతున్నపుడు' అన్న వాక్యం చాలా అలజడి రేపుతుంది. కవయిత్రి ఏ సందర్భం దృష్టిలో పెట్టుకుని ఈ భావం వెలిబుచ్చి ఉంటారు. అంతరంగ అలజడి ఎందుకు కలుగుతుంది? అది బహిరంగం ఎందుకు చెయ్యలేరు? ఆంక్షల సమాజంలో మనసు చేసే సవ్వడులన్నింటికీ బహిరంగం అయ్యే అవకాశం ఉండదు. గంగవరపు సునీత కవిత్వం ఎక్కువగా మనస్సు కేంద్రంగా సాగుతుంది.

*అవసరమో..అనివార్యమో*
*మనసు విరిగిన తనువులు*
*మళ్ళీ మళ్ళీ .. చేరువవుతూనే వుంటాయి.*
*.....*
*ఒకే గూటిలో సందేహాలతో*
*సమస్యలతో...నలుగుతున్న*
*రెండు దేహాలం*
*ఒక్కటి కావాలని ప్రయత్నిస్తూనే*
*ఇద్దరిగా జీవిస్తుంటాం (చీకటి నిజాలు)*

కవయిత్రి మనస్సును బద్ధలు కొట్టిన, బలంగా తాకిన అనుభవాలు కవితలై మన ముందు ప్రత్యక్షమవుతాయి. అలా వచ్చిన కవితలు జీవిత సత్యాలుగా మనల్ని ఆలోచింపచేస్తాయి.

భార్య భర్తల మధ్య ఒక అనివార్యమైన స్థితిని పై కవిత వ్యక్తం చేస్తుంది. పదునైన పదాలతో కవయిత్రి భావం ఒక్కసారిగా బయటకు తన్నుకొస్తుంది.

జీవితానందాన్ని వ్యక్తం చేసే కవితలు ఈ పుస్తకంలో చాలానే ఉన్నా జీవిత ఆకాంక్షలు నెరవేరవేమో అన్న సందేహాన్ని వ్యక్తం చేసే కవితలూ ఉన్నాయి. అయితే తనకెదురైన ప్రతీ అనుభవాన్నీ లోతుగా పరిశీలించి కానీ ఊరుకోదు కవయిత్రి. స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, ప్రణయం, స్నేహం వంటి అంశాల గురించి ఎక్కడా అస్పష్టత, అసభ్యతలకు, అనుమానాలకు తావులేకుండా కవిత్వీకరించడం చాలా తేలికగా చేశారు.

*ఆ కళ్లు చూసేది..*
*భౌతిక దృశ్యాలనే కాదు*
*బతుకు లోతుల్లోని సుడి గుండాలను..*
*బతుకు తెరపై ఆడే సప్తవర్ణ చిత్రాలనూ! (ఆ..కళ్ళు)*

తెరపై ఆడే సప్తవర్ణ చిత్రాలనూ! అన్న కవితా చరణం కవయిత్రికి జీవితం పట్ల ఉన్న దృక్పథాన్ని పాఠకుడికి పట్టిస్తుంది. జీవితాన్ని ఒక కోణంలో మాత్రమే పరిశీలించడం లేదు కవయిత్రి. జీవితంలోని సప్తవర్ణ చిత్రాలనూ నా కళ్ళు చూస్తున్నాయని కవయిత్రి చెప్తుంది. జీవితంలోని ఆశ, నిరాశలనూ, సుఖ, దు:ఖాలనూ, కష్టాలనూ, ఆనందాలనూ అన్నింటితో కూడిన జీవితాన్ని లోతుగా అన్వేషిస్తూ సాగుతుంది గంగవరపు సునీత కవిత్వం. జీవితానందం అంటే ఏంటి? ఎక్కడ దొరుకుతుంది? జీవితంలో సంతోషం లేకుండా చేస్తున్నది ఏమిటి? ఈ జీవితానికి దు:ఖం తప్పదా వంటి భావాలు ఇంచుమించు అన్ని కవితల్లో వ్యక్తం అవుతుంటాయి.

వర్తమాన సామాజికాంశాలను కూడా చాలా తేలికైన పదాలతో అలవోకగా కవిత్వం చేస్తారు కవయిత్రి ఈ పుస్తకంలో.

*అవును.. ఇది అర్ధరాత్రి స్వతంత్రమే!*
*ఇక్కడ అంధకారంలో ఎన్నో బతుకులు*
*వెలుగు చూడకుండానే తెల్లారిపోతున్నాయి (అర్ధరాత్రి స్వతంత్రం)*

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏళ్ళయినా వెలుగు చూడని బతుకుల గురించిన కవయిత్రి వ్యక్తీకరణ ఇది. అర్ధరాత్రి వచ్చిన స్వాతంత్ర్యం దేశంలో ఎందరినో ఇంకా అంధకారంలోను ఉంచిందని పదునుగా చెప్పిన ఈ వాక్యాలు పాఠకుడిని కదిలిస్తాయి.

*కన్నుల్లో చిప్పిల్లిన తడి*
*గుండెలను తడిమినపుడు*
*విరిగిపడిన కలల సాకారాలు*
*భావాగ్నిలో మసలినపుడు*
*నేనిలా..కవితలోకి తొంగి చూస్తుంటాను*
*కవితగా మారుతుంటాను (కవిత్వీకరణ)*

అంటారు కవయిత్రి. లోతైన మనసు అలజడిని, సంతోషాన్ని, దు:ఖాన్ని అలతి అలతి పదాలతో కవిత్వంగా మారుస్తారు సునీత. కవయిత్రి అలవోకగా చేసే తెలుగు పదాల విన్యాసం పాఠకుడిని ఆకట్టుకుంటుంది. చాలా మామూలు పదాలతోనే ఎంతటి విషయాన్నైనా కవిత్వం చేయగలదు కవయిత్రి అనిపిస్తుంది. సులభశైలి వల్ల కవిత్వం చదువుకుంటూ పోతాం. ఎక్కడా విసుగనిపించదు. హాయిగా ఉంటుంది.

*నా కవితలో..*
*కలతలుంటాయ్.. కన్నీళ్లుంటాయ్*
*జవాబుల్ని అన్వేషించే..*
*కఠిన నిజాలూ వుంటాయ్*
*........*
*కవిత్వమంటే...*
*మనసులో వున్నది రాయడం కాదు*
*మనసులు కదిలించేలా రాయడం (కవిత్వీకరణ)*

ఇదీ కవయిత్రి అసలు లక్ష్యం. కవులు మనసులో ఉన్నది రాస్తారు. కొంతమంది కదిలించడం కోసం రాస్తారు. గంగవరపు సునీత కదిలించడం కోసం రాస్తారు. ఆ విషయం ఈ కవిత్వం చదివితే మనకు తెలుస్తుంది. జీవితాన్ని, సమాజాన్ని పరిశీలించి తనకర్థమైన జీవిత లోతునీ, బరువునీ నిజాయితీగా కవిత్వం చేశారు సునీత. అందువల్లే పాఠకుడికి కూడా ఆ జీవితానుభవాలు పరిచయం ఉన్నట్లే అనిపిస్తాయి. కవయిత్రి చేస్తున్న జీవితాన్వేషణలో తనూ తల దూరుస్తాడు. అది కవయిత్రి సాధించిన విజయమే.

*ఆమె అంతరంగ పూదోటలో*
*వాడిన పువ్వులన్నీ*
*మళ్లీ మళ్లీ విచ్చుకుంటుంటాయి*
*కలలు గానో... కవితలు గానో..!(వెన్నెల చివుళ్ళు)*

ఈ పుస్తకానికి శీర్షికగా ఉన్న కవిత 'వెన్నెల చివుళ్ళు'. తన కవిత్వం వెనకాల ఉన్న రహస్యాన్ని విప్పిచెప్పిన కవిత

ఇది. కలలు గానో... కవితలుగానో తన అంతరంగ భావాలు విచ్చుకుంటాయనడంలో తనలో ఉన్న కవితా శక్తి నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుందని చెప్పకనే చెప్పారు కవయిత్రి.

గంగవరపు సునీత తన చుట్టూ అల్లుకుని ఉన్న వ్యక్తులతో తనకున్న గాఢమైన అనుబంధాలను ఎక్కువ భాగం కవిత్వం చేశారు. వీటిలో ఎక్కువ శాతం ప్రేమ కవితలు. ఆయా వ్యక్తుల పట్ల తనకున్న గాఢమైన ప్రేమను వ్యక్తం చేస్తారు. ఎక్కువగా తన సహచరుడు, తల్లి, నాన్న, పిల్లలు, స్నేహితులు, చిన్ననాడు తనకు బాగా నచ్చిన తన ఊరు గురించి పరవశంతో రాస్తారు. ఈ పుస్తకంలోని కవయిత్రి రాసిన అంశాలు ప్రతీ ఒక్కరి జీవితంలో తారసపడేవి కావడంతో అందరూ ఆ వ్యక్తిగత ప్రేమ, ప్రణయ భావాలకు కనెక్ట్ అవుతారు. అయితే సునీత ఆ భావాల వ్యక్తీకరణకే పరిమితమవ్వలేదు. ఆమె చుట్టూ వ్యక్తులే కాకుండా వ్యవస్థగా మారిన సమాజం కూడా ఉంది. అందుకే అనివార్యంగా సామాజికాంశాలను గూడా కవితా వస్తువులుగా స్వీకరించారు.

వ్యక్తికీ సమాజానికీ నిరంతర ఘర్షణ తప్పదు. వ్యక్తి సంఘర్షణనీ, వ్యవస్థ లోపాల్ని తన కవిత్వం ద్వారా వ్యక్తం చేశారు కవయిత్రి. సమాజం వ్యక్తుల్ని తయారు చేస్తుందా? వ్యక్తులే సమాజాన్ని తయారుచేస్తారా? అంటే విత్తు ముందా చెట్టు ముందా? లాంటి ప్రశ్న సునీత కవిత్వం చదివితే కూడా పాఠకుడికి కలుగుతుంది. వ్యక్తి ప్రవర్తనకు కేవలం అతన్నే లేదా ఆమెనే నిందించడం సరైనదేనా? సమాజ ప్రభావం వుండదా? వ్యవస్థ ప్రభావం ఉండదా? స్త్రీని అణచి వేసినా, దళితులని అమానుషంగా అంటరానివారిని చేసినా వేల యేళ్ళుగా వ్యవస్థగా మారిన సమాజమే కదా! ఆ సమాజ దృక్పథంలోంచి ఆ విలువలు వచ్చాయన్న అవగాహన అవసరం. వ్యక్తులను విడిగా అర్థం చేసుకుంటే సరైన అవగాహన కలుగదు. కొంత నిరాశకు కూడా గురవుతాం. 'వీళ్ళింతే! ఇక మారరు" వంటి అభిప్రాయాలు సామాజిక దృష్టి లేకపోవడం వల్ల మారుతున్న కాలాన్ని, మారిన సమాజాన్ని పరిశీలించకపోవడం వల్ల ఏర్పడతాయి. తక్షణం అలా నిరాశాపూరితంగా కనిపించినా దీర్ఘకాలంలో సమాజం ఆధునిక రూపం తీసుకుంటుంది. ఆ ఆధునిక రూపంలో అప్పటిదాకా పాతవ్యవస్థలోని బూజుపట్టిన భావాలు, విలువలు అన్నీ కొట్టుకుపోతాయి. మనుషుల అభిప్రాయాలూ, విలువలు, ప్రవర్తనలూ మారతాయి. ప్రేమకూ, అనుబంధాలకూ, గౌరవాలకూ అర్థాలూ మారతాయి.

గంగవరపు సునీత కవిత్వం చదివితే ఇన్ని ఆలోచనలు, అభిప్రాయాలూ మనలో కందిరీగల తుట్టెలా రేగుతాయి. కవయిత్రి వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవించినా ఏకీభవించకపోయినా వ్యక్తిగా తనలోని సంఘర్షణను, నిజాయితీగా వెలిబుచ్చిన తీరునూ, అర్థం చేసుకుంటాం.

*చాలామంది చెప్పినట్లు...*<br>*జీవితం మహత్తరంగా ఏమీ లేదు*<br>*కళ్లు మూసి తెరిచేంతలో*<br>*కనుమరుగయ్యేంత చిన్నదికాదు*<br>*నడిచి నడిచి... అలసిపోయేంత*<br>*పెద్దది కూడా కాదు*<br>*.....*<br>*అంతా చీకటే అని*<br>*చేతులు ముడుచుకున్నపుడు*<br>*వెన్నెలై కురిసి*<br>*నిర్వేదపుటాలోచనల్ని వెచ్చని నీళ్లతో కడిగేస్తుంది*<br>*అందుకే..*<br>*జీవితమంటే నాకు ప్రేమ" (జీవితమంటే...)*

ఒక అర్థవంతమైన అవగాహనను ఈ కవిత పాఠకుడికి అందిస్తుంది. ఆ అవగాహనలో నిజాయితీ ఉంది. ఆ నిజాయితీనే కవయిత్రిని ముందుకు నడిపిస్తుంది. ఆ అన్వేషణ కవయిత్రిని మరింత జీవిత లోతుల్లోకి అనివార్యంగా నడిపిస్తుంది. మనిషి కేంద్రంగా సమాజం మరింత అందంగా రూపొందడం కోసం ఆ అన్వేషణ దోహదం చేస్తుందని ఆశిద్దాం.

అర్థమైనంత వరకూ జీవితాన్ని అక్షరాల్లోకి ఒంపి కవిత్వం చేసే ప్రయత్నం చేశారు కవయిత్రి. ఆమె వ్యక్తం చేసిన భావాలు మన మనసులను కూడా తట్టి లేపుతాయి. జీవితంలోని అనేక అనుభవాలు మనస్సు మీద వేసిన ముద్రలు ఒక్కసారిగా మనలో జూలు విదుల్చుకుంటాయి. ఈ కవిత్వం చదివి మన మనస్సు స్పందిస్తుంది. మనస్సును తట్టిలేపే ఈ కవిత్వంతో మనమూ సంతోషంగా ప్రయాణం చేస్తాం. కాస్తంత దుఃఖమూ, కొంత సంతోషమూ, నిరంతర సంఘర్షణా అదే జీవితం అంటూ కొంత అర్థం చేయిస్తుంది కవయిత్రి 'వెన్నెల చివుళ్ళ'ంటూ చెప్పిన తన ఈ కవిత్వం ద్వారా. ♦

## కవిత

# నడిచొచ్చిన దారి

- చెన్నా రామ మూర్తి.
8886885173

అక్కడ పుష్పాల్లేవు
సుగంధ పరిమళాల్లేవు
సమాధిని అందరూ
పూర్తిగా మరచిపొయ్యే రోజొకటి వస్తుందని
చర్విత చర్వణమే?
దాహం తీరని భావావేశం
చిచ్చుర పిడుగై  అందరి హృదిలో
అద్భుత బీజమై
మొక్కై, వట వృక్షమై
శాఖోప శాఖలై
విశ్వ వ్యాపితమై
ధిక్కార స్వరమై  దివిటీగా జ్వలించింది?
శాశ్వతత్వానికి ప్రాతిపదికను
సిద్ధం చేసుకున్న క్షణం నుంచి
భావం భయాన్ని తరిమి
గుండెనిండిన  ధైర్యం
నడిపించిన దారెంట
రెళ్ళు పొదలు తప్పుకున్నాయ్
చీకటి అలుముకున్న జీవితాల్లో
చిరస్థాయిని మరిపించే వెలుగు రేఖల్ని
కళ్లారా చూసాను?



గాంధీ కల
మండేలా జాతి భావన
అంగ్సాన్ సుకీ స్వేచ్ఛా తత్వం
మదర్ శాంతి కాముకత
బీటలుబారిన సోవియట్
ఆకలి మింగేసిన సోమాలియా
కందుకూరి గురజాడ
శ్రీ శ్రీ  తిలక్
చాసో శివారెడ్డి
బానిసత్వం  నుంచి స్వాతంత్ర్యం దాకా
ఆధునికం దాకా
నిన్నటి దాకా
గుండె గదుల్లో నిక్షిప్తమై
పదుగురికి పంచిన రోజులు గుర్తున్నాయ్
చాలు?
పుష్పాల్లేకున్నా పరవాలేదు?
సమాజంలో ఆశయాలు పుష్పిస్తున్నాయ్?
నెమరు వేసుకున్నానంతే? ♦

---

# అప్పుడప్పుడూ...

- వశిష్ట సోమేపల్లి
9966460536

అప్పుడప్పుడూ ఏడవాలి
కొద్దిగా బరువుల్ని జార్చుకోడానికే
కాదు
జ్ఞాపకాల్ని ఇంకొంచెం
మోయడానికి
జీవితాన్ని ఇంకొంత కొలవటానికి
కొన్ని విత్తనాల్ని దుఃఖంతో
నాటడానికి

చుట్టూ నిండుకున్న చీకటో
కట్టెపై పండుకున్న రేపో
కళ్ళల్లోంచి ఎగిరిపోతూ వెక్కిరిస్తున్న
కలో
ఓ చినుకై
ఓ చెరువై



చెంపల్ని కడిగే వరదై చెప్తాయి
గుండె తటాకం నిండిందని
కన్నీళ్లు చాలా అవసరం
అవి బతుక్కీ, చావుకీ, జీవితానికీ
సాక్ష్యాలు
జారే రెండు బిందువులు చాలు
జీవనది ప్రాణంతోనే
వుందనటానికి
అందుకే
అప్పుడప్పుడూ ఏడవాలి
మళ్ళీ ఏడ్వనక్కర్లేదన్నట్టు
మళ్ళీ పుట్టాలన్నట్టు ♦

కథ

# ధర్మ వడ్డీ



08.09.1910 - 02.11.1962

- త్రిపురనేని గోపిచంద్

నేనా వూరు ఎందుకు వెళ్ళానో, నా కిప్పుడు జ్ఞాపకం లేదు. కాని వెళ్ళటం, చిన్నప్పటి స్నేహితుడు కనపట్టం, తన ఇంటికి నన్ను తీసుకువెళ్ళటం జరిగింది. కలవక కలుసుకోవటం వల్ల, చిన్నప్పటి విషయాలు తలుచుకొని నవ్వుకుంటూ వున్న సమయంలో అతడొచ్చాడు. రావటం రావటం ఎలా వచ్చాడని?

ముందువాకిలి నెమ్మదిగా తెరిచాడు. కుడికాలు గడపలో పెట్టి అటూ ఇటూ దొంగచూపులు చూశాడు. చంకలో వున్న మూటని పదిలంగా రెండోచేత్తో పట్టుకొని, తల ఓరగా పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ, నా స్నేహితుని దగ్గరకు వొచ్చి చంకలో మూట అందిస్తూ, "ఇదిగోనోయ్ డబ్బు" అన్నాడు.

అసలు అతన్ని చూడగానే నా స్నేహితునికి ముఖ కవళికలు మారిపోయినై. అంతకు ముందున్న సంతోషం మాయమైపోయింది. నెమ్మదిగా మూట అందుకుంటూ, "మనిషంటే మనిషివి నువ్వే సూరయ్యా! నికార్సయిన మనిషివి" అన్నాడు.

ఈ మాటకు సూరయ్య సంతోషం పైకి కనపడనివ్వకుండా, "మాటలకేంలే! డబ్బు తీసుకోగానే కాదు. నెల రోజుల్లో అసలు ఫాయిదాలు ఇచ్చివెయ్యాలి. వడ్డీ నీకు తెలిసిందేగా - ధర్మ వడ్డీ - నెలకు నూటికి రూపాయిన్నర. అదైనా నువ్వని ఇస్తున్నాను." అన్నాడు.

"అలాగే సూరయ్యా! నెల దాటకముందే ఇస్తాను" అన్నాడు నా స్నేహితుడు.

ఇస్తానంటే కాదు. మాట చెల్లించుకోవాలి. శుభకార్యం ఒకటి తలపెట్టానా? మంచికీ చెడుకీ డబ్బు కావాల్సివొస్తుంది. తర్వాత కోర్టు గీర్టూ అంటే..."

అదేమిటి సూరయ్యా! నీ దగ్గర ఎన్నిసార్లు డబ్బు తీసుకోలేదు. ఎన్నిసార్లు ఇవ్వలేదు. ఎప్పుడైనా మాట తప్పీలు వొచ్చిందా?"

"సరేలే. డబ్బు లెక్కపెట్టుకో. అన్నీ రూపాయిలే. కొద్దిగా మాత్రం చిల్లర వుంది. మళ్ళీ నాకు రూపాయిలే ఇవ్వాలి సుమా! నోట్లూ గీట్లూ అంటే కుదరదు."

"నువ్వు చెప్పాలా, సూరయ్యా" అంటూ నా స్నేహితుడు మూట విప్పాడు. చూసేటప్పటికి నా తల తిరిగిపోయింది. అయోమయం అయిపోయింది. ఆ మూటలో వున్నవన్నీ రాళ్ళే! చిన్న చిన్న రాళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ. పెద్దవన్నీ కంకరరాళ్ళూ. చిన్నవన్నీ గులకరాళ్ళూ! నమ్మలేక నా స్నేహితుని మొహం పరీక్షగా చూశాను. అతను మాత్రం ఇదంతా లెక్కచెయ్యకుండా, అతి జాగర్తగా ఆ రాళ్ళని తీసి ఒక్కొక్కటే లెక్క పెడుతూ

కూర్చున్నాడు.

నాకేమీ తోచక సూరయ్య వంక చూశాను. అతనింకా తల ఓరగానే పెట్టి లెక్క పెట్టబడుతూవున్న రాళ్ళను రెప్ప వెయ్యకుండా పరీక్షిస్తున్నాడు. ఇంతలో నా స్నేహితుడు లెక్క పూర్తిచేసి, "సరిపోయినయి, సూరయ్యా" అన్నాడు.

"ఇవ్వాళ సరిపోయినై అంటే కాదోయి. ఇవ్వాళ ఇరవై. మళ్ళా ఇరవై సోమవారం నాటికి నా డబ్బంతా దమ్మిడీల్తో ఇచ్చెయ్యాలి" అని జ్ఞాపకం చేసి నా స్నేహితుడితో మూడుసార్లు "ఇస్తాను" అనిపించుకొని వెళ్ళిపోయాడు సూరయ్య.

అతడు ఎప్పుడు వెళ్తాడా, ఈ తంతేమిటో ఎప్పుడు తెలుసుకుందామా అని కూర్చున్న నేను, అడుగుదామని నా స్నేహితునివైపుకి తిరిగేటప్పటికి, అతడు చేత్తో నన్ను వారించి వాకిలివైపు చూపాడు. నేను అటు చూట్టం, సూరయ్య గభాలున తలుపు నెట్టుకొని లోపలకు రావటం ఒకేసారి జరిగింది. మనిషి ఇదివరకువుల్లే లేడు. అపాదమస్తకం వొణికిపోతున్నాడు. కళ్ళు యెర్రగా జ్యోతుల్లా వున్నై. గాలి తెగ పీలుస్తున్నాడు. తల మాత్రం ఓరగానే వుంది.

ఒక్క క్షణం వాకిట్లో ఆగి రంయిన నా స్నేహితుడి మీదకు వచ్చి ఇలా కేకలువేశాడు– "ఏదీ నా డబ్బు? ఎన్నాళ్ళయింది? ఇదిగో అదిగో అంటూ కుక్కని తిప్పుకున్నట్టు నీ యింటిచుట్టూ తిప్పుకుంటావా? పరువూ మర్యాదా ఉండక్కర్లా? కడుపుకి అన్నం తింటున్నావా, గడ్డి తింటున్నావా?"

నిజం చెప్పొద్దూ! ఈ మాటలు వినేటప్పటికి నాకు కంపరమెత్తింది; కోపం వచ్చింది కాని ఏమి చెయ్యటం? గుడ్లు వప్పచెప్పి చూస్తూ కూర్చున్నాను.

నా స్నేహితుడు భయంగా, అతి వినయంగా, "ఇదిగో సూరయ్యా, నీ డబ్బు! నాల్గు రోజులు ఆలస్యమైనంత మాత్రాన నీబోటి పెద్దమనిషి ఇట్లా నోరు పారేసుకోవడం ఏం మర్యాద?" అని తన దగ్గరే వున్న ఆ రాళ్ళమూటని ఇచ్చాడు.

"మరి వడ్డీయో? డబ్బు నాకు చేదై ఇచ్చాననుకున్నావా? నీ తాతకి అచ్చుండి ఇచ్చాననుకున్నావా? పూర్తి పరిష్కారం చేసి కదులు," అని బొడ్లో చెయ్యేసి నిలవేశాడు సూరయ్య.

"ఇస్తాను సూరయ్యా, వొదులు" అన్నాడు నా స్నేహితుడు.

"తీసుకురా" అని ఒక్క తోపు తోశాడు సూరయ్య.

నా స్నేహితుడు పడబోయి నిభాయించుకొని గోడ పక్కకు వెళ్ళి, పది రాళ్ళు ఏరి తెచ్చి సూరయ్య చేతిలో పెట్టాడు. సూరయ్య వాటిని లెక్కపెట్టుకొని, నా స్నేహితునితో ఒక్క మాటైనా అనకుండా గిరుక్కున వాకిలివైపుకు తిరిగి తల ఓరగా వుంచుకొని గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

నా స్నేహితుడు ఒక్క నిట్టూర్పు విడిచి నేను అడగవలసిన అవసరం లేకుండా తానే యిలా చెప్పాడు– "పాపం ఏం చెప్పను? ఒకప్పుడు ఈ ఊళ్లోకల్లా షావుకారు సూరయ్య. ఇప్పుడు పిచ్చెక్కి యీ విధంగా తయారయ్యాడు" అన్నాడు.

"ఇతనికి పిచ్చా! ఎందుకెత్తింది? పిచ్చిలో యిదేమిటి?" అని అడిగాడు.

నా స్నేహితుడు సూరయ్య కథ యీ విధంగా చెప్పాడు:

"సూరయ్య యీ గతికి రావటానికి అతని తండ్రే కారణం. అతని తండ్రి చాలా మంచివాడు. మెత్తని హృదయం కలవాడు. అటువంటి అతడే, కొడుకు పతనానికి కారకుడయ్యాడు."

"అంత మంచివాడు..."

చెప్తాను విను. అంత మంచివాడు అవటం వల్ల దానాలుచేసి, అడ్డాలు వుండీ తన ఆస్తంతా పాడుచేశాడు. అన్నీ పోయిన తర్వాత పలకరించే దిక్కు లేకుండా చచ్చిపోయాడు. ఇది కన్నులారా చూచిన సూరయ్యకు సంఘం మీద కసి ఏర్పట్టంలో ఆశ్చర్యం లేదు. అందుకని పూర్తిగా తన స్వభావాన్ని మార్చుకొని, పెత్తనానికి వొచ్చినప్పటి నుంచీ కఠోరంగా సంపాదించటం మొదలుపెట్టాడు. ఉన్న నాలుగు ఎకరాలూ అమ్మేసి వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు. మనుషుల్తో వున్న ఇతరత్రా సంబంధాలన్నీ క్రూరంగా తెగ్గొట్టుకున్నాడు. తనకీ, మిగిలిన మనుషులకీ ఒక్కటే సంబంధం – వడ్డీ వ్యాపారం. తాను వడ్డీకి డబ్బు యివ్వటానికి పుట్టాడు: మిగిలిన జనం డబ్బు పుచ్చుకొని వడ్డీ ఇచ్చుకోటానికి పుట్టింది.

ఇట్లా తయారై, మిగిలిన రైతుల్ని పీల్చి పిప్పిచేసి కొద్ది సంవత్సరాల్లోనే వూళ్ళోకల్లా షావుకారై కూర్చున్నాడు. ఎంత షావుకారైనా డబ్బు సంపాదించటం అలవాటైన తర్వాత పద్ధతులు యెలా మారతై – కనక డబ్బు అవసరం లేనప్పటికీ కూడా పాత పద్ధతుల మీదే నడిచాడు. పిల్లికి బిచ్చం పెట్టేవాడు కాదు. అరిచి గీ పెట్టినా దమ్మిడీ జారనిచ్చేవాడు కాదు. బాకీదార్లని ఎన్ని కష్టాలు పెట్టాలో అన్నీ పెట్టి, ఇన్ని నీళ్ళు కూడా పుట్టకుండా చేసి తన డబ్బు పిండుకునేవాడు. ఆ పిండుకోవటంలో కూడా దయాదాక్షిణ్యాల్లేవు. కొంపలు కూలినా, కుటుంబాలు నాశనమైనా అతని హృదయం కరిగేది కాదు.

అందుకని అతని డబ్బుతోపాటు, అతనిమీద వూళ్లో

అసూయా అసహ్యం కూడా పెరుగుతూ వచ్చినై. అతన్ని చూస్తే భయమే తప్ప, యిష్టం ఒక్క వ్యక్తికిక్కూడా లేకుండా పోయింది. సూరయ్య యిది కూడా మంచిదే అనుకున్నాడు. నాక్కావలసింది డబ్బు! వీళ్ళ యిష్టం ఎవరిక్కావాలి? అంటూ వుండేవాడు. పరిస్థితులు ఇట్లా వుండగా ఒక సంఘటన జరిగింది.

ఈ ఊళ్ళోనే అవతల వీధిలో చంద్రయ్య అనే రైతు వున్నాడు. చంద్రయ్య ఈ సూరయ్యకి రెండువందల రూపాయల బాకీ యివ్వలేదు. చంద్రయ్య అవటం చిన్న రైతే ఐనా టౌన్తో సంబంధం వున్నవాడు అవటం వల్ల, డబ్బన్నా కోర్టన్నా లెక్కలేకుండా వుండేవాడు. డబ్బున్నవాళ్ళంటే అసహ్యం వుంది. భయం లేదు. తనకు అవసరానికి డబ్బిచ్చాడనే విశ్వాసం లేకపోగా తన దగ్గర సూరయ్య అన్యాయంగా డబ్బు దోచుకుంటున్నాడనే భావం, కోపం కలిగినవాడు. సూరయ్య హెచ్చు వడ్డీ వస్తుందని అతనికి అప్పు పెట్టాడేగాని, పెట్టిందగ్గర్నుంచీ డబ్బు రాదేమో అనే భయంతో అతని ఇంటి చుట్టూ తిరగటం మొదలుపెట్టాడు. ఒకరోజు చంద్రయ్యని నా డబ్బిచ్చి కదలమని నిలవేశాడు. నానా దుర్భాషలూ ఆడాడు; దాన్తో లోలోపల రగులుకుంటున్న అగ్ని చంద్రయ్యలోనుంచి గుప్పున బయటపడింది – "నేను దమ్మిడీ ఇవ్వను. నీ తాత్తో చెప్పుకో! ముందు గడపలో నుంచి అవతలకు వెళ్ళు" అని కేకలువేశాడు.

పాపం సూరయ్యకు ఇట్లాంటి అనుభవం ఇదివరకెప్పుడూ కలగలేదేమో, చంద్రయ్య మాటలకు నిరుత్తరుడై ఒక్క నిమిషం మాట్లాడలేకపోయాడు.

"వెళ్ళవ్!" గద్దించాడు చంద్రయ్య. "చంద్రయ్యా! ఇది నీకు మంచిది కాదు: కోర్టుకు లాగి పప్పు తీయిస్తాను." అన్నాడు సూరయ్య.

"పప్పు తీయిస్తావట్రా మాదచ్చోద్" అని నానా బూతులు కూసి మెడమీద కర్రవేసి బయటకు గెంటాడు చంద్రయ్య.

ఇక చూడు సూరయ్య సంగతి. సూరయ్యకు శివం ఎత్తింది. పిచ్చి గంగిర్లెత్తినై. కనపడ్డవాడుకల్లా చెప్పాడు. "ధర్మవడ్డీ – ధర్మవడ్డీ కూడా ఇవ్వడట! అసలే ఇవ్వడట! ఇదెక్కడన్నా వుందా? రాములవారి కాలం నుంచీ ఈ వడ్డీ వుందికదా!" అని మొత్తుకున్నాడు.

తిరిగి తిరిగి ఇంటికి వెళ్ళి గబగబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, అంగోస్త్రం నడుంకి కట్టి తెల్లగుడ్డ గొడుగు చంకన పెట్టి టౌన్కి బయల్దేరాడు. అప్పటికీ ఆశ చావక, చంద్రయ్య వాకిలిముందు సకిలిస్తూ నాలుగైదుసార్లు అటూ ఇటూ పచారు చేశాడు: బజార్న పోతున్న వార్ని నిర్నినిమిత్తంగా పిలిచి, "కొంచెం కోర్టులో పనివుండి టౌన్కి వెళ్తున్నాను" అని ఇంట్లో వున్న చంద్రయ్యకు వినబడేటట్లు చెప్పాడు. చంద్రయ్య "కోర్టుక్కాదు నిన్ను పుట్టించిన బ్రహ్మదేముడి దగ్గరకు వెళ్ళు. ఈ వూరు నీళ్లు నీకు ప్రాప్తం లేదు" అని ఇంట్లోనుంచే కేకవేశాడు.

ఇంకేం చేస్తాడు? ఇక తప్పేదేముంది? చంద్రయ్య మాటలకు కొంచెం జంకినా డబ్బెలా వొదులుకోవటం? మనస్సుని తిట్టి లోబరుచుకొని టౌన్కి వెళ్ళి ప్లీడరుతో మాట్లాడి, చంద్రయ్యకు రిజిష్టరీ నోటీసు ఇప్పించాడు. నోటీసైతే ఇప్పించాడేగాని, మనస్సులో ఆరాటం హెచ్చింది. దిగులుదిగులుగా వుండి ఏమీ తోచక టౌనులో అటూ ఇటూ తారట్లాడి ఇంటికి బయల్దేరేటప్పటికి అతనికి భయం వేసింది. ఆ డొంక మా ఒక్క వూరికి వచ్చేదే అవటం వల్ల మనుష్య సంచారం తక్కువగా ఉంటుంది. పైగా రెండు పక్కలా కొరివిదయ్యాలు తలలు విరబోసికున్నట్లు కనబడే, గుబురుగా పెరిగిన చెట్లు. సూరయ్య ధైర్యంచేసి ఆంజనేయ దండకం పఠిస్తూ డొంకలో పది గజాలు నడిచాడు. ఆ పెద్ద మర్రిచెట్టు చూశావుగా, అక్కడకు వొచ్చాడు. ఆకస్మాత్తుగా పక్క పొదల్లో అలికిడి వినిపించి ఆగిపోయాడు. గొంతులో పాట గొంతులోనే ఆగిపోయింది. వెంటనే అతనికోసం పొదల్లో కనిపెట్టుక్కూచున్న చంద్రయ్య ముఠా పదిమంది అతన్ని కమ్ముకున్నారు. మీదకు దూకారు. చావచిదకగొట్టారు. పాపం కింద పడేసి సున్నంమీద ఎముకల్లేకుండా కొట్టారు. చంద్రయ్య మీదపడి అతని జేబులో వున్న ఇరవై రూపాయలూ లాక్కొని "దావా దాఖల్చేశావుగా? ఖర్చెవరు పెట్టుకుంటారు నీ తాత?" అని కాలికి వొచ్చినట్టు తన్నీ, మిగిలినవాళ్ళని తీసుకొని, సూరయ్యని అక్కడే వొదిలి వెళ్ళిపోయారు.

క్షణాలమీద ఈ వార్త వూరంతా పాక్కింది. సూరయ్యని కొట్టారంటే సూరయ్యని కొట్టా"రని వూరంతా ఆ గుబ్బుగా చెప్పుకుంది. కాని ఒక్కడు కూడా జాలి తలిచినవాడే లేడు. 'పాపం' అన్న పాపాన పోయినవాడే లేడు.

సూరయ్య భార్య దొడ్డ ఇల్లాలు. కూతురు కూడా చాలా మంచిది. కాని బయట జరిగే దురంతాలను వాళ్ళెలా ఆపగలరు? సూరయ్య మనస్సును ఎలా తిప్పగలరు?

తెల్లగా తెల్లవారింతర్వాత వూళ్ళో షావుకార్లు సూరయ్యని పరామర్శించటానికి వొచ్చారు. సూరయ్యకు ఆ రాత్రంతా నిద్ర లేదు. ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. భార్యా కూతురు నోటికి మూత లేకుండా ఏడుస్తున్నా, వాళ్ళ వంకకి చూట్టం లేదు. అన్ని దెబ్బలు తిన్నా ఒక్క మూలుగన్నా మూలగటం లేదు.

షావుకార్లు వొచ్చి, "సూరయ్యా! ఇక చూస్తూ వూరుకుంటే లాభంలేదు. క్రిమినల్ కేసు బనాయించి వాళ్ళ అంతు కనుక్కోవలసిందే!" అన్నారు.

సూరయ్య కొంచెం కదిలి, వాళ్ళని నింపాదిగా చూచి, "ఇంకేం? అందరం చందాలు వేసుకొని వ్యాజ్యమాడదాం" అన్నాడు.

'చందాలు' అనేటప్పటికి షావుకార్లు మొహమొహాలు చూచుకున్నారు. "అదేమిటి సూరయ్యా నిన్ను కొట్టటమేమిటి? మేం చందాలు వేసుకోవటమేమిటి?" అన్నారు.

ఈ మాటలకు సూరయ్యకు కోపం వచ్చింది. అంత బాధలోనూ లేచి కూర్చొని, "వాళ్లు నన్ను కొట్టారా? నా దగ్గిర వున్న డబ్బుని కొట్టారు. అంటే ఈ వూళ్ళో వున్న షావుకార్లందర్నీ కొట్టారు. వడ్డీకోసం అప్పుపెట్టే ప్రతివాడ్నీ కొట్టారు. నన్ను కొట్టటమైతే ఒక్క చంద్రయ్యే కొట్టేవాడు. మిగిలినవాళ్ళంతా ఎందుకు కుమ్మక్కు చేస్తారు? వాళ్ళు కొట్టగలరు గనక అంతా కలిసి కొట్టారు. మనం చందాలు వేసుకోగలం గనక అంతా కలసి చందాలు వేసుకుందాం" అన్నాడు.

షావుకార్లకు యిదేమీ అర్థం కాలేదు. దెబ్బల్తో సూరయ్య మతి చెడ్డదీ అనుకున్నారు. నెమ్మదిగా ఒకరి తర్వాత ఒకరు జారుకున్నారు.

ఎంతమంది చెప్పినా, ఎంత చెప్పినా సూరయ్య వినలేదు – కేసు పెట్టనంటే పెట్టనన్నాడు. "నా సొంత డబ్బు తగలేసుకొని, ఈ డబ్బున్నవాళ్ళకోసం వ్యాజ్యం ఆడిపెట్టనా? నే చెయ్యను" అనేవాడు.

కాని, చంద్రయ్య ఏ ముహూర్తాన చెయ్యిచేసుకున్నాడోగాని, అప్పటినుంచీ సూరయ్య దశ తిరిగిపోయింది. దెబ్బలు తిని కేసు పెట్టకపోయేటప్పటికి వూళ్లోవాళ్ళకి లొల్లి అయిపోయాడు. తాము ఏ డబ్బుని చూచి భయపడుతున్నారో ఆ డబ్బు సమయానికి సూరయ్యను ఆదుకోలేకపోయేటప్పటికి ఇంకేముంది? పెద్దలు మొదలు, కుర్రవాళ్ళ వరకూ సూరయ్యని ఆటలుపట్టించటం మొదలుపెట్టారు. ఇల్లు కదిల్తే చాలు– "సూరయ్య వడ్డీ, చంద్రయ్య లాఠీ" అని పిల్లలు చప్పట్లు కొట్టుకుంటూ వెంటపడేవారు. రావలసిన డబ్బు అడిగితే బాకీదార్లు "ఏం తన్నులు కావాలా?" అనేవారు. కొందరు "ఇదిగో అసలు – ఇదిగో వడ్డీ' అని మొట్టికాయలు వేసేవారు కూడాను.

చివరకు సూరయ్యకు చిల్లిగవ్వ కూడా వసూలు కాకుండాపోయింది. ఎట్లా వచ్చిన డబ్బు అట్లాగే పోయింది. ఎక్కడ పెట్టిన డబ్బు అక్కడే ఇంకిపోయింది. తనకు తదనంతరమైనా వస్తుందనుకున్న ఆస్తి రాకుండా పోయిందని అల్లుడు కూతుర్ని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాడు.

సూరయ్య భార్య మొహం, కూతురు మొహం చూడలేక వీలైనంతవరకు ఇంట్లో వుండకుండా తిరుగుతూ కాలం గడిపేవాడు. నాలుగు మెతుకులు నోట్లో వేసుకొచ్చి చెరువు గట్టుమీద రావిచెట్టు కింద ఒంటరిగా కూర్చునేవాడు. ఇన్ని రాళ్ళు ఏరుకుని ఒక్కొక్కటీ చెర్లో వేస్తూ అవి నీళ్ళలో పుట్టించే కదలికను పరీక్షిస్తూ కూర్చునేవాడు.

కాని, ఊళ్ళో జనం అక్కడ అతని సుఖంగా వుండనివ్వలేదు. అతడు నిస్సహాయుడౌతున్నకొద్దీ జనం తన బలాన్ని ఎక్కువ ఉపయోగించడం మొదలుపెట్టింది. జనానికి అతనిమీద కలిగిన కసీ, అలుసూ అతనితోనే ఆగక అతని కుటుంబం మీదకు తిరిగింది.

ఒకరోజు సూరయ్య కూతురు వాముల దొడ్లో గేదెకు మేత వేస్తుంటే నలుగురు పట్టుకొని గాతంలో పడేసి బలాత్కారంగా చెరిచారు. వాళ్ళు విడిచిపెట్టి వెళ్ళిం తర్వాత ఆ పిల్ల లేచి, నడవలేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలిసి సూరయ్య భార్య అవమానాలు సహించలేక కిరసనాయిలు పోసుకొని కాల్చుకొని మరణించింది. అదే సమయంలో విరోధులు సూరయ్య ఇవ్వవలసిన బాకీలు తమ పేర ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఇల్లు వేలం వేయించారు..."

ఇంతవరకు ఓపికతో విని, ఇక ఆపుకోలేక నేను ఈ ప్రశ్న వేశాను – " ఈ ఘోరకృత్యాన్ని జరక్కుండా ఎవ్వరూ ఆపలేదూ?"

"తప్పన్న వాళ్ళే లేరు. చేసుకున్నది అనుభవిస్తున్నాడని కొందరూ, ఈ ఉద్రేకంలో అడ్డు చెపితే తమ కుటుంబాలు సరిగ్గా ఉండవేమో అనే భయంతో కొందరూ. మొత్తానికి అంతా మెదలకుండా వూరుకున్నారు."

# ధనానీలు



- పాలపర్తి ధనరాజ్
9550593901

తెలిసి తెలిసీ
గోతిలో పడడం
రైల్లో
టీ కాఫీలు త్రాగడం

పచారీ షాపులో స్లోగన్
అరువు రేపు
పటాస్ బాబుల స్లోగన్
త్రాగను రేపు

నిండు ప్రజాసభల్లో
వాగ్దానాలు
మండు వేసవిలో
ఎండమావులు

సద్రుమనే
సూఫర్ ఫాస్ట్ రైళ్లు
సరైన ట్రాక్ లేకపోతే
సూపర్ పాసింజర్లే

ఓ భుజాన బ్యాగు
ఓ భుజాన బాబు
బడిపిల్లమ్మల
భారాలు

ఫోనులో
చాటు
ఫ్యూచర్‌లో
చేటు

వారాంతాలలో
వాహన ఛార్జీలు
వాతలు తేలే
వాయింపులు

భగవంతునికీ
భక్తునికీ
అనుసంధానమైనది
అక్కడున్న హుండీ

♦

"ఊ! తరవాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఇంకేముంది? డబ్బు దారిన డబ్బు నడిచింది. కూతురు అలా అయిపోయింది. భార్య ఇలా అయిపోయింది. సూరయ్య గుండెలు పగిలిపోయినై. ఆవులాగా అడలుతూ వూరు పట్టుక తిరిగేవాడు. కొన్నాళ్ళకు పిచ్చెత్తింది. ఇప్పుడెవరన్నా జాలితలచి ఇన్ని మెతుకులు పెడితే తింటాడు. ఆ చెరువుగట్టుమీద రావిచెట్టు కిందే వుంటాడు. ఎండలో, వానలో అక్కడే వుంటాడు. ఎప్పుడూ కూతురు సంగతిగానీ, భార్య సంగతిగానీ ఎత్తడు. ఎవర్నీ పలకరించడు. రోజు కొక్కసారి వెళ్లి తన పాత ఇంటిని దూరాన్నుంచి చూచుకొని కన్నీరు పెట్టుకుంటూ వుంటాడనీ, రాత్రిళ్ళు తన కూతురు పడి ఆత్మహత్య చేసుకున్న బావి దగ్గరకు వెళ్ళి ప్రదక్షిణం చేసి వస్తూ వుంటాడనీ వూళ్లో చెప్పుకుంటూ వుంటారు... ఇదీ సమాచారం..."

నేను కథంతా ప్రాణాలు బిగపట్టుకొని విన్నాను. సూరయ్య కథ చెప్పమన్నప్పుడు ఇటువంటి విషాదగాథ వింటానికి సిద్ధపడలేదు. గనుక చాలా ఖేదపడ్డాను.

"మరి ఈ రాళ్ళ వ్యవహారమేమిటి?" అని అడిగాను.

"అలవాటు" అన్నాడు నా స్నేహితుడు. "పాత అలవాటును పట్టి ఇలా చేస్తూవుంటాడు. మేం కూడా జాలిపడి అతని మనస్సుని ఈ అవస్థలో కష్టపెట్టడం ఎందుకని తగువిధంగా ప్రవర్తిస్తూవుంటాం. ఈ సూరయ్య..."

నా స్నేహితుడు చెబుతుండగానే వీధిలో పెద్దగోల బయల్దేరింది "సూరయ్య వడ్డీ, చంద్రయ్య లాఠీ" అని కేకలు బయటనుంచే సూరయ్య "బే" అని ఆడిలాడు. ఆ ధ్వని విని మే మిద్దరం బయటకు పరుగెత్తాం.

బయట వీధిలో సూరయ్య రోజుకుంటూ, రొప్పుకుంటూ గబగబా నడుస్తూ వెళుతున్నాడు. చేతులో నా స్నేహితుడిచ్చిన మూట భద్రంగా వుంది. వెనక పదిమంది పిల్లలు పోగై గోలచేసుకుంటూ సూరయ్య మీదకు రాళ్ళు విసురుతున్నారు.

నడుస్తూ నడుస్తూ వున్న సూరయ్య ఆకస్మాత్తుగా పరుగెత్తటం మొదలుపెట్టాడు. రంయిన పరుగెత్తి ఒక ఇంటిముందు ఆగి, ఒక్క నిమిషం ఆ యింటిని చూచి, అక్కడనుంచి కదిలి పక్కనే వున్న బావి గట్టుమీద నిలబడ్డాడు. పిల్లలంతా ఎక్కడి వాళ్ళు అక్కడే ఆగిపోయారు. చేతుల్లో రాళ్ళు చేతుల్లోనే వున్నాయి. నేనూ నా స్నేహితుడు వూపిరి బిగపట్టి చూస్తూ నుంచున్నాం. సూరయ్య వంగి బావిలోకి చూచి లేచి, ఇంటివైపుకి చూశాడు. ఉండి ఉండి 'బే' అని సైరన్‌లాగా, విన్నవాళ్ళకి సలపరం పుట్టేటట్టు అడిలి రాళ్ళమూటతో సహా బావిలోకి దూకాడు.

వాళ్ళూ వీళ్ళూ పోగయ్యారు గాని ఏమీ లాభం లేకపోయింది. నా స్నేహితుడిచ్చిన రాళ్ళమూట తేలనివ్వకపోయింది. శవం బయటకు వచ్చింది. మేం ఇంటికి వచ్చిన తర్వాత నా స్నేహితుడు ఇలా చెప్పాడు – "ఆ ఎదురుగా వున్న ఇల్లే అతని ఇల్లు. అతడు దూకిన బావే అతని కూతురు ఆత్మహత్య చేసుకున్న బావి."

♦

## స్నానం

హిందీమూలం: అబ్దుల్ బిస్మిల్లా
తెలుగు: డా. వెన్నా వల్లభరావు
9490337978

అమ్మాయి స్నానం చేస్తుంది
రోజంతా మండుటెండలో కష్టపడి తిరిగొచ్చాక
వీధి పంపు వద్ద.
అమ్మాయి పంపు వద్ద స్నానం చేస్తుంది
అమ్మాయి గంగలో స్నానం చేస్తుంది
అమ్మాయి నర్మదలో స్నానం చేస్తుంది
అమ్మాయి తనువు స్నానం చేస్తుంది
అమ్మాయి మనసు స్నానం చేస్తుంది
అమ్మాయి కాళ్లు తోముకుంటుంది
అమ్మాయి వీపు తోముకుంటుంది
అమ్మాయి ఛాతీ తోముకుంటుంది
అమ్మాయి వీధి పంపు వద్ద
అయిష్టంగా స్నానం చేస్తుంది
చాలా ఇబ్బందిగా స్నానం చేస్తుంది
లాయరుగారబ్బాయి
తమ వరండాలోనుంచి
చూస్తున్నాడా దృశ్యాన్ని
చాలా ఆనందంగా – ఆసక్తిగా
అమ్మాయి స్నానం చెయ్యటం
అమ్మాయి వళ్లు తోముకోవటం



అమ్మాయి బట్టలు మార్చుకోవటం
అబ్బాయికి చాలా సరదాగా ఉన్నాయి...
అమ్మాయి తల దించుకునే స్నానం చేస్తుంది–
పరధ్యానంగా
అమ్మాయి ఆలోచనల్లే ఒక్కటే–
సాధ్యమైతే
మరుసటి బట్వాడా రోజు
తిండిగింజలు కొనటం మానుకునైనా సరే
తనకోసం స్నానాల దొడ్డి
సమకూర్చుకోవాలని! ♦

---

## ఎవరెస్టు శిఖరమౌదాం!

- దామరకుంట శంకరయ్య
9440876788

చరిత్రలో
శత్రుత్వంతో ఏం సాధించారు రాజులు
పాడుబడిన కోటలు
ఆనవాళ్ళు మిగలని వంశాలు తప్పా!

మూర్ఖుడనో దుష్టుడనో
ముద్రవేసి
ముందుతరాలకు
పాఠంగా ప్రచారం తప్పా!

ఈ విశ్వంలో
శాశ్వతమేదో చేప్పు
నా సమస్తం వీలునామా రాసిస్తా!

స్వార్థం అహం
అంతరాగ్నులు
నిలుపడం తెలియదు
కూల్చడం తప్ప

మతాలు మనం గీసుకున్న
లక్ష్మణరేఖలు కదా!
రామ్ రహీం
నిత్యం కోడిపుంజుల్లా బ్రతకమన్నారా!

నీకు నాకు మధ్యనున్న
ఎవరెస్టు మనకన్నా ఎంతో మిన్న
ఆపేద్దాం బుల్లెట్లను
అందుకుందాం ఆశిఖరాలను



రా...!
గంగా జమున సంగమ మవుదాం!
ఈ నేలంతా...
సుఖ శాంతుల పూలు పూయిద్దాం!
మంచు స్వచ్ఛతను కాపాడుదాం!
స్నేహగీతం ఆలపిద్దాం! ♦



# కథాంశాలు

- కేతు విశ్వనాథరెడ్డి
9866713647

కథ దేన్ని గురించి? ఎవరి గురించి? కథలోని ముఖ్యాంశాలు ఏమిటి? అవి సంఘటనలుగా ఎట్లా ఏర్పడ్డాయి? ఆ సంఘటనల మధ్య సంబంధాలేమిటి? వాటిలో చిత్రితమైన వారి చిత్తప్రవృత్తులేమిటి?వారి కార్యకలాపాలు ఎక్కడ జరుగుతున్నాయి? ఆ చిత్తవృత్తుల సంబంధాల పర్యవసనాలేమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు దొరకాలంటే నవల ఇతివృత్తాన్నీ, పాత్రచిత్రణనూ, వాతావరణాన్నీ మనం పట్టించుకోక తప్పదు. రచయిత వాటిపట్ల ఎటువంటి శ్రద్ధాశక్తులను కనపరచాడో పరిశీలించక తప్పదు.

## 1. ఇతివృత్తం

కథ **(Story)** వేరు ఇతివృత్తం **(Plot)** వేరు. కథ అంటే జరిగిన విషయాల వరుస. జరిగిన విషయాలన్నీ అసక్తికరం కావు. జరిగిన విషయాలన్నిటిలో రచనకు కావలసిన, తగిన కార్యకారణ సంబంధాలూ, చర్యా ఉండకపోవచ్చు. అందువల్ల కేవలం కథ నవల కాదు. ఒక ఇతివృత్తం నవలకు దారితీస్తుంది. ఇతివృత్తం అంటే కార్యకారణ సంబంధముండే, ఉత్సుకతను కలిగించే సంఘటనల పరంపర లేదా సంఘటనల క్రమం.దీన్ని సంఘటనలలో పాల్గొనే వ్యక్తుల చర్యల క్రమం అని కూడా అనవచ్చు. అంతేకాదు ఆయా సంఘటనల్లో పాల్గొనే వ్యక్తుల మధ్య ఘర్షణ అయినా, భావాల మధ్య ఘర్షణ అయినా, కోరికలూ, ఆశయాల మధ్య ఘర్షణ అయినా, వీటిక్రమం ఇతివృత్తం అవుతుంది. ఇతివృత్తంలో ఒక ప్రధానపాత్ర అంటే నాయకుడూ లేదా నాయిక ఉంటే ఉండవచ్చు. లేదా ఒక వర్గం ప్రధానపాత్రగా ఉండవచ్చు.

ప్రధానపాత్ర (అంటే కేంద్రపాత్ర) లేదా ప్రధానవర్గం (అంటే కేంద్రవర్గం) మరొక వ్యక్తితోగాని, సమూహంతోగానీ, వర్గంతోగానీ ప్రత్యర్థిస్థానంలో ఉండవచ్చు. ఒక్కొక్కప్పుడు ప్రకృతిగానీ, సమాజ శక్తులుగానీ, 'విధి' గానీ ప్రత్యర్థి స్థానంలో ఉండవచ్చు. మరి ఒక్కప్పుడు ప్రధానపాత్ర అంతఃస్వభావంలోని కొన్ని అంశాలే ప్రత్యర్థి స్థానంలో ఉండవచ్చు. చదరంగంలోని ప్రత్యర్థులనూ, ఒంటిగా గదిలో మనలో మనం కుళ్లు కుంటున్నప్పుడో ఘర్షణపడుతూ ఉన్నపుడో ఉండే మానసిక ప్రపంచాన్నీ ఊహించుకోండి. ఇతివృత్తంలోని ఘర్షణ స్వభావం అర్థమవుతుంది.

ఇతివృత్త నిర్మాణంలో మరొక ప్రధానమైన అంశం సంభావ్యత. ఈ సంభావ్యత అనే మాటనే ఇంగ్లీషులో **(Plausibility, Verisimititude)** అనే మాటలతో సూచిస్తూ ఉంటారు. సంభావ్యత అంటే వాస్తవంలో సంభవించవచ్చు అనే

సంఘటనల క్రమం. పాఠకులను నమ్మించేటట్లు చేసే చిత్రణ. మరీ యాదృచ్ఛికంగా జరిగే ఘటనలూ, కాకతాళీయంగా సంభవించే అంశాలూ, మానవజీవితంలో అసలు సంభవించని అద్భుతాలూ సంభావ్యతను దెబ్బతీస్తాయి. విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలులోని పసరిక పాత్ర కన్పించే ఘట్టాల సంభావ్యతను గురించి ఆలోచించండి. సంభావ్యత లక్షణం బోధపడుతుంది. అదొక ప్రతీక అనుకుంటే మొత్తం నవలను ప్రతీక నవల అనాలి.

నవలలో ఇతివృత్త ప్రయోజనాన్ని పరిశీలించేటప్పుడు గుర్తుంచుకోవలసిన ప్రధాన ప్రశ్నలు: 1. కథమూల స్వభావాన్ని వివరించడంలో సంఘటనల మధ్య ఉండే సంబంధం ఏమిటి? 2. ఇతివృత్తం ఆదిమధ్యాంతాల మధ్య ఒక ఐక్యత ఉంటే పరస్పర సంబంధాలతో సమన్వయం ఉందా, లేదా? సంఘటనలు ఎప్పుడు జరిగాయి? ఏం జరగడానికి దోహదం చేస్తున్నాయి.

## 2. పాత్రచిత్రణ

పాత్రలు అంటే కథలో ఎదురయ్యే మనుషులు: ఆ మనుషుల జీవితాశయాలూ, ఆశానిరాశలూ, భావోద్వేగాలూ, భావాలూ. ఇతివృత్తానికీ పాత్రలకూ ఒక విడదీయరాని బంధం ఉంటుంది. ఇతివృత్తంలో ప్రధానపాత్ర లేదా ప్రధానవర్గం ఏదో తెలుసుకోవాలంటే ఎట్లా? కథలోని ప్రధాన సంఘటనల్లో కన్పించే వ్యక్తి లేదా వర్గం కేంద్రపాత్ర అన్నమాట, కేంద్రవర్గం అన్నమాట. ఈ కీలక వ్యక్తివల్ల లేదా ఈ కీలక వర్గంవల్ల కథ ముందుకు జరుగుతుంది. సంఘటనల్లో మార్పు వస్తుంది.

ఈ కేంద్ర వ్యక్తిపట్ల గానీ, కేంద్ర వర్గంపట్ల గానీ దృష్టి మార్పుకు గురి అవుతూ ఉంటుంది. నవలలో మనం కేంద్రవ్యక్తి లేదా కేంద్రవర్గాన్ని గుర్తుంచుకునేటప్పుడు వేసుకోవలసిన ప్రశ్నలు : 1. ప్రధానపాత్ర చిత్రణ మనం నమ్మేట్లు ఉందా? ఈ పాత్రలో ఏఏ మార్పులు ఇతివృత్త క్రమంలో జరుగుతున్నాయి? ఈ మార్పుల్లో ఒక పద్ధతి, ఒక నియమం ఉన్నాయా? ఏ హేతువూ లేకుండా మారిపోతున్నాయా? అసలే మారిపోలేదా? పాత్రలు జీవితానికి దగ్గరగా ఉన్నాయా లేదా? కేవలం వ్యక్తి లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయా? సామాన్య లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయా? ఒకే గుణాన్ని గుర్తుకుతెచ్చే మూసపాత్రలా ఇవి? సంక్లిష్టమైన మానవీయ భావాలకూ, భావోద్వేగాలకూ ఇవి గుర్తులా? చదివిన పుస్తకాల్లోంచి పుట్టాయా? రచయిత అనుభవంలోంచి పుట్టాయా? ఈ పాత్రల సామాజిక మనస్తత్త్వం ఏమిటి? అంతరంగిక స్వభావం ఏమిటి? ఈ రెంటికీ ఉన్న సంబంధం ఏమిటి?

పాత్రచిత్రణ నమ్మేట్లే ఉండాలంటే, పాత్రలలో కలిగే మార్పులు నమ్మేట్లు ఉండాలంటే, పాత్రలు సంఘ మానవ స్వభావానికి దగ్గరగా ఉండాలంటే ఎట్లా ఉండాలి అనే ప్రశ్న కలగవచ్చు. పాత్రల పరిధినీ, పాత్రల గుణాత్మకమైన మార్పులకు కారణమైన సంఘ పరిస్థితులనూ, ఆ మార్పులు జరుగుతున్న కాలక్రమాన్నీ ఒక క్రమంలో నవలారచయిత చిత్రించగలిగితే ఇది సాధ్యమవుతుంది. సినిమాల్లో తప్ప, అర్భక నవలల్లో తప్ప, కేవలం ఆదర్శ దుష్టపాత్ర, ఆదర్శ మంచిపాత్రగా మారిపోవడం సాధ్యంకాదు.

ప్రధానపాత్ర ప్రాధాన్యం వహించే నవలలను పాత్రచిత్రణ ప్రాధాన్య నవలలు అంటారు. సామాజిక జీవిత చిత్రణ, విశ్లేషణ ప్రాధాన్యం వహించే నవలలను సమాజచిత్రణ నవలలు అంటారు. బుచ్చిబాబు చివరకు మిగిలేది ఒకరకంగా పాత్ర చిత్రణ ప్రధాన నవల. మహీధర రామమోహనరావు రథచక్రాలు సమాజచిత్రణ నవల. (ఈ రకాలు రెండూ సాంఘిక నవలల వర్గంలోకే చేరతాయి. ప్రాధాన్యంలో తేడానుబట్టి ఉప వర్గీకరించుకుంటున్నాం అంతే.)

## 3. వాతావరణం

వాతావరణం అంటే కథ జరిగే కాలం, పరిసరాలు. పరిసరాలు అన్నప్పుడు అవి ప్రకృతి పరిసరాలు కావచ్చు. సంఘ పరిసరాలు కావచ్చు. రెండూ కావచ్చు. వీటిని నవలా రచయిత స్వయంగా చర్చించవచ్చు. కథలో భాగంగా మలచవచ్చు. వీటి ప్రయోజనం ఏమిటి?

ఇతివృత్త సంభావ్యత, పాత్రల సంభావ్యత కాల పరిస్థితులను బట్టి, భౌగోళిక (ప్రకృతి) పరిస్థితులనుబట్టి, సంఘ పరిస్థితులనుబట్టి రూపుదిద్దుకుంటాయి. మహీధర 'స్వయంవరణం'లోని సుధా కామేశ్వరరావులను విజయవాడ, విశాఖ వంటి పట్టణాల్లో ఊహించగలం. కానీ మరీ వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో ఊహించలేం. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు రాసిన మాలపల్లి నవలలో చౌదరయ్య వంటి కరకు భూస్వామిని ఒక పెద్ద నగరంలో అట్లాగే ఉంటాడని భావించలేం. తెన్నేటి సూరి రాసిన చెంఘిజ్‌ఖాన్ నవలలో చెంఘిజ్‌ఖాన్‌ను 12, 13 శతాబ్దాల్లో గోబీ ఎడారుల్లాంటి ఎడారుల్లో ఊహించగలం కానీ, 15, 16 శతాబ్దాల్లో హంపీ విజయనగరాల్లో ఊహించలేము.

అంటే పాత్రలు జీవించిన కాలమూ, భౌగోళిక పరిసరాలూ,

సంఘ పరిస్థితులు పాత్రల స్వభావాన్నీ, ఇతర పాత్రలతో సంబంధాన్నీ నిర్ణయిస్తాయన్నమాట. మనకు ఆయా పరిసారాలకూ, పరిస్థితులకూ అనుగుణమైన భావోద్వేగాలనూ కల్గిస్తాయన్నమాట. అంతేకాదు. ఇవి రచనోద్దేశాన్ని వెల్లడిస్తాయి కూడా. వీటి ప్రధాన లక్ష్యం ఇతివృత్త నేపథ్యాన్ని సమకూర్చడం అని మరచిపోకూడదు.

**వస్తు లక్ష్యస్థాయి :**

నవలలోని కథ నుండి రచయిత చెప్పదలచుకున్న అంశమేదో ఉంటుంది. అట్లాంటి అంశాన్ని వస్తు లక్ష్యం అంటాం. కథను నడిపే ముఖ్యమైన భావాన్ని కానీ, కథకు మూలమైన రచయిత ఉద్దేశాన్ని కానీ పరిశీలించటం వస్తు లక్ష్యస్థాయి పరిశీలన అవుతుంది. దీన్నే మనం రచనోద్దేశం అని అనవచ్చు. కథానికల్లో అయితే దీన్ని కొందరు విమర్శకులు పాయింట్ అని పిలుస్తారు.

రచనోద్దేశం రచయిత నవలలోని కథ ద్వారా సామాన్యీకరించిన జీవిత సత్యం అన్ని రకాల నవలల్లోనూ రచనోద్దేశాలు ప్రస్ఫుటంగా కనపడకపోవచ్చు. మొక్కపాటి బారిష్టరు పార్వతీశం వంటి హాస్య నవలలో రచనోద్దేశం హాస్యోత్పాదకతే. అపరాధ పరిశోధ నవలల్లో రచనోద్దేశం అపరాధ పరిశోధనే.

ఈ రచనోద్దేశం ఒక పాత్రను వెల్లడించడం కావచ్చు. అది ప్రకృతిలో, సంఘంలో ఉండే మానవ సంబంధాల ద్వారా వెల్లడి కావచ్చు.

రచనోద్దేశాన్ని ఎట్లా కనుక్కోవటం? ఇందుకు కొన్ని సూత్రాలున్నాయి. అవి

1. ఇతివృత్తం ద్వారా రచయిత జీవితం మీద వెల్లడించదలచుకున్న సాధారణీకరణ అంశం ఏమిటి అనేది ఆలోచించడం 2. ప్రధాన పాత్ర లేదా ప్రధాన పాత్ర మార్పులు పొందడం ద్వారా తెలిసే దేమిటి అనేది ఆలోచించడం 3. కీలకమైన ఘర్షణ ద్వారా తెలిసే దేమిటీ అనేది ఆలోచించడం.

రచనోద్దేశం అనేది ఒక నీతివాక్యం లాగా, ఒక సామెత లాగా, ఒక జాతీయంలాగా, ఒక గంభీరోక్తి లాగా, ఒక పాఠం లాగా ఉండదు, కన్పించదు. అది కథా జీవిత సారంలాగా కనపడుతుంది. రావిశాస్త్రి అల్పజీవి రచనోద్దేశం ఏమిటి అని ఎవరైనా ప్రశ్నించారనుకోండి. పిరికితనమూ, భయమూ మనిషిని దారుణమైన ఆత్మ న్యూనతకు గురిచేస్తాయి. ఆత్మ విమర్శనాజ్ఞానం మంచి మార్గాన వెళ్ళే అవకాశం కల్పించవచ్చు అనేదే అల్పజీవిలోని ప్రధానపాత్ర సుబ్బయ్య ద్వారా రచయిత చెప్పదలచుకున్న రచనోద్దేశం అని జవాబు చెప్పవచ్చు.

**సాహిత్యస్థాయి అంశాలు**

రచయిత పాఠకుల్ని ఆకట్టుకోవడానికి ప్రయత్నించే పద్ధతులు ఇందులో చేరతాయి. ఇవి రచనా నిర్మాణ:, దృష్టికోణం, రచనా విధానం, కంఠస్వరం అని అన్నాము. వీటిని కొంత వివరంగా పరిశీలించాలి.

**1. రచనా నిర్మాణం:** ఒక కథను జరిగిన కాలక్రమంలో చెప్పడానికీ, వెనకాముందూ తిరగేసి చెప్పడానికీ, ఫ్లాష్ బాక్ పద్ధతిలో చెప్పడానికీ తేడాలున్నాయి. కాలక్రమ పద్ధతిలో కాకుండా నవలలోని సంఘటనలను వెనకా ముందూ తిరగేసి రాయడం ఎందుకు? ఫ్లాష్ బాక్ పద్ధతి ఎందుకు?

నవలా రచయిత పాఠకుల్లో ఉత్సుకతనో, ఉత్కంఠనో కలుగచేయడానికి ఈ పద్ధతి వినియోగిస్తారు. కాకపోతే ఒక జరిగిపోయిన సన్నివేశాన్ని కథా గమనంలో పాత్ర ఆలోచనల ద్వారా తెల్పదలచుకున్నప్పుడు ఉత్తమ పురుష కథన పద్ధతి ద్వారా గానీ, చైతన్య స్రవంతి విధానం ద్వారా గానీ ఫ్లాష్ బ్యాక్ ఉపయోగించుకుంటాడు. కథా సన్నివేశాలను వరసగా గుదిగుర్చడం మామూలు పద్ధతి. తారుమారు చేయడం దృశ్యపద్ధతి. కొడవటిగంటి కుటుంబరావు నవలల్లో సన్నివేశాలు వరుసగా పేర్చుకుంటూ వెళ్ళే కథా కథనమే ప్రధానంగా కన్పిస్తుంది. కుటుంబరావు చదువు నవలను గోపీచంద్ అసమర్థుని జీవయాత్రతో ఈ విషయంలో పోల్చి చూడండి.

**2. దృష్టికోణం :** కథను చెప్పడానికి రకరకాల పద్ధతులను చేపట్టడం మనం స్థూలంగానైనా గమనించి ఉంటాం. కథ చెపుతున్నది ఎవరు? కథ చెప్పేవాడు మనల్ని ఎంతమాత్రం తెలుసుకోనిస్తున్నాడు? అతను పాత్ర భావోద్వేగాలనూ, ఆలోచనలనూ ఎంతవరకు, ఎట్లా పరిశీలించి మనకు అందచేస్తున్నాడు. ఈ ప్రశ్నలు దృష్టికోణాన్ని, అంటే రచయిత కథనూ, ఇతివృత్తాన్నీ పాఠకులకు అందించే కథన పద్ధతి **(Narrations)** ని తెలియచేస్తాయి. (దృష్టికోణాన్నే కథన పద్ధతిలో చేర్చి చెప్పడం సబబు అనవచ్చు). ఇది నాలుగు రకాలుగా జరుగుతుంది.

**(ఎ) సర్వసాక్షి కథనం (Omniscient Point of view/ narration)** : ఇది ప్రథమ పురుషలో కథ నడిపించే పద్ధతే. కథనుతాను గాకుండా ఇతరుల ద్వారా రచయిత కథను నడిపిస్తాడు. సర్వసాక్షి కథనంలో రచయిత సర్వజ్ఞుడుగా

కనబతాడు, వ్యవహరిస్తాడు. అతనికి ఇతివృత్తంలోని పాత్రల బహిరంగ ప్రపంచ సర్వం తెలుసు. ఒకరకంగా ఆ పాత్రలకు తెలియనివి కూడా తెలుసుకోవచ్చు. రచయితకు విస్తృతమైన రచనా పరిధికి అవకాశం కల్పించే కథన పద్ధతి ఇది. పాఠకుణ్ణి రచయిత ఉద్దేశించిన వైపుకు తిప్పుకోగలిగిన పద్ధతి ఇది. రచయిత అందరి కళ్ళతో అందరినీ, ప్రపంచాన్నీ చూస్తున్నట్లు చెప్పే పద్ధతి ఇది. కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్రము ఈ పద్ధతికి ఒక ఉదాహరణ.

**బి) పరిమిత సర్వసాక్షి కథనం (Limited Omniscient):** ఈ పద్ధతిలో ఒకే ఒక వ్యక్తి పాత్రదృష్టి నుంచి కథ నడుస్తుంది. ఇదీ ప్రథమ పురుష కథనమే. అన్ని వేళల్లో ఆ పాత్రవైపు మనం ఉంటాం. ఆ పాత్ర అంతరంగంలో మనం జీవిస్తాం. ఇతర పాత్రలు మనకు అంతగా తెలియవు. ఈ పద్ధతి జీవితానికి దగ్గరగా ఉంటుంది. వాస్తవ జీవితంలో మనం మన కళ్ళతో ఇతరులను చూస్తాం. అందరిక కళ్ళతో మనం అందరినీ ప్రపంచాన్నీ చూడలేము. ఈ పద్ధతిలో ప్రధానపాత్ర అంతరంగ చిత్రణ చేసే చైతన్య స్రవంతి విధానం కూడా ఉంటుంది. నవీన్ అంపశయ్య ఈ రకంగా చేరుతుంది.

**సి) ఉత్తమ పురుష కథనం (First Person point of view)** : కథకుడు తాను స్వయంగా ఎరిగిన కథను చెప్పే పద్ధతి ఇది. రచనలో కథకుడు అంటే 'నేను' ప్రధానపాత్ర కావచ్చు. అప్రధాన పాత్ర కావచ్చు. ఈ 'నేను'కు తెలిసిందే. 'నేను' ఆలోచించిందే పాఠకుడికి తెలిసేది. కథన పరిధి తక్కువైనా పాఠకుణ్ణి రచనకు చాలా సన్ని హితంగా ఈ పద్ధతి ఇస్తుంది. రచయితా, పాఠకుడూ ఈ పద్ధతిలో తాదాత్మ్యం పొందుతారని చెప్పవచ్చు. విశ్వనాథ సత్యనారాయణ మాబాబు ఈ పద్ధతిలో ఉంటుంది.

**డి) నాటకీయ కథనం :** ఈ పద్ధతి కథనంలో రచయితా పాఠకుడూ ఇద్దరూ ప్రేక్షకులే. చూసినదీ, విన్నదీ మాత్రమే ఈ కథన పద్ధతిలో నమోదు అవుతుంది. పాత్ర మనోభావాల వర్ణన జోలికి ఈ పద్ధతిలో రచయిత వెళ్ళడు. రచయిత వ్యాఖ్యానాలు ఉండవు. ఒక నాటకం లాగా రచయిత కథను మనకు ప్రదర్శిస్తాడు. కథల్లో, చిన్న నవలల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రదర్శించినట్లు చూడగలం.

**4. కంఠస్వరం (Tone)** : ఉపయోగించే మాటల ద్వారా, పదబంధాల ద్వారా, సూచనల ద్వారా, కాకువు ద్వారా కథకుని గొంతును మనం కనిపెట్టవచ్చు. కథను ఒక ప్రేక్షకుడిలాగా గంభీరంగా చెపుతున్నాడా, కథనంలోని వ్యాఖ్యానాలు తాత్వికంగా ఉన్నాయా, వ్యంగ్యంగా ఉన్నాయా, హాస్యస్ఫోరకంగా ఉన్నాయా, అతి తీవ్రంగా ఉన్నాయా మనం గమనించవచ్చును. ఇతివృత్తం పట్లా, పాత్రల చర్యల పట్లా రచయిత వైఖరి ఏమిటో తెలుసుకోవచ్చు. మొక్కపాటి బారిస్టరు పార్వతీశం నవలలో రచయిత కంఠస్వరం హాస్యస్ఫోరకం. కుటుంబరావు వారసత్వం నవలలోని రచయిత కంఠస్వరం తాత్త్వికం, వ్యంగ్యాత్మకం.

**5. రచనా విధానం / శైలి (Style)** : నవలలో రచయితలు భిన్న శైలులను భిన్న సందర్భాల్లో వాడతారు. తను కథ చెప్పే శైలివేరు. పాత్రలు మాట్లాడే శైలులు వేరు. కథ చెప్పే సందర్భంలోనూ, పాత్రలు మాట్లాడే శైలుల్లోనూ రకరకాల అంతరువులు కూడా కన్పిస్తాయి. కథలోని వాతావరణం కూడా శైలులను నిర్ణయిస్తుంది. అంటే గ్రామీణ జీవితాన్ని చిత్రించే నవలలో మాండలికాల ప్రభావం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. ఒక ప్రత్యేక వృత్తికి సంబంధించిన కథలో ఆ వృత్తి తాలూకు పదజాల ప్రభావం శైలి మీద కన్పిస్తుంది. అల్లం రాజయ్య కొలిమంటుకున్నాది నవలలో శైలులు తెలంగాణా మాండలిక భేదాలు. కొమ్మూరి వేణుగోపాలరావు హౌస్ సర్జన్ నవలలో వైద్యవృత్తిలోని వ్యక్తుల వృత్తిశైలులు కన్పిస్తాయి.

నవలను ఒక పాఠం (Text) గా అంటే ఒక క్రమంలో ఏర్పాటైన పదసంపుటిగా అధ్యయనం చేసే పద్ధతి కూడా ఇటీవల వ్యాప్తిలోకి వచ్చింది. అది ప్రత్యేక తరహా పరిశీలన.

## తాత్త్వికస్థాయి అంశాలు

జీవితం మీద మనకు కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. కొన్ని భావాలు ఏర్పడతాయి. రచయితలకు జీవితం పట్ల ఉన్న దృక్పథాన్నే ప్రాపంచిక దృక్పథం అని స్థూలంగా అంటాం. ఈ ప్రాపంచిక దృక్పథం ఏదో ఒక ధోరణికి చెందవచ్చు. నవల జీవిత వ్యాఖ్యానం, మనోరంజక సాధనం అన్నప్పుడు మనం జీవిత వ్యాఖ్యానంలో, మనో రంజకత్వంలో ధోరణి ఏ రకంగా ఉందో పరిశీలించవచ్చు.

## ప్రాపంచిక దృక్పథం :

నవలలోని ఇతివృత్తం ద్వారా, పాత్రలకున్న జీవితదృష్టుల చిత్రణ ద్వారా, దృష్టికోణం ద్వారా, టోన్ ద్వారా రచయిత ప్రాపంచిక దృక్పథం ఏమిటో తెలిసిపోతుంది. కేవలం మనోరంజక నవలా సాహిత్యంలోనూ, ఫార్ములా నవలల్లోనూ రచయిత ప్రాపంచిక దృక్పథం కొట్టవచ్చినట్లు కనపడకపోవచ్చు. హింసనూ, మూఢ విశ్వాసాలనూ చిత్రించిన నవలల్లో రచయిత ప్రాపంచిక దృష్టి పాశవికం అని వెంటనే చెప్పగలుగుతాం.

అభ్యుదయ భావాలను చిత్రించిన నవలల్లో రచయిత ప్రాపంచిక దృష్టి సంఘసంస్కారం అని చెప్పగలుగుతాం. నవలలో రచయిత సృష్టించే ప్రపంచం కల్పనే అయినా ఆ కల్పనకు పునాది వాస్తవం. కాబట్టి వాస్తవ ప్రాపంచిక దృష్టిని ఏర్పరుస్తాయి. ఒక నవల అంతా చదివాక కలిగిన భావాలను మనం విశ్లేషించుకుంటే ఆ నవల మనకు ఏ రకమైన సంస్కారాన్ని ఇస్తుందో తెలిసిపోతుంది. ప్రాపంచిక దృక్పథం అనే మాటను జీవిత దృక్పథం, సామాజిక దృక్పథం అనే మాటలలో కూడా సూచించవచ్చు.

**ధోరణి (Trend)**

కాల్పనిక వాదం **(Romanticism),** వాస్తవిక వాదం **(Realism)** అనే మాటలను వింటున్నాం. స్వయం వ్యక్తి వికాసాన్నీ, వ్యక్తి స్వేచ్ఛనూ ప్రధానంగా కోరేది కాల్పనికవాదం అని విమర్శకులు అంటారు. స్వయం వ్యక్తి వికాసాన్ని, వ్యక్తి స్వేచ్ఛనూ, ప్రధానంగా సామాజిక దృష్టి కల్గిందీ వాస్తవికతావాదం అంటారు. బాపిరాజు నారాయణరావు నవలనూ, కొడవటిగంటి కుటుంబరావు చదువు నవలనూ పోల్చి చూడండి. విశ్వనాథ చెలియలి కట్టనూ చలం మైదానం నవలనూ పోల్చి చూడండి. ఉన్నవ మాలపల్లినీ, జి.వి. కృష్ణారావు కీలుబొమ్మలు నవలను పోల్చి చూడండి. రచయితలకుండే రాజకీయ, ఆర్థిక, సాంఘిక భావాలే సాహిత్యంలోని ధోరణులను నిర్ణయిస్తాయి, నవలల్లో భావాల తీరు, నవల ఏ ధోరణికి చెందింది అనే దాన్ని నిర్ణయిస్తుంది.

ఇంతవరకు పరిశీలించిన నవల లక్షణాలు, కథానిక లక్షణాలలాగే ఉన్నాయి. కథ, కథానికకూ, నవలకూ, నవలిక (చిన్న నవల) కూ తేడా ఏమిటి? అనే ప్రశ్న ఎదురవుతుంది. కథానిక, నవల, నవలిక వచన కల్పనా కథాసాహిత్యంలోవే. వాటిలోని సామాన్య లక్షణాలు ఇవే కావచ్చు. అయితే మరి తేడా ఎక్కడుంది?

కొడవటిగంటి కుటుంబరావు చిన్న కథను అంటే కథానికను గురించి అంటారుకదా "చిన్నకథలో ఒకే ఒక జీవిత ఘటన చిత్రించబడుతుంది. పాత్ర చిత్రణ ఉంటుంది. కాని అది కూడా ఒక్క ఘటనకే పరిమితమై ఉంటుంది. చిన్నకథను **(Snap shot)** ఫొటోతో పోల్చారు. అందులో జీవితం తాలూకు కదలికలు కనబడవు. పాత్రల మనస్తత్వాలలో పరిణామాలుండవు. ఒకటి రెండు సన్నివేశాలు, పాత్రల మనస్సులలో కల్గే చైతన్యమూ ఉన్నప్పటికి అవి, పైన చెప్పినట్టు, ప్రధాన ఘటనను ఆశ్రయించే ఉంటాయి. ఆ ఘటన యొక్క ప్రభావం పాత్రల చిత్తవృత్తిపై ఏవిధంగా ఉండేది చిత్రితమవుతుంది." (చిన్న నవల, కళాకేళి)

నవల విస్తృత పరిధి ఉన్న రచనగా తేలిపోయింది. ఆ విస్తృతి రెండు లక్షలపదాలు మొదలుకొని 60, 70 వేల పదాల వరకు ఉండవచ్చునంటారు. మరి నవలిక అంటే చిన్న నవల ఎట్లా ఉంటుంది?

"చిన్న కథను పెంచినా, నవలను కుంచించినా చిన్న నవల అవుతుందన్న భావం ఎవరికైనా ఉంటే అది సరి అయిన భావం కాదు. ఇలాంటి అపోహ కలగడానికి కొన్ని కారణాలు లేకపోలేదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు "వడ్లగింజలు" కథను మొదట చిన్నకథగా రాసి తరువాత అదేకథను చిన్న నవల రూపంలో రచించారు. కానీ రెండింటి స్వభావమూ ఒకటికాదు. చిన్న నవలలోకి జమీందారి సంస్కృతీ,ఆనాటి వాతావరణమూ, ఆచార వ్యవహారాలు చక్కగా దిగివచ్చాయి. వారి చిన్న కథ మనని తీసుకుపోలేని వాతావరణంలోకి చిన్న నవల తీసుకుపోగలిగింది. ఇదే కథ పెద్దనవల అయి ఉండినా సాధ్యం కాదు. ఎందుచేతనంటే ఈ చిన్న నవలలో, కూడా ప్రధాన ఘటన ఒకటే.

ఇదే నవలకూ, చిన్న నవలకూ ఉండే ముఖ్యమైన తేడా అని నా అభిప్రాయం. చిన్న నవలలో ప్రధాన సంఘటన ఒకటే ఉన్నప్పటికీ, ఆ సంఘటనకు కారణభూతులైన పాత్రల చిత్తవృత్తులకూ,వాటిచుట్టూ ఉండిన వాతావరణానికి తగినంత ప్రాముఖ్యం ఉంటుందని పించినపుడు చిన్నకథ రాయటంకంటే చిన్న నవల రాయటం మంచిది" (కుటుంబరావు, చిన్న నవల, కళాకేళి పత్రిక).

అంటే కేవలం విస్తృతిపరిధి తేడాను నిర్ణయించ దన్నమాట. మాసపత్రికలకు జోడించిన నవలలు అనబడే వాటిని, పుస్తకరూపంలో వచ్చిన ప్రసిద్ధుల రచనలనూ పోల్చి పరిశీలించినపుడు తేడాలు మరింత ప్రస్ఫుటంగా తెలుస్తాయి.

అసలు నవల ప్రయోజనం ఏమిటి అనేది కూడా మనకు చదవగా చదవగా తెలియకపోదు. పరిశీలనగా చదవగా చదవగా పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లు మన సంస్కారాన్నీ, సాహిత్య సంస్కారాన్ని పెంచే మంచి నవలలు ఏవో పాఠకులకు తెలియకపోవు.

***(సాహిత్య ప్రస్థానం ప్రత్యేక సంచిక కథనశాల నవంబర్ - డిసెంబర్ 2013 సంచిక నుండి)***

♦

## దిగంబర కవి మహాస్వప్న ఇక లేరు....



దిగంబర కవులు ఆరుగురులో ఒకరైన మహాస్వప్న జూన్ 25న కన్నుమూశారు. ఆయన వయస్సు 79 ఏళ్లు. దిగంబర కవిత్వోద్యమంలో మహాస్వప్నది విలక్షణమైన గొంతు. ప్రకాశం జిల్లా లింగసముద్రంలోని తన స్వగృహంలో మహాస్వప్న తుదిశ్వాస విడిచారు. "నేను వస్తున్నాను దిగంబరకవిని" అంటూ దిగంబర కవిత్వోద్యమానికి మహాస్వప్న స్వాగతం పలికారు. మహాస్వప్న అసలు పేరు కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు. కమ్మిశెట్టి వెంకయ్య నారాయణమ్మల ఏకైక కుమారుడు. ఆయనకు ఒక చెల్లెలు ఉంది. లింగసముద్రంలో ఆయన ఆమె దగ్గరే ఉంటూ వచ్చారు. వృతిరీత్యా వ్యవసాయదారుడైన మహాస్వప్న బ్రహ్మచారిగానే ఉండిపోయారు. ఇంటర్మీడియెట్ వరకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మహాస్వప్న చదువుకున్నారు. ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. దాంతో ఆయన జీవితం మలుపు తీసుకొంది. అక్కడ వివేకవర్ధని కళాశాలలో బీఏలో చేరారు. ఈ క్రమంలో అభ్యుదయ, ప్రగతిశీల సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. 1958లో ప్రముఖ సంపాదకుడు నార్ల చిరంజీవి సహకారంతో పద్దెనిమిదేళ్ల వయసులోనే చందమామ పేరుతో బాలకవితా సంపుటి వెలువరించారు. 1964లో అగ్నిశిఖలు – మంచు జడులు, స్వర్ణధూళి కవితా సంపుటులను ప్రచురించారు. బద్ధం భాస్కరరెడ్డి (చెరబండరాజు), మానేపల్లి హృషికేశవరావు (నగ్నముని), యాదవరెడ్డి (నిఖిలేశ్వర్), వీరరాఘవాచార్యులు (జ్వాలాముఖి), మన్మోహన్ సహాయ్ (భైరవయ్య)లు దిగంబర కవులుగా తెలుగు కవిత్వంలో ప్రాచుర్యం పొందారు. దిగంబర కవుల ఉద్యమం మూడేళ్లపాటు సమాజంపై, సాహిత్యంపై తీవ్రమైన ముద్ర వేశాయి. వారి పదజాలం, వ్యక్తీకరణ తీవ్ర విమర్శలకు కూడా గురైంది. సామాజిక స్ఫూర్తితో విలక్షణ కవిగా తెలుగు కవితా క్షేత్రంలో పేరు తెచ్చుకున్న మహాస్వప్నకు జోహార్లు. ♦

## వాళ్ళ తిత్తులు నిండవు



- శాంతయోగి యోగానంద
9652271520

*వాళ్ళు....*
*పొలం గురించి బాగా తెలిసిన వాళ్ళు*
*మట్టితో మాట కలపగలిగిన వాళ్ళు*
*అయినా సొంత భూమంటూ లేని కూలీలు*
*మునాల ముందు జానపద కథల్లోని పాత్రల్లా*
*మెదులుతుంటారు*
*పంటను కదిలిస్తే కథలా కదిలి*
*పొలం గట్ల మీదుగా సాగి*
*దుక్కి దున్ని నాట్లు వేసి కోతలవరకు చేరుకుని*
*గట్టు మీదున్న రైతు దగ్గర మోపులు దించి కథ ముగిస్తారు*
*పొద్దుననగా వాళ్ళు,పక్షులు చేలలో వాలిపోతారు*
*తిండిగింజలకోసం*
*అవి ఏరుకుంటాయి ముక్కుతో*
*వీళ్ళేమో చేతుల్తో....*
*పొద్దుగూకులూ చర్మాన్ని పిండి*
*స్వేదాన్ని మొక్కల మొదళ్ళలో మృత్తికలో కలపడంతో*
*ఆ వెచ్చటి స్పర్శకు బిర్రబిగిసిన నేలైనా*
*మెతకబారిపోతుంది*
*సాయంత్రానికి కట్టెల మోపులా మోసుకొచ్చిన అలసటని*
*ఒక నిట్టూర్పుతో కిందకు దించి జారగిలపడతారు*
*ఏళ్ళుగా పెంకు కట్టిన వారి కూలి బ్రతుకుల్లో*
*ఇప్పటికీ ఒక్కోపూట అన్నపేగు కొరుకుతుంటుంది*
*మృత్తికను సాంబ్రాణి కడ్డీలుగా వెలిగించుకునే*
*ఈ రైతు కూలీలు*
*ఎప్పుడైతే ముక్కార్లైలు పల్లె పొలిమేర దాటి పోయిందో*
*అప్పుడు పొలం వైపు నడవాల్సిన కాళ్ళు*
*ఖార్కానాల వైపు పోసాగాయి*
*తిరుగుముఖంలో యంత్రాల అరుపులు వినిపిస్తూ ఉన్నాయే*
*కాని తిత్తులు మాత్రం నిండడం లేదు ఎంత చేసినా.* ♦

# పుస్తకం

- సుమనశ్రీ
9642390940

జీవితానికంటూ
అసలైన అర్థం వెతుక్కోవాల్సిన
అవసరం వచ్చిన ఓ క్షణాన
పరిచయమైంది నాకు పుస్తకం
పుస్తకం మన ఒడిలో ఉందనుకుంటాంగానీ
నిజానికి పుస్తకం
మనల్ని తన ఒడిలోకి తీసుకొని
జ్ఞానాన్ని
అనుభవాన్ని
వాక్యాలు వాక్యాలుగా కలిపి
ప్రేమగా తినిపిస్తుంది మనకు
పుస్తకం అచ్చం మన అమ్మ.



పుస్తకాల్లోని
మనుషుల,జంతువుల పాత్రలను
చదువుతూ చదువుతూ ఉంటే
మనుషుల్లోని పుస్తకాలు జంతువులు
కనిపించసాగాయి నాకు.
మనుషుల్లాగా ఉండే మనుషులందరిలో
అసలు మనుషులెవరో
చెప్పింది నాకు పుస్తకం.

వేల దారుల్లో
వెర్రిగా పరుగెత్తి పరుగెత్తి
అలసిపోయి
నిశ్శబ్దమైన ఓ క్షణాన
దారులన్నీ ఏకమై నడవగలిగే
మానవత్వపు పూలదారిని
ఆవిష్కరించింది
పుస్తకం నా ముందు

భగవంతుణ్ణి
సృష్టించిన మనిషి నాడి పట్టించి
బ్రతుకు రంగస్థలంపై
నా పాత్రేమిటో అభినయించి మరీ
చూపింది నాకు పుస్తకం.

పుస్తకం నీకేమిచ్చిందని నువ్వడిగితే
నేవెతికేదానికన్నా
వెయ్యి ఒంతులెక్కువే
ఇచ్చిందంటాన్నేను

జీవితాన్నీ,
జీవితాన్ని మట్టిపాలు చేసే
మృత్యువునూ
ఒకదాన్నేమిటి
అన్నింటినీ ప్రేమించే కళలోని
రహస్యాన్ని
రహస్యంగా చెప్పింది నాకు పుస్తకం

నేనెక్కడో పారేసుకున్న నేను
నాకు మళ్లీ పుస్తకాల్లో దొరికాను
పుస్తకం నాకు
అసలైన నన్ను పట్టించింది
నన్నొక్కణ్ణి అనేకం చేసి
అనేకంలో నన్నూ ఒకణ్ణి చేసింది
పుస్తకం.

పుస్తకం చదవడమంటే
జీవిత రహస్యం కోసం
నేను చేసే నిరంతర సుదూర
ప్రయాణమది




# వృద్ధోపనిషత్ ఒక జీవనసారం

- పుట్టి గిరిధర్
9491493170

ఊహాలోకంలో విహరిస్తూ, వాస్తవికతలో బతకడం చాలా కష్టం. అలాగే సాహిత్యం వేరు, జీవితం వేరు అని అనుకుంటే పొరపాటు. మన జీవితాన్ని మన కళ్ళముందే ఒక కావ్యంగా కనబరిస్తే ఆశ్చర్యపోతాం, హత్తుకుపోతాం. అలాంటి అనుభవాలను, అనుభూతులను మన కళ్లముందు ఉంచుతారు ప్రముఖ కవి గోపీ. వారు ముట్టని వస్తువంటూ లేదు. మనకు మాములుగా కనబడే వస్తువే వారి కళ్ళకు గొప్ప అనుభవగీతమై, మన హృదయానికి చేరుతుంది. ఆనాటి తంగెడుపూల నుండి నేటి చైనా పద్యాల దాకా కవితాప్రయాణాన్ని గమనిస్తే మనకు అవగతమౌతుంది. సున్నితమైన భావాలను, అంతే సున్నితంగా మనసులోకి ఇంకేటట్లు కవిత్వాన్ని అల్లడమే వారి కవితామర్మం. ఆ అల్లికలో మన హృదయం చిక్కుకుపోవాల్సిందే.

పిల్లల కోసమో, ప్రేమ కోసమో, జీవితం కోసమో, సామాజిక బాధ్యత కోసమో కవిత్వం రాయడం ఆయా వయసును బట్టి, ఆయా పరిస్థితులను బట్టి వారి హృదయ స్పందన కావచ్చు. అలాగే ముసలితనపు వ్యథను కథల్లో, కవిత్వంలో కూడా అక్కడక్కడ రాసే ఉంటారు. కానీ ఇంతటి స్థాయిలో వృద్ధాప్య జీవిత కవిత్వం రావడం ఇప్పుడే చూస్తాము.

*"జీవితమంతా గడిపింది గొప్ప కాదురా*
*వృద్ధాప్యం గడిపిందే గొప్ప"* అని ఒక అమ్మ అంటుంది, ఆ అమ్మ ఎవరో కాదు గోపీ గారి అమ్మ. ఈ మాట జీవితసత్యం, కాదనేవారు ఎవరూ లేరు. అలా "వృద్ధోపనిషత్" కావ్యం ద్వారా మనల్ని మన భవిష్యత్ లోకి తీసుకువెళ్తున్నారు. 2011 నుండి నేటి దాకా పడిన తపన, యాతన ఈ కవితా సంపుటి.

మన దేహానికి, మన జీవితానికి ఒకరి తోడు అవసరం. అది పసితనంలోనైనా, ముసలితనంలోనైనా. పసివాళ్లుగా ఉన్నప్పుడు ప్రతి ఒక్కరు తోడుంటారు. ముఖ్యంగా తల్లి మన ఆలనా పాలనా చూస్తుంటుంది. కానీ ముసలితనం వచ్చాక అందరికీ విసుగు కలుగుతుంది. ఎవరూ మన మాట వినరు, ఎవరూ మనల్ని లెక్కచెయ్యరు. చావుకోసం ఎదురుచూస్తూ బతుకుతాం. అలాంటి పరిస్థితి శ్రీమంతుల ఇళ్లల్లో, పేదల ఇళ్లల్లో అని కాక దాదాపుగా అందరి ఇళ్లల్లో కనబడుతుంది. అంతటి దుర్భర జీవితంలో కూడా ఓర్పుతో, సహనంతో, కాస్త ఉత్సాహాన్ని, కాస్త ధైర్యాన్ని కలుపుకుంటూ బతకమని గోపీ గారు ప్రేరణ కల్గిస్తారు.

*"వృద్ధుడంటే*
*ముసలివాడని కాదు*

***వృద్ధి పొందినవాడని"*** నిర్వచిస్తూ "వృద్ధోపనిషత్" కావ్యాన్ని ప్రారంభిస్తారు.

ఈ కావ్యంలో ముఖ్యంగా వృద్ధాప్య దశలో రెండు అంశాలను చెబుతారు. అందులో మొదట వారి దీనావస్థను వర్ణిస్తూనే చివర వారిలో ఆత్మవిశ్వాసాన్ని, మనో నిబ్బరాన్ని కలిగిస్తారు. ఆ రెండు దశల మధ్య జీవితంలో ప్రతి అంశాన్ని తట్టి చూపుతారు. జీవితాన్ని అక్షరాల్లో బంధిస్తూ ఎలా జీవించాలో ఉద్బోధిస్తారు. కాబట్టి ఈ కవిత్వాన్ని జీవకవిత్వం అనొచ్చు.

అందుకే,

***"ఉగ్గ పట్టుకో హృదయమా***

***ఇది ఒక అమ్మ, ఒక నాన్న కన్నీటి కావ్యం"*** దీన్ని చదువుతూ ఉంటే అందరి హృదయాలు కరిగి కన్నీరవ్వాలసిందే.

***"పొద్దుటి పూట***

***తీగ మీద నీటి బిందువులు***

***ముత్యాల్లా ప్రకాశించేవి,***

***ఇప్పుడు వాటిని కన్నీళ్ళతో పోల్చాలేమో"*** అంటూ నాటి దశకు, నేటి దశకు మధ్య స్పష్టమైన తేడాను తెలియజేస్తారు.

పసితనం, వృద్ధాప్యం ఒకలా అనిపిస్తాయి కానీ ముసలితనంలో ఒంటరితనం ఎక్కువగా వేధిస్తుంది.

***"ఒంటరితనం అంటే***

***చుట్టూ ఎవరూ లేకపోవడం కాదు***

***ఉన్నా లేనట్టు అనిపించడం!"*** జీవితానికి అంతకంటే నరకం ఇంకేం ఉంటుంది. కాళ్ళలో, చేతుల్లో పటుత్వం ఉండదు. ప్రతీ దానికి ఒకరిపై ఆధారపడతారు. వృద్ధులు పడే అవస్థలు అంతా ఇంతా కాదు. "వృద్ధులు లేనిదెక్కడ" అంటూ పోస్టాఫీసులో, బ్యాంకుల దగ్గర, ఆఫీసుల దగ్గర

***"కిటికీకి చూపులు బిగించి***

***పడిపోకుండా నిల్చుంటారు"***

***ఆస్పత్రుల్లో అయితే చెప్పరాదు***

***"ముసలితనమే ఒక రోగమైనట్లు"*** వైద్యుల ప్రవర్తన ఎంతో దుఃఖాన్ని కలుగజేస్తుందనే సందర్భాలను ఆర్ద్రంగా వర్ణిస్తారు.

ఎదనిండా కన్నీటిని నింపే కవిత "నీళ్ళు"

దాహం వేసిన పెద్దాయన నీళ్ళు అడిగే సందర్భం అది. కొడుకు బయటికెళ్ళే తొందరలో ఉంటాడు, కోడలు విన్నా వినబడనట్లే, మనవడు టీవీలో మునిగి ఉంటాడు, పనివాడు బయటకు వెళ్లి ఉంటాడు. నీళ్లిచ్చేవారు ఎవరు లేరు, ఎవరి పనుల్లో వారుండగా చివరికి చెబుతూ

***"కాస్సేపు***

***నిశ్శబ్దం రాజ్యమేలింది,***

***ఎవరు నింపారో తెలియదు గానీ***

***అతని కళ్లనిండా నీళ్లే"*** అంటూ పెద్దాయన పరిస్థితిని ఎంతో సహజంగా చిత్రిస్తారు, ఊహకందని ముగింపునిస్తారు. ఇది చదువుతుంటే గుండె చెరువు కాక మానదు. ఈ కావ్యానికి ఈ కవిత మకుటాయమానంగా నిలుస్తుంది.

మొగుడనే ప్రతివాడూ ప్రతిపనికీ పెళ్ళాంపై ఆధారపడవలసిందే. చివరి క్షణాల్లోనైనా "ఆమెకూడా" కవితలో ఆమె గురించి కూడా కాస్త ఆలోచించమంటారు.

ఇన్నిరోజులూ అలా తన పనులు చేయించుకున్నదానికి

***"నేను ఈ మధ్యనే***

***సిగ్గుపడటం నేర్చుకుంటున్నాను" అంటారు***

***"సాయమంటే మరేమో కాదు***

***నా పనులు నేను చేసుకుంటున్నాను"*** అంటూ ఆమెకు సాయం చెయ్యడమంటే మన పని మనం చేసుకుంటే చాలని చెప్తారు.

ముసలోడిని ముసలోడా అంటే ఎవరు అంగీకరిస్తారు. అలాగే ముసలితనపు చిగురులు మనలో కనిపిస్తున్నాయని ఎవరైనా అంటే కూడా అంగీకరించినా మనసు మాత్రం అంగీకరించదు. అందుకే

***"ముదిమిని అంగీకరించడం***

***మాట్లాడినంత సులభం కాదు"*** అంటారు "పూర్ణకుంభం" కవితలో. నిజమే కదా అది అందరికీ అనుభవమే ముసలితనాన్ని ఆహ్వానించాలంటే ఎంత ధైర్యం కావాలి.

ఆ ముసలితనంలో గుండెలో ఎన్నో బాధలు దాగి ఉంటాయి. ఎవరైనా కాస్త ప్రేమగా పలకరిస్తే చాలు నీళ్లు బయటకు వచ్చేస్తాయి. అందుకే అంటారు ఆ

***"కళ్ళలో నీళ్ళు సిద్ధంగా ఉంటాయి***

***పైకి కనబడవు"*** అది లోలోపలి బాధ, ఎవరికీ కనబడదు, వినబడదు. జీవిత చరమాంకంలో

***"శత్రువులెప్పుడూ లేరు***

*ఇప్పుడు ముసలితనమే ఓ దుష్మన్"*

ఇది జగమెరిగిన వాస్తవం, కానీ అది అనుభవించే వారికే సుస్పష్టం.

ముసలివాళ్ళని డబ్బులకోసం ఎలా పీడించుకుతింటారో "ఓల్డ్ ఏజ్ పెన్షన్ కోసం" కవితలో

*"మొదటిసారి కొడుకులు*

*గద్దల్లా కనిపిస్తున్నారు*

*యముడు ప్రాణాలు లాక్కుపోతున్నట్లు పైసలు లాక్కెళ్లడం"* రాక్షసతత్వానికి నిదర్శనంగా పరిగణిస్తారు.

ఒంటరిదైన "నాయనమ్మ" ఇంటి ముందు కూర్చొని

*"కాకులు రేపు నా పిండాన్ని ముదుతాయో లేదో*

*జీతగాడు పాడె మొయ్యడానికి ముందుకొస్తాడో లేదో"* అని ఆలోచిస్తుంది.

మనుమరాలికి కథలు చెబుతూ ఉంటే

*"నిజానికి*

*ఆమె కథలకు శ్రోత మనుమరాలా*

*తానేనా అనేది అర్థం కాదు"* అని అనడం వారి మానసిక స్థితిని తెలియజేస్తుంది. ఓ మూల చీపురులా ఉండే ముసలమ్మ అందరికంటే

*ముందే మేల్కొని*

*సూర్యుణ్ణి లేపుతుంది*

*అతని కిరణాలను*

*చురుగ్గా పేనుతుందట.* ఈ దృశ్యం పల్లెల్లో ప్రతి ఇంటిముందు కనబడేదే. ఒంటరివాళ్ళైన ముసలి వాళ్ళు ఎలా తమ జీవితాన్ని నెట్టుకు వస్తున్నారో తెలియజేస్తారు.

గొప్ప కవిగా పేరొందిన కవులనైనా, రచయితలనైనా చివరి దశలో వాళ్ళని పట్టించుకోదు నేటి తరం, కానీ వారి భావాలను వ్యక్తపరుస్తుంటారు. అందుకే వాళ్ళు "ఘోస్ట్ రైటర్" లుగా మిగిలిపోతారు అంటారు

నీవు రాసిన వాటినన్నిటినీ వాడుకుంటారు కానీ

*"నీ పేరుండదు*

*కాలాన్ని అర్థం చేసుకోవడమే*

*నీకిప్పుడు మిగిలింది"* నాటి రచయిత, ఇప్పుడు కనబడని రచయితగా మిగిలిపోతాడు.

నేటి కాలంలో వృద్ధాశ్రమం అందరికీ చాలా సుపరిచితం ఐపోతోంది. ఎక్కడికెళ్లినా, ఎంత సాధించినా చివరికి వృద్ధాశ్రమం చేరడం తప్పడం లేదు. అందులో చేరాక ఒంటరితనం ఆవహించాక ఒక్కసారి కిటికీలోంచి చూస్తే

*"గతంలో తెలిసిన ఆకాశమే*

*కానీ ఇవాళది పూర్తిగాశూన్యం"* గా కనిపిస్తుంది. అలాగే

*"వృద్ధాశ్రమంలో మంచాలు పాతవే*

*వచ్చిపోయేవాళ్లే మారుతుంటారు"* పోయాక రావడం ఉండదు కదా అని వారి ఉద్దేశ్యం.

ముసలివాళ్లకు ఆసుపత్రుల సందర్శన తప్పనిసరి. అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయో వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ తెలుసు అందుకే "హాస్పిటల్స్ లో కవిత్వముండదు" అంటారు, అంటే మానవత్వం ఉండదని కవి ఉవాచ కాబోలు. మానవత్వం ఉండని చోట కవిత్వం కూడా పుట్టదు. రోగిగా తప్ప మనిషిగా చూడని వైద్యులకు, సిబ్బందికి ముసలివాళ్లను చూస్తే

*"వయసు మళ్ళిన వాడికి*

*జీవితాశ ఏమిటని కాబోలు"* అనుకుంటారని మొహమాటం లేకుండా కఠిన వాస్తవాన్ని చెప్తారు.

ఇలా ప్రతిదశలో వృద్ధుల మానసిక, శారీరక, సామాజిక అనుభవాలను చిత్రిస్తూ చివరి దశ అంటే మరణాన్ని చేరువ అవుతున్న దశను మరిన్ని కవితల్లో మనకు చూపిస్తారు.

"ఇచ్చా మరణం"లో మనిషి చివరి దశలో ఎలా కనబడతాడో స్పష్టంగా చెబుతారు.

*"అతని కనులు చూస్తే తెలుస్తుంది*

*నూనె అయిపోతున్నప్పుడు*

*సన్నబడ్డ దీపకళికలా ఉన్నాడు*

*అతడేదో గొణుగుతున్నాడు*

*బహుశా*

*మరణానికి స్వాగతం పలుకుతున్నాడేమో!"* అంటారు.

దేహాన్ని, ఆత్మను వేరుచేసి చెబుతూ "పాపం! శరీరం" కవితలో దేహం ఎన్ని పనులు చేసిందో అంటూ ఆశ్చర్యపడతారు. అలాంటి గొప్ప దేహం ఇప్పుడిలా మారిపోయిందేమిటని గమనిస్తారు.

*"నేను బయటికి రావడం*

*సబబు కాదు*

*మళ్లీ ప్రవేశించి*

*అతనికి ధైర్యం నూరి పోస్తాను*

*శరీరం కేవలం*
*ఎముకల సంచి కాదని*
*సంచిత ఐతిహాసిక ప్రకాశమనీ*
*ఎరుకపరుస్తాను*
*మరణం ఒక భూతం కాదని*
*ఒట్టి గాలి సరుకని విశదపరుస్తాను"* అంటూ మనిషికి మరింత హితబోధ చేస్తారు.

రోజూ "ఆరాం కుర్చీ"ని తుడిచే మనవడు ఆ కుర్చీ వల్ల గాయపడిన తాతను చూసి కుర్చీ కూడా బాధపడుతుందట, అందుకే

*"నిన్నలేని తడి*
*ఇవాళ ఎందుకొచ్చిందో వాడికి అర్థం కాలేదు"* అంటారు. ఇలాంటి వాక్యాలతో ఎంతటి కరుణ రసం ఒలికిస్తారో తెలుస్తుంది.

గోపీ గారికి ఇప్పుడు "డెబ్బయి సంవత్సరాలు" అందుకే అదే శీర్షికతో వారి జీవితాన్ని ఒక కావ్యంగా మలిచి తమ కవిత్వం ద్వారా ఏం చెప్పదలచుకున్నారో తెలియజేస్తూ

*"ఇవాళ నేనొక వాగ్దానం చేస్తున్నాను*
*కొంచెం అలసట కనబడ్డా జీవితం నాకు ప్రసాదించిన తేజస్సు తగ్గకుండా రేపటి ప్రతి ఉషస్సునూ వెలిగిస్తాను కొత్త వంతెనలు నిర్మిస్తూ మనుషుల్ని కలుపుతాను"* అంటారు.

ఎన్ని ఏళ్ళు గడిచినా
"జ్ఞాని" అనే వాడు వయసు గురించి ఆలోచించడు

గొప్ప గొప్ప విజయాలు సాధించిన వాళ్ళు కొందరు అరవై ఏళ్ళు దాటిన తరువాతనే వారు ఆ కార్యాన్ని మొదలుపెట్టారని వారి జీవితాలు పరిశీలిస్తే తెలుస్తుంది. మనసుకు వయసు లేదు అలా వారిని

*"ఏదో తత్వం అతన్ని నడిపిస్తుంది*
*బహుశా*
*జీవితాన్ని ప్రేమించేవాడికి*
*మరణమంటే భయముండదు"* అందుకే

"నిర్భయ గీతి" లో మృత్యువు ఊసు తెచ్చి నన్ను
భయపెట్టకండి కల రహస్యం తెలిసినవాణ్ణి
కాలునికి భయపడతానా! అంటూ భవిష్యత్తు ఊహల పల్లకి మరణమూ అంతేనంటారు.

*"కాలం జీవిత గుమ్మానికి కట్టిన*
*మామిడి తోరణం*
*ఎండుటాకులు గలగలలాడినా*
*అది తోరణమే*
*పచ్చదనమే దాని జ్ఞాపకం"* అంటూ మరణం కన్నా ఎక్కువగా భయపెట్టేది జీవితమేనంటారు

పుస్తకం మొత్తం చదువుతూ ఉంటే జీవ కవిత్వం ఉట్టిపడుతుంది. జీవిత సారాన్ని అక్షరాల్లో ఒంపి మన కళ్ళముందు ఉంచుతారు. ఎక్కడా భాష గురించో, నిర్మాణం గురించో, శిల్పం గురించో విమర్శ చేసే అవకాశం మనకు రాదు. చివరి కవిత "ఫలశ్రుతి" లో ఆకట్టుకునే శిల్పవిన్యాసం తో ముగిస్తారు. కావ్యనాయకుడిని సంబోధిస్తూ

*"వృద్ధుడా!*
*సప్త సాగర సతత తరంగ పీడితుడా*
*నిరంతర నావికుడా*
*చిరకాల యోధుడా*
*నీకు నువ్వే బ్రహ్మవు*
*సార్థక్య మానవ జన్మవు*
*మరణం నీకు మరో ఆవరణం*
*జీవన మంటపానికి తోరణం*
*ఇవాళటి కొత్త జీవితం*
*కలకాలం పరిమళించే మరకతం"* అంటూ

వారి గొప్పతనాన్ని, వారి మనోభావాలను, వారి హృదయాలను ఇందులో గొప్పగా ఆవిష్కరిస్తారు. ఇలా వృద్ధాప్యంలో కనబడే ప్రతి కోణాన్ని ఆ జీవితంలో కనబడే కరుణ రసాన్ని మిళితం చేసి రాసారు. సమాజంలోని అనుభవాలు, వారి పరిశీలనాత్మక దృష్టి ఇలా రాయడానికి పురికొల్పాయి. వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరికీ ఎదురయ్యే శారీరక, మానసిక, సామాజిక సమస్యలు ఇందులో చూపిస్తారు. ఇలా వృద్ధాప్య దశను చిత్రిస్తూనే యువతరం వృద్ధులను కొంతైనా అర్థం చేసుకోవాలనే ఆకాంక్షను తెలియజేస్తారు. ఎంత చెప్పినా తరగని కథ వృద్ధులది అంటూ

*"వృద్ధాప్యం*
*ఒక పొడువని ఆత్మకథ"* గా అభివర్ణిస్తారు. కాబట్టి నేటి కాలానికి ఈ "వృద్ధోపనిషత్" ఒక ఉపనిషత్తు లాంటిది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ముఖ్యంగా ఇది నేటి యువత చదవాల్సిన జీవనగ్రంథం. గోపీ గారి జలగీతం తర్వాత అంతటి గొప్పకావ్యంగా నిలుస్తుంది ఈ వృద్ధోపనిషత్ కావ్యం. ♦

## అతని కొలిమి సబ్బండ వర్ణాలకు బలిమి

- గన్నోజు శ్రీనివాసాచారి
9490145913

నిత్యాగ్ని హోత్రి నిరతం రైతుసేవ
"శ్రమయేవజయతే"కి
జీవనాడి!



♦
అతను నిత్యం కొలిమిలో
తన రక్తాన్ని మరిగించి స్వేదంతో దాహం తీర్చుకొనే
ఓజు నిత్యకృషీవలుడు!
♦
కొలిమి చంద్రనిప్పులతో
వళ్ళంత నింగిచుక్కలై
రైతాంగానికి సర్వాంగాలను ధారవోసే
ఓజు రైతుల పాలిట రాజే!
♦
అతని కర్రు మొన నాగలికొన మేడితో
ఆరునెలల వతం దారికి జీవితాన్నర్పించి
రైతుతో భూతల్లిని చేసిన ధాత!
♦
అతని కొలిమికి
కులమతాల మాలిన్యం లేదు
మెత్తని తన మనసుకు
ఒదిగిపోయెవి
పనిముట్లన్ని
అతడు ఒడ్పున్న పరుసవేది!
♦

## చూపు కలపండి

- ఎస్. ఆర్. పృథ్వి
9989223245

స్వరమొకటి కరక్షరమై
వేకువను నిందిస్తూ
కర్ణకుటీరాల్లోకి, అలజడి
క్షిపణిలా దూసుకొచ్చింది
ఆ శబ్ద ప్రకంపనాలకు
నెత్తురు ప్రవాహం ఆగిపోయింది
గుండెలోని చైతన్యం ఘనీభవించి
రాయిలాగ మారిపోయింది

వికర్ణుడి
కామజ్వాలలకి వళ్ళంతా కాలి
జీవన స్వేచ్ఛను కోల్పోయిన
లేగదూడ అసహనంలోంచి
పుట్టిన ఉరుములాంటి కేకది
సభ్యత మరచిన సమాజాన్ని
కన్నీటి బొట్లతో ప్రశ్నిస్తున్న
పిడుగులాంటి శబ్దమది

స్వేచ్ఛా సౌధం మీద
రెపరెపలాడుతున్న
శ్వేత వర్ణపు కేతనంపై
హూంకరిస్తున్న స్వార్థం
విషతుంపర్లు చిమ్మి,
నిరంకుశంగా
కాల్చేస్తున్న సందర్భం
కనురెప్పల్ని త్రోసుకొని
జాలువారుతున్న జలధారలో
దృశ్యమైన చిత్రం
మనసు వాకిలంతా పరుచుకొంది



మానవజాతి వల్మీకంలో
అమానవీయ నాగుల చలనం గురించి
ఎంత ప్రయత్నించినా
అంతు పట్టడం లేదు
నరనరాన్ని కుదిపి
నిర్దాక్షిణ్యంగా ఆనందాన్ని
పగుల గొట్టిన క్షణమది

అగ్ని పర్వతంలాగ
నిరంతరంగా జ్వలిస్తున్న
స్వార్థాసురుడిని
నేలకూల్చేందుకు
నిజాయితీ నిప్పు కణికలు
ఎర్రబడ్డ నేత్రాలతో
చూస్తావున్నాయి
రండి, వాటితో చూపు కలపండి
అసహజ సంపదను కాల్చేద్దాం. ♦

నచ్చిన రచన

# మూలాల్ని తడుముకుంటూ వెల్లువెత్తిన కవన ఝరి






బంగార్రాజుకంఠ

- వై.హెచ్.కె. మోహనరావు
9440154114

బంగార్రాజు కంఠ ప్రస్తుతం సాహితీ లోకంలో బహుళంగా వినిపిస్తున్న నామం. తుఫాను కెరటంలా కవన వేదిక పైకి దూసుకొచ్చిన కవి. వాయు వేగంతో కవిత్వం అల్లుతున్న కవి. కంఠంలోనూ గంటంలోనూ అక్షర నిధిని నింపుకున్న కవి. నిత్యం సామాజికాంశాలతో కవన కథనం చేసేకవి. సామాజిక రుగ్మతలపై నిరంతరం రణ నినాదం అందుకునే కవి. గళం నుండి కలం గుండా అణచి వేతపై తిరుగుబాటు ధ్వని వినిపించే కవి. అణగారిన జీవితాలపట్ల సానుభూతి కురిసే మానవీయ దృష్టి కలిగిన సృజనవేత్త.

ఇదివరలో 'ఇసుక రేణువులు' 'బువ్వ' శీర్షికలతో సంపుటాలు వెలువరించిన బంగార్రాజు కంఠ ఇప్పుడు మన ముందుకు 'మూలాన్ని తడుముకుంటూ' మకుటంతో మరో కవితా సంపుటిని తీసుకొచ్చారు. ఈ సంపుటిలోని ఈ కవితలనూ ఆయన కేవలం 10 మాసాల కాలంలో సృజించడమేగాకుండా, ఆ కవితలన్నింటినీ ఏరి గుచ్చి ఒకచోటుకు చేర్చి సంకలనంగా ముద్రించారు. అతి తక్కువ సమయంలో ఈ మొత్తం ప్రక్రియను పూర్తిగావించినందునే బంగారు కంఠరాజు చైతన్యం వాయు వేగమంటూ వ్యాఖ్యానించాను. ఈ సమయంలో ఇంతకు రెట్టింపు సంఖ్యలో కవితల్ని వ్రాయగలిగే వారు ఉండివుండవచ్చు. కానీ సారవంతమైన కవిత్వం వ్రాయడం కదా ముఖ్యం. చేతిలో కలం వుందికదా! అంటూ ! ఇబ్బడి ముబ్బడిగా అక్షరాల వరుసల్ని పేర్చుకుంటూ పోతేనే కవిత్వమౌతుందా! బంగారు కంఠరాజు ఇందుకు భిన్నం. సాంద్రమైన కవిత్వీకరణ లేకుండా ఆయన కలం ముందుకు అడుగేయనంటుంది. చిక్కదనం తక్కువైతే అది ఒప్పనంటుంది. ఈ సంపుటిలోని అన్ని కవితలూ దాదాపుగా ప్రముఖ దినపత్రికల సాహిత్య పుటలలో చోటు దక్కించుకోవడమే బంగారుకలం రాజు 24 క్యారెట్ల మేలిమి కవిత్వం అల్లుతారనే నా అభిప్రాయానికి గీటురాయి.

'మూలాల్ని తడుముకుంటూ' అన్న మకుటంతో ఆయన తన మూలాల్ని కౌగిలించుకున్నట్లు మనం అర్థం చేసుకుంటాము. బంగార్రాజు కంఠ మూలాల్ని విడువని కవి. ఎక్కడి నుండి వచ్చామో ఎరుక లేకపోతే/ఎక్కడికి వెళ్ళాలో కూడా తెలుసుకోలేము' అన్న కవి వాక్యాలను అనుసరించేకవి. మూలాల్ని వదలివేస్తే సమాజానికి ఏమీ ఇవ్వలేకపోగా బేషజాల పాలౌతామన్నది బంగార్రాజు కంఠ విశ్వాసం. ఒక వృక్షానికి తల్లివేరు ఎట్లా మూలమౌతుందో, మనిషికి తనమూలమే తల్లివేరు ఔతుంది. ఈ సంగతిని గట్టిగా నమ్మిన వారు బంగారు కంఠరాజు.

వృత్తిరీత్యా ఎక్సైజు శాఖలో సిఐగా పనిచేస్తున్న ఒక ప్రభుత్యోగి ఐనప్పటికి, కాఠిన్యం కలిగిన లాఠీచేత కలిగిన

సుతిమెత్తని కవి 'కంఠ' అత్యంత సౌమ్యమైన స్నేహశీలి. దీనుల యెడ, పేదల, నిర్భాగ్యం, నిరాదరుల, పీడితులపట్ల కరుణ వర్షించే బంగారం లాంటి కవి'కంఠ'.

ఏ అంశాన్నైనా విస్తృతంగా, విపులంగా, ఆమూలాగ్రం కవిత్వీకరించగల 'కంఠ" కాదేది కవితకనర్హం' అన్న మహాకవి వాక్కును సుళువుగా అనుసరించగలిగే సత్తాకలిగిన కలం బలం వున్నవారు. ఎవరైనా సాధారణంగా విమానంతో ప్రపంచాన్ని చుట్టగలడు. మన బంగారు కంఠ కలంతో లోకాన్ని చుట్టి వేయగల సమర్థులు.

ఈ సంపుటిలోని కవిత్వాన్ని తడుముకుంటూ వెళితే అద్భుతమైన శైలి, శిల్పం, వ్యక్తీకరణలను అనుభవిస్తాము. ఇతరేతరులు ప్రకటించని విధంగా భావుకతను కవిత్వీకరించినట్లుగా అంచనాలు వస్తాయి. కాఠిన్యం లేని పదాలతో, చాటుమాటు మెలికలు లేని కవిత్వీకరణతో తన భావాలను వండి వార్చుతారు. సంపుటి పూర్తి చేసే సరికి సమాజాన్ని పట్టి పీడిస్తున్న వివిధ క్రానిక్స్ గురించి తెలుసుకుని గుండె బరువెక్కుతుంది. ఏ సమస్యనైనా కవితగా మలచగల నైజం బంగారాజు కంఠకు సహజంగా వచ్చి వుంటుంది.

'గుండెను తెరిచి చూడగలిగేది వాడొక్కడే/వాడు నాలోకి తొంగి చూసాకగానీ/నిజంగా నా గుండె చప్పుడు నాకు వినపడదు' అంటూ 'మిత్రుడు' శీర్షిక గలిగిన కవితతో స్నేహితునికి సరికొత్త భాష్యం చెపుతారు. ఈ కవితలో మిత్రత్వాన్ని ఆయన ఎవరెస్టు శిఖరమంత ఎత్తున నిలబెట్టారు. వాత్యల్యాన్ని కొత్తకోణంలో చిత్రించారు. స్నేహానికీ, స్నేహితునికో 'కంఠ' హృద్యంగా అర్థాన్ని మలిచారు. నేస్తం గూర్చి చాలామంది కవులు పలుపలు విధాలుగా తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కానీ దోస్త్ గూర్చి ఇంత విస్తృతంగా చెప్పిన 'కంఠ' నిజానికి ఒక గొప్ప మిత్రుడు. గొప్ప స్నేహాన్ని అందించగలిగిన వారే ఫ్రెండ్షిఫ్ గురించి గొప్పగా చెప్పగలరు. బహుశా ఆయన మిత్ర స్వభావాన్ని ఈ కవితలో వ్యక్తీకరించారనుకుంటాను. మిత్రులమధ్య హృదయ లయను కవిత్వీకరించి చెప్పడం 'కంఠ' ప్రతిభకు మచ్చు తునక అని నిర్ద్వంధంగా చెప్పగలను.

'నన్ను గెలిపించాలని చూడకండి/ఓటమి నాతో విసుగు చెందే వరకు' అని 'ఓటమిని ప్రేమిస్తూ' మకుటం కలిగిన కవితలో ఆయన సానుకూల దృక్పథాన్ని బలంగా వినిపిస్తారు. ఈ సానుకూల దృక్పథాన్ని ఆయన ప్రతికూల భావనతో చెప్పుకొచ్చిన తీరు నవ్యపంథాతో సాగింది. వాస్తవానికి 'ఓటమి గెలుపుకు సోపానం' అనే నానుడి వుంది. ఈ నానుడి ఆధారంగా రూపొందిన కవిత కావచ్చు. ఐనా 'కంఠ' సరికొత్తగా చెప్పుకొచ్చారు. కొందరు జీవిత పర్యంతం యుద్ధం చేస్తూనే వుంటారు. పోరాటం వారికి అత్యంత ప్రీతికరమైన ప్రయాణం. మండుతున్న కుంపట్లను శిరసుపై ధరించి ఆనందంగా జీవించే వారుంటారు. వారి సంఖ్య అరుదుగానే వుంటుంది. అధిక సంఖ్యాకులు విజయాన్నే కోరుకుంటారనేది జగద్విదితం. ఐతే అందుకు భిన్నంగా చెప్పి ఒక సరికొత్త కోణాన్ని ఆవిష్కరించారు. ఆయన గతానుభవాలనుండి ఈ కవిత ఉద్భవించి వుంటుంది. మూలాలను తడుముకుంటున్నప్పుడు కవి మెదడులో మెరుపులా మొలకెత్తిన కవితగా భావించవచ్చు.

'పూలరంగడు' శీర్షిక గల కవిత ముగింపులో మల్లెల విక్రేత చితికిన బతుకు, చిత్రాన్ని అక్షరీకరించారు. 'మల్లెప్పూలేయ్ అని అరిచినప్పుడు/ వీధి మొత్తం గుప్పున పరిమళిస్తుంది.' అంటూ పూల పరిమళాన్ని కేకలో యిమిడ్చి వ్యాప్తి చేశారు. ఈ కవిత చదివినప్పుడు కవి, విమర్శకులు, డా॥బీరం సుందరావు గారి 'గొడుగులోడు' తలకట్టు కలిగిన కవిత అసంకల్పితంగా స్ఫురించింది. గొడుగులు మరమ్మత్తు చేసే వాని జీవిత చక్రాన్ని సుందరరావుగారు ఆవిష్కరించినంత ఉత్తమ స్థాయిలో 'కంఠ' పూలరంగడు కవితకూడా రూపుదిద్దుకుని ఆకట్టుకుంది. మల్లెపూల సుగంధాన్ని, పూలు అమ్మే వాని జీవన దుర్గంధాన్నీ ఒ చట్రంలో యిమిడిన రెండు చిత్రాలకు మల్లీ మన ఎదుట దృశ్యమానం చేశారు.

'బంగారాజు కంఠ' కవిత్వంలో జీవిత సత్యాలుంటాయి. సామాజిక రుగ్మతలపై గట్టిగా ఎత్తిన స్వర ధ్వని వుంటుంది. అంతరాలకు దూరంగా సమానత్వంతో అలరారే ఒక సుందర ప్రపంచ ఆకాంక్ష వికసిస్తుంది. సంపుటిలో అనేకానేక సమస్యలను ఎత్తి చూపడమేగాకుండా వాటి పరిష్కార మార్గాలను కూడా ఆయనే స్పష్టంగా చూపించడం విశేషం.

"మూలాలను తడుముకుంటూ' తలపాగాతో 'బంగారాజు కంఠ' ప్రచురించిన సంపుటిని కవిత్వాన్ని ప్రేమించే వారంతా తప్పకుండా చదువుతారని ఆశిస్తాను. సాంద్రత కలిగిన కవిత్వాన్ని వరుసకట్టి మనకందించిన 'కంఠ'కు అభివాదాలు. రూ 150/-లు వెల. ధర కొంచెం ఎక్కువైనా లోపల సరుకు మరింత ఎక్కువుంటుందనీ, ధరకు మించి గలదనీ గట్టి చెప్పగలను. ఈ సంపుటి కోరువారు సంప్రదించవలసిన కవిగారి సెల్ నంబరు 8500350464. ♦

## ప్రాణం ఓ ప్రహసనం

- మూని వెంకటాచలపతి
7396608221



అక్షాంశాలు రేఖాంశాలుగా ఊహలతో
భూమిని కొన్ని భాగాలుగా విభజించి
వసంతానికి ఓ కాలాన్ని కనిపెట్టి
కోయిల కంఠానికి ఒక రాగాన్ని
స్వర పరచ గల మానవుడు
విశ్వ శాంతికి మాత్రం అతనొక
కాందిశీకుడు..!

మాతృ స్తన్యంలో జీవధార ప్రవహిస్తున్నా
మనిషి హృదయంలో మాలిన్యం చొరబడి
మానవత్వం ప్రశ్నార్థకంగా మారుతుంటే
ఎక్కడ వెతకాలి దయార్థ చిహ్నాన్ని..?

ఎనాఫిలస్ దోమల్లాంటి కొందరు మనుషులు
ప్రజా జీవనంలో యుద్ధాలను గుచ్చుతుంటే
శాంతి కపోతాలను ఎగరవేసే చేతులు
పరిశోధనా గుహల్లో హైడ్రోజన్ విస్ఫోటాల
తయారీలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి

దేశాల మధ్య గోడలను ఎత్తుగా నిర్మించి
ఖండాల మధ్య ఆంక్షలను చల్లుతుంటే
అభద్రతా భావం రావిచెట్టులా నిల్చున్నప్పుడు
భవిష్యత్ కాలం బుద్ధుడు కాంక్రీట్ భవంతిలో
జీవ సమాధి అవుతాడు..!

దేశాలు స్మశానాలకు ప్రతీకలౌతున్నప్పుడు
ప్రపంచం నిర్జీవమైన నిజాలు ఆవాసమైనప్పుడు
నాయకుల చేతుల్లో అణ్వాయుధాలు మాత్రమే
శాంతి మంత్రాలు జపిస్తుంటాయి.! ♦

## జీవన గతులు

- వారణాసి భానుమూర్తి రావు
9989073105

ఆకాశం పాలి పోవడం లేదూ
ఒంటరిగా కునారిల్లుతున్న ఎడారి దిబ్బలాగా
రోడ్లు బిత్తర పోవడం లేదూ
క్లీనరు నడిపిన బస్సు లాగా
సముద్రం క్రుంగి పోవడం లేదూ
జాలర్లు మింగిన చేపల్లాగా

చంద్రుడు నాకయితే కాళ్ళు తెగిన
ఒంటె లాగా కనబడ్డం లేదు
నల్లని అడవిలో తెల్లని కుందేళ్ళ
సమూహం లా ఉన్నాడు

జీవితం చక్కర్లు కొడుతోంది
వింత సంత ల్లాంటి సామూహికాల్ని
కలిపేసుకొంటూ

ఫిలసాఫికల్ కాంప్లెక్సిటీస్ ఆఫ్ లైఫ్
విచిత్ర సంబంధ బాంధవ్యాలతో
రాటు తేలడం లేదూ ?



కెరటానికీ గమనం ఉంది
గమ్యం ఉంది
ఎగిరి గంతేసి మళ్ళీ మళ్ళీ
ముందుకు ఉరుకు తూనే ఉంటుంది

అమాంతం సునామీల సమస్యలు
తీరాల్ని మింగినా
జీవితం పొద్దు పొడుస్తూనే ఉంది

గత్యంతరం లేక సూర్యుడు
ఉదయిస్తున్నాడా ?
క్షీణించిన చంద్రుడూ
పున్నమిని చేరుకొంటున్నాడు గదా ధీమాగా !

మాట్లాడకండి.....
మౌనంగా కాలం చెప్పే కబుర్లు వినండి
మనం గూడా కాల చక్రానికి
ఇరుసులై పోతాం !! ♦

# ఆధునిక తెలుగు సాహిత్యం - మానవతా విలువలు

- డా.జి.వెంకట రమణ
9000418264



సాహిత్యం సమాజానికి ప్రతిబింబం. సమాజంలోని మనుషులు, వారి జీవన విధానాలు, ఆలోచనలు, మనిషికి సంబంధించిన సమస్త విషయాలను గురించి సాహిత్యం చెబుతుంది. తెలుగు సాహిత్యాని అధ్యయన సౌలభ్యం కోసం ప్రాచీన సాహిత్యమనీ, ఆధునిక సాహిత్యమనీ రెండు రకాలుగా చెబుతాం. ప్రాచీన సాహిత్యంలో అన్ని ధర్మాలలో కెల్లా అహింస అనేది పరమ ధర్మమని చెప్పబడింది. అదే మన వాదంగా,నాదంగా నిలుస్తూవచ్చింది.

మనం నివసిస్తున్న సమాజంలో మన కళ్ళముందు అధర్మం జరుగుతుంటే దాన్ని ఆపటానికి ప్రయత్నం చెయ్యడం, స్నేహం పేరుతో మోసం చెయ్యకుండా, ఎదుటివారి జీవితాన్ని బలి చేయకుండా ఉండడం,పరస్త్రీని, అమ్మాయిలను కామంతో చూడకుండా సోదర భావంతో చూడటం, ఎదుటి మనిషి ఆపదల్లో, అవసరాల్లో, దుఖాల్లో, బాధల్లో ఉన్నప్పుడు సహాయపడటం, కష్టాల్లో ఉన్నవారికి తోడుగా ఉండటం , మనల్నే నమ్ముకుని బతుకుతున్న వారికి, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్లప్పుడూ అండగా ఉండటం, భర్తగా, భార్యగా, తల్లిగా, తండ్రిగా, అక్కగా, చెల్లిగా, అన్నగా, పౌరునిగా, పౌరురాలిగా తమ ధర్మాల్ని నిర్వర్తించటాన్నే 'మానవతావిలువలు' అంటాం.

నిరుపేదలకు, నిర్బలులకు, రోగులకు, అనాథలకు సహాయాన్నాశించేవారికి, ధైర్యం కోల్పోయిన భయభీతిపరులకు, ఆపదల్లో కొట్టుమిట్టాడేవారికి కాస్తంత ఊతాన్ని,ఊరటనీ, ధైర్యాన్ని స్థైర్యాన్నీ, ఆశను ఆశయాలనూ, ఆత్మానందాన్నీ ఆత్మవిశ్వాసాన్ని, కలిగించి, వ్యక్తిత్వ పరిమళాలనందించేదే 'మానవత్వం' అంటారు మన పెద్దలు.

ఆధునిక సాహిత్యంలో మానవుడే కేంద్రకం. మనిషి లేకపోతే ఏదీ లేదు. ఏమీ లేవు. అన్నీ, అంతా మనిషి కోసమే కదా. ఇలాంటి మనిషి ఆధునిక కాలంలో కనీస మానవ విలువలు అనేవి లేకుండా జీవిస్తున్నాడు. తన పొరుగు వాడొకడున్నాడన్న సంగతే మరచిపోతున్నాడు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మనిషికి కావాల్సింది కొన్ని మానవతా విలవలూనూ, నైతిక విలువలూనూ.వాటిని ఆధునిక సాహిత్యం అత్యద్భుతంగా చిత్రించింది, నిరూపించింది, చూపించింది.

కందుకూరి వీరేశ లింగం పంతులు ఆధునిక సాహిత్య వికాసానికి ఆద్యుడై, తన దేహాన్ని గేహాన్ని తెలుగు ప్రజల శ్రేయస్సు కోసం అంకితం చేసారు. తన రచనల ద్వారా సంఘాన్ని సంస్కరించే ప్రయత్నం చేసారు. ఆంధ్రుల సంస్కృతిని తెలిపే నవల 'రాజశేఖర చరిత్ర'లో పొగడ్తల వల్ల మనుషులు ఎంత నాశనం అవుతారో, మూఢనమ్మకాల వల్ల ఎంత పాడైపోతారో తెలిపారు.

మహాకవి గురజాడ అప్పారావు గారికి మనుషులంటే వల్లమాలిన ప్రేమ. నిజంగా అదే ఆయన మనిషితనం,అదే ఆయన మంచితనం కూడా.

*దేశమును ప్రేమించుమన్నా,*
*మంచియన్నది పెంచుమన్నా*
*'దేశమంటే మట్టి కాదోయ్*
*దేశమంటే మనుషులోయ్,*
*సొంత లాభం కొంతమానుకో,*
*పొరుగువారికి తోడుపడవోయ్'* అంటూ లోకానికి హితవు పలికారు.

మహాకవి శ్రీశ్రీ భిక్షు వర్షియసీ అనే కవితలో ఒక ముసలవ్వను గురించి వర్ణిస్తాడు. చదివిన ఎవరికైనా హృదయం ద్రవిస్తుంది. ఇది సత్యం.

*"దారి పక్క చెట్టు కింద,/ ఆరిన కుంపటి విధాన/ కూర్చున్నది ముసల్దొకతె/ మూలుగుతూ ముసురుతున్న / ఈగలతో వేగలేక ../ పడిపోయెను జబ్బు చేసి/ అడుక్కునే శక్తి లేదు./ రానున్నది చలి కాలం/ దిక్కులేని దీనురాలు"* ఇలాంటి మాటల్ని చదివితే ఎవరికైనా మనసు చలిస్తుంది. ఇదే కదా మానవత్వం అంటే. ఈనాడు కుడా అలంటి అవ్వలెందరో రోడ్డుపక్కన పడుంటారు. మన కళ్ళు తెరిచి చూడాలే కానీ ఇలాంటివి కోకొల్లలు మనకు కనపడతాయి.

దేవరకొండ బాలగంగాధర్ తిలక్ తెలుగు సాహిత్యంలో ఒక ధ్రువ తార. అతను చేపట్టని సాహితీ ప్రక్రియే లేదు. కథలు, గేయ నాటికలు ,కవితలు. ఇలా ఎన్నో ప్రక్రియలను చేపట్టిన 'కవితిలకం' వీరు. వీరు వ్రాసిన'అమృతం కురిసిన రాత్రి' కి తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. అతి చిన్న వయసులోనే వీరు మరణించారు. వీరు వ్రాసిన కథ 'నల్లజర్ల రోడ్' దాదాపుగా భారతీయ భాషలన్నింటిలోకీ అనువదించబడ్డది. వీరి 'అమృతం కురిసిన రాత్రి', వారి మరణానంతరం కేంద్ర సాహిత్య అకాడెమీ వారి పురస్కారంపొందింది. తిలక్ రాసిన ఆర్తగీతంలోని 'నేను చూసాను నిజంగా' అనే కవిత మన కంటబడితే కంట్లో నీల్లురాక మానవు. తనెంత, గొప్ప మానవతా వాదో,ఈ ఆర్తగీతంలో తెలుస్తుంది.

*"నేను చూశాను నిజంగా మూర్తిభవించిన దైన్యాన్ని, హైన్యాన్ని*
*క్షుభితాసృ కల్లోల నీరధుల్ని గచ్ఛత్ శవాకార వికారుల్ని*
*ఇది ఏనాగరికతకు ఫలశృతి ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి*
*ఏ బుద్ధ దేవుని జన్మభూమికి గర్వశృతి"*

ప్రార్థనా గీతంలో

*దేవుడా రక్షించు నా దేశాన్ని/ పవిత్రుల నుండి పతివ్రతల నుండి/ నీతులు రెండూ నాల్కలచాచి బుసలు కొట్టే /నిర్హేతుక కృపా సర్పాల నుండి/ లక్ష లాది దేవుల్ల నుండి వారివారి పూజారుల నుండి/ దేవుడా/ కత్తి వాదరకు తెగిన కంఠంలో హటాత్తుగా / ఆగిపోయిన సంగీతాన్ని వినిపించు/ మానవ చరిత్ర పుటలలో నెత్తురొలికి/ మాసిపోయిన అక్షరాలను వివరించు/ రహస్య సృష్టి సానువుల నుండి జారిపడే / కాంతి జలపాతాన్ని చూపించు"* అని దేవుణ్ణి ప్రార్థిస్తాడు

ఇలాంటి మధురమైన, మరపురాని కవితలెన్నో తిలక్ 'ఆమృతం కురిసిన రాత్రి' లో చూడవచ్చు.

తెలుగు లెంక కీ.శే. తుమ్మల సీతారామమూర్తి మనుషులు సూదిలా ఉండకూడదని,దారంలా ఉండాలని, సూదిపని రంధ్రాలు చేయడమే. కాని దారం ఆ రంధ్రాలన్నింటినీ కప్పుకొని వెళ్తుందని చౌదరిగారి ప్రబోధించారు.

మహాకవి జాషువా . ఈయన గొప్ప మానవతావాది. తనని తాను 'విశ్వ నరుడను నేను' అని చెప్పుకున్నాడు

*'తల్లిదండ్రి లేని బిడ్డల జూచి*
*కన్నీరు,దానంబు చేయు నేత్రములు నావి*
*కఠిన చిత్తుల దురాగతముల ఖండించి*
*కనికరమొలికించు కలము నాది'* అంటూ తన సానుభూతిని, తనకున్న మానవత్వాన్ని జాషువా తెలియజేశారు.

జాషువా రచనల్లో గబ్బిలం (1941) సర్వోత్తమమైనది. ఇది కాళిదాసు మేఘసందేశం తరహాలో సాగుతుంది. అయితే ఇందులో సందేశాన్ని పంపేది యక్షుడు కాదు. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును కాశీ విశ్వనాధునికి చేరవేయమని గబ్బిలంతో సందేశం పంపడమే దీని కథాంశం. ఎందుకంటే గుడిలోకి దళితునకు ప్రవేశం లేదుకాని గబ్బిలానికి అడ్డులేదు. కథానాయకుడి వేదనను వర్ణించిన తీరు హృదయాలను కలచివేస్తుంది.

1932లో వచ్చిన ఫిరదౌసి మరొక ప్రధాన రచన. పర్షియన్ చక్రవర్తి ఘజనీ మొహమ్మద్ ఆస్థానంలో ఉన్న కవి

కవిత

# తెలుగు వెలుగు

- ఆవుల చక్రపాణి యాదవ్
9963350973

*తేనెలొలుకు తీపి తెలుగు*
*అమ్మంటే తళుకుమంటు వెలుగు*
*సోయగాల తెలుగు జిలుగు*
*పల్లెటూరి పదములందు వెలుగు*

*పిల్లల ఆటల్లో తెలుగుంది*
*పొడుపు కథలుగా వెలిగింది*
*పెద్దల మాటల్లో నిగూఢమైంది*
*సామెతలుగా చమక్కుమంది*

*అలసట తీర్చేటి ఆనందం*
*జనులు మెచ్చేటి జానపదం*
*పదము పాడేటి యాసతనం*
*తెలుగు వెలిగేటి చక్కదనం*

*పల్లె పడచుల పేరంట పాట*
*గంగిరెద్దుల కథనాల ఆట*
*తోలుబొమ్మల్లో జుట్టు పోలి మాట*
*కోటలు దాటే పిట్టలదొర మాటలూట*

*పద్యమ్ము తెలుగుకు ప్రాణమ్ము*
*అదే అదే తెలుగుకు జీవమ్ము*
*పద్యమ్ము రాని వాడాంధ్రమ్ము*
*లేదు లేదు ఇది కడు సత్యమ్ము*

*నన్నయ్య సరిపేర్చిన తెలుగు*
*శివకవుల జానుతెలుగు వెలుగు*
*తిక్కన కలమందు వెలుగు జిలుగు*
*పోతన ప్రసరించె భక్తి భావ వెలుగు*

*శ్రీనాథుని శృంగారాల తెలుగు*
*రాయలవారింట మరింత వెలుగు*
*అన్నమయ్య పదాల సొబగు*
*త్యాగయ్య తమిళనాట వెలుగు*



*వేమన పద్యపు తెలుగు సొబగు*
*బ్రౌన్ శోధన కృషితో వెలుగు*
*గురజాడ వ్యవహారికపు తెలుగు*
*గిడుగు తీసుకొచ్చెను వెలుగు*
♦

ఫిర అతనికి రాజుగారు పద్యానికొక బంగారు నాణెం ఇస్తానని చెప్పగా ఆ కవి పది సంవత్సరాలు శ్రమించి మహాకావ్యాన్ని వ్రాస్తాడు  చివరకు అసూయాపరుల మాటలు విని రాజు తన మాట తప్పుతాడు.  ఆవేదనతో ఆత్మహత్య చేసుకొన్న ఆ కవి హృదయాన్ని జాషువా అద్భుతంగా వర్ణించాడు.

కరుణశ్రీ గా పేరు గాంచిన జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు ప్రేయసి మోజులో పడి మనుషుల సంగతి మర్చిపోయిన కృష్ణశాస్త్రికి మనుషుల గురించి గుర్తుచేస్తూ వారి సాధకబాధకాలను గురించి రాయమని సూచిస్తున్నాడు.

***"ప్రేయసి ప్రేమలోన కనిపించిన తీయని,***
***స్వర్గమొక్కటే ధ్యేయము కాదు,***
***హీనులు అతిదీనులు, మ్లానతనుల్,***
***దరిద్ర నారాయణులు ఏడ్చుచుండిరి,***
***వారి అశ్రువులను నీవు ఆమెతో సహా వెళ్లి***
***తుడిచి సహాయమొనరించినచో***
***నీకు కోట్లాది స్వర్గములు లభిస్తాయి"*** –కరుణశ్రీ

స్వామి వివేకానంద నా దేశంలో ఆకలి దప్పికలతో మనుషులే కాదు చివరికి జంతువులు కూడా బాధపడకూడదని, నిష్కామ బుద్ధితో బాధితులకు సేవ చేయడమే ఉత్కృష్ట మానవ ధర్మమని తెలిపారు. ఎవడు జీవనారాధకుడో, అతడే దైవారాధకుడన్నది అతని ప్రబోధం.

ప్రపంచ శాంతి  కాముకురాలు మదర్ థెరిస్సా 'ప్రార్థించే పెదవులుకన్నా, సహాయం చేసే చేతులు మిన్న'– చేతులకెంత మురికి అంటితే, అంత గౌరవంగా నే భావిస్తానని ఆచరించి, లోకానికి ఆదర్శంగా నిల్చారు. మహమ్మద్ ప్రవక్త 'ఈ లోకంలో మానవుడు ఇతరులకు చేసిన మేలే, అతనికి నిజమైన సంపదయ' ని ప్రబోధించాడు.

సాహిత్యం మనిషికి ఉత్తమ విలువల్నీ సంస్కార భావాలను నేర్పిస్తుంది. ఆధునిక తెలుగుసాహిత్యంలో వచ్చిన అనేక నవలలు, కథలు,నాటకాలు ,  కవిత్వం, హైకులు, నానీలు, నీనాలు,రెక్కలు మొదలైన ప్రక్రియలెన్నో సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. వాటిని చదివితే మనకు ఆధునిక సమాజ  జీవితంలోని అనేక సంక్లిష్టమైన భావాల్ని అర్థం చేసుకునే వీలుంటుంది. మనుషులు ఎందుకింత పతనమైపోతున్నారో తెలుస్తుంది. అన్ని ఉన్నా మాట్లాడే మనిషి లేక ఎంత ఒంటరితనాన్ని అనుభవించి, చివరికి ఎదో తెలియని అశాంతికి గురి అవుతున్నాడో మనకు అర్థమవుతుంది. కారణం ప్రొవిజన్స్  పెరిగాయి.పర్సనల్ రిలేషన్స్ దెబ్బతిన్నాయి. మానవతా విలువలూ దెబ్బ తిన్నాయి. ♦

# పర్యావరణాన్ని హత్తుకున్న తెలుగు కవిత్వం



- సుంకర గోపాలయ్య
9492638547

పర్యావరణం ఒక అద్భుతమైన మాట వినడానికే కాదు చూడటానికి కూడా. తల్లి గర్భం నుండి బయట పడ్డాక బతుకుంతా పర్యావరణ భిక్ష. ప్రపంచీకరణ వలలో మనిషి సులభంగా పడిపోయాక, క్రమంగా పర్యావరణంపై సమ్మెట పోట్లు మొదలయ్యాయి. అడవులు, నదులు, కొండలు, సరస్సులు అందరినీ అలరిస్తాయి. మనకు బ్రతుకునిస్తాయి. మనల్ని బతకనిస్తాయి. కానీ మానవుడి అత్యాశ మర్రి చెట్టు ఊడల్లా విస్తరించాక విధ్వంసం మొదలైంది. పత్రహరితం అపవిత్రం అయింది.

ఈ నేపథ్యంలో తెలుగు కవులు పర్యావరణ స్పృహతో స్పందించారు. నినదించారు. అన్నీ ప్రక్రియల్లో పర్యావరణ రక్షణ గురించి రచనలు వచ్చాయి. ఈ వ్యాసంలో నేను వచన కవితలకు మాత్రమే పరిమితం అవుతున్నాను. పర్యావరణాన్ని హత్తుకున్న తెలుగు కవితల సారాన్ని చర్చించుకుందాం.

“ఎడతెగని ప్రయాణం” కవితా సంపుటిలో యాకూబ్ ‘చెట్టు’ అనే పేరు మీద 7 చిన్న కవితలు రాశారు. అందులో భూమి కవి సంభాషణను క్లుప్తంగా కవిత్వీకరించారు. భూమి బాధను తెలుపుతారు.

*“ఇన్నాళ్లూ మనుషులు కాపాడతారని*
*భ్రమపడ్డాను*
*కానీ ఈ చెట్లే ఎప్పటికీ*
*నన్ను రక్షించేది అని*
*మరొకసారి తెలుసుకున్నాను”*

– యాకూబ్

ఈ కవితలో కవి భూమిని రక్షించేది చెట్ట మాత్రమే అని తీర్మానించారు.

ప్రముఖకవి “అరణ్య కృష్ణ” రచించిన “కవిత్వంలో ఉన్నంత సేపూ” అనే కవితా సంపుటిలో దాదాపు 10 కవితలు ‘పర్యావరణం’ కోసం రాసినవి ఉన్నాయి. అందులో ‘టెర్రరిస్ట్’ అనే కవితలో ‘పంచభూతాల్ని’ మనిషి ఎలా ధ్వంసం చేస్తున్నాడో తెలుపుతారు. భూమినడిగితే తన ఉమ్మనీరులో క్రిమి సంహారకాలు కూరిన దుర్మార్గ శాస్త్రవేత్తెవ్వడో, ఆకాశాన్ని అడిగితే ఓజోన్ వలువని ఊడబెరికిన సాంకేతిక దుశ్శాసనుడెవ్వడో, అడవినడిగితే చెట్లు నరికి భూసారాన్ని హత్య చేసే ఆర్థిక ఉగ్రవాది ఎవడో, తెలుపుతాయాంటు చెప్పి... వీటన్నింటికి మనిషే కారణమని నిర్ధారిస్తారు.

*“ చరిత్ర నడుగు చెబుతుంది*
*అభివృద్ధి కోసం వ్యాపారమైనా*
*ఆక్రమణ కోసం యుద్ధ విధ్వంసమైనా*
*ప్రకృతిని కొరుక్కుతినే చీడపురుగు మనిషేనని”*

ఈ కవితా సంపుటిలోనే “అనాగరికుడు” అనే కవితలో అరణ్యకృష్ణ మనిషి అనాగరికుడు, చెట్లు అంతరించిన రోజే మనిషి అంతరించిపోతాడు. అంటూ ఆవేదన చెందుతారు.

*“చెట్లుని నరకటం మంటే గాలిని హత్య చేయటం*
*మనిషి కంటిచూపులోంచి పచ్చదనాన్ని తుడిచేయటం*
*చెట్టుని కూల్చటం మంటే*
*రేపటి మన ఊపిర్లని మంట బెట్టుకోవటం*
*కూలిన ప్రతి చెట్టూ*
*నగరంలో మొలిచిన ఓ సమాధి*
*చచ్చిపోయిన ఒక్కో చెట్టు*

*వందల మనుషుల బతుకులకి సమానం*
*వేల పిట్టల కళేబరాలకి సమానం"* అంటూ
విధ్వంసాన్ని కళ్ళముందు ఉంచుతాడు.

ఇవాళ ప్లాస్టిక్ జీవితాల్లో భాగమైంది. ప్లాస్టిక్ లేని ఇల్లు, కార్యాలయము లేవు. కొన్ని రాష్ట్రాలు ప్లాస్టిక్ కవర్లకు నిషేదించిన లాభం లేకుండా పోయింది. ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంతో హనిచేస్తుంది. భూమిని రోగి చేస్తుంది. ఆయుష్షును హరింపజేస్తుంది. ఈ ప్లాస్టిక్ నష్టాల నేపథ్యంలో 'భగ్వాన్' అనే కవి రచించిన "విధ్వంసం కర్షనం" అనే కవితలో ప్లాస్టిక్ భూగోళాన్ని చప్పరిస్తుందని, భూమిలో పాతుకున్న ప్లాస్టిక్ భూకంపం కన్నా భయంకరమైనదని తెలుపుతారు.

*"మనిషి చేతిలో వేలాడుతున్న ప్లాస్టిక్ సంచీ*
*శవదహనానికి తీసుకుపోతున్న నిప్పుల కుండ*
*ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించి, నిషేదించో*
*తక్షణ కర్తవాన్ని తలెత్తు కోవాల్సింది కూడా మనిషే*
*ప్లాస్టిక్‌ను వాడి వాడి వాడి గుండె*
*ఓ ప్లాస్టిక్ సంచీగా మిగిలిపోతుందే మోననే నా భయం"*
అని హెచ్చరిస్తారు.

ప్రకృతిననుసరించి జీవితం సాగుతుంది. సకల ప్రాణికోటిలో మనిషి కూడా భాగవే. కానీ ఈనాడు పక్షులు, సీతాకోక చిలుకలు, భూమిలో రైతుతో పాటు శ్రమించే వానపాములు కరువైనాయి. ఆకాశం మీద పక్షులు రెక్కలు విప్పారకపోతే భూగోళం బోడిగుండులా మిగిలిపోతుందని కవులు ఆవేదన చెందుతున్నారు "పిట్టలేని లోకం" అనే దీర్ఘకవితలో ప్రభుగారి గమనింపును చూద్దాం

*"రెక్కల్లేని ఆకాశం*
*గడ్డ కట్టిన రక్తపు చారికలాగా*
*హఠాత్తుగా కల్లో కొస్తుంది*
*కళ్ళకొక పిచ్చుక కనబడదు*
*చెవుల కొక కోయిల వినబడదు.*
*మనిషి చుట్టూ డబ్బు గడ్డ కట్టి*
*అతడొక ఒంటరి శిలాజంలా మిగల్తాడు"*

పర్యావరణంలో పిచ్చుకల గల్లంతు గురించి "ఎస్.ఆర్.భల్లం"
స్పందించిన తీరు చూద్దాం.
"ఏ చెట్టు కొమ్మచూసినా
*పిచ్చుక గూళ్ల కాయల గుత్తులే*
*పిచ్చుక కదలికే కమనీయం అప్పుడు*
*కనపడ్డమే గగనం ఇప్పుడు*
*సెల్‌టవర్ల రేడియేషన్*
*పిచ్చుక పై బ్రహ్మాస్త్రం"* అని సెల్‌టవర్ల రేడియేషన్ కారణంగా మాయమౌతున్న పిచ్చుక గురించి కలవరించారు.

రోడ్డు విస్తరణ కొరకో, భవనాల నిర్మాణాల పేరనో చెట్లు మాయమౌతాయి. స్వచ్ఛమైన గాలి జాడలేదు. కాలుష్యం పండగచేసుకుంటోంది. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత కె. శివారెడ్డి రాసిన 'ఒకానొక వృక్షం' కవితను పరిశీలిద్దాం.

*ఇల్లు పెద్దది చేయటానికి*
*ఉన్న చెట్టు కొట్టేస్తున్నారు.*
*ఒక టార్చర్, పిచ్చి దుఃఖం*
*చెట్లతో నా సంబంధం*
*మనుషుల తోటి సంబంధం అంత గట్టిది*
*మానవుడు*
*చెట్టకు బదులు రాళ్లనీ*
*మనుషులకు బదులు వస్తువుల్ని ప్రేమిస్తున్నాడు.*
అని వస్తు వ్యామోహంలో పర్యావరణం ఎలా దెబ్బతింటుందో తెలుపుతాడు.

అద్దేపల్లి ప్రభు ఇటీవల 'పర్యావరణ ప్రయాణాలు' అంటూ ఓ చిన్న పుస్తకం వేశారు. అందులో పేల్చేసి, దొలిచేసి, తవ్వేసిన కొండల్ని, కొండలు చిమ్మిన నెత్తుర్ని, రియల్ ఎస్టేట్ సైన్యాల దాడికి బలైన భూమిని గురించి ఆక్రోశించారు.

"చెట్టు కొండా చరిత్ర లాంటివి
వాటిని మనిషిని కాపాడుకుంటే
అవి మనిషిని కాపాడతాయి
అతని కొక చరిత్రను నిర్మిస్తాయి" అని చక్కని ముగింపు ఇచ్చారు.

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత గుల్జార్ రచించిన పర్యావరణ కవితల్ని వారాల ఆనంద "ఆకుపచ్చ కవితలు"గా మన ముందుకు తెచ్చారు. ఇలా తెలుగు సాహిత్యంలో పర్యావరణ కవిత్వం ఇంకా విస్తృతంగా రావాలి. ప్రజల్లోకి వెళ్లాలి. పర్యావరణం పచ్చగా ఉండాలి. భూమి చల్లబడాలి. ఆకాశం దీవించాలి. మనుషులు పర్యావరణం పట్ల ప్రేమను పెంచుకోవాలి. రెండు చేతులు అడ్డుపెట్టి రక్షించుకోవాలి.

♦

విశ్లేషణ

# కాళికాంబా సప్తశతిలో గురుప్రశస్తి



- మందరపు హైమవతి
9441062732

బ్రహ్మంగారు అనగానే వెంటనే అందరికీ కాలజ్ఞానం గుర్తుకు వస్తుంది. ఆలోచించి చూస్తే ఆయనలో ఒక వేదాంతి, ఒక తత్వవేత్త, ఒక సంఘసంస్కర్త వున్నాడు. ముఖ్యంగా ఒక సామాజిక బాధ్యతగల కవి ఉన్నాడు కానీ ఆయనకు అపారంగా పేరు తెచ్చిపెట్టిన కాలజ్ఞానం మఱుగున ఆయనలోని కవిని గుర్తించటం లేదు.

కవుల్లో అనేక రకాల కవులు ఉన్నారు. ఊహాలోకంలో విహరించే భావకవులు, భగవంతుణ్ణి ఆరాధించే భక్త కవులు, సమాజంలోని అన్యాయాలపై, అక్రమాలపై స్పందించే కవులు ఎంతోమంది ఉన్నారు. వీరిలో చివరి మార్గానికి చెందినవారు అప్పుడూ, ఇప్పుడూ తక్కువే .అలాంటి వారిలో బ్రహ్మంగారు ఒకరు.

బ్రహ్మంగారు జన్మించిన 17వ శతాబ్దం మతకలహాలు, కుల విద్వేషాలతో సమాజం అట్టుడికిపోయిన కాలం. ఆనాటి సమాజాన్ని చూచి సహించలేక కలంపట్టి తన అక్షరాస్త్రాలను సంధించారు. "కాళికాంబా! హంస కాళికాంబ" అనే మకుటంతో ఏడు వందల పద్యాలు రచించి ఆనాటి సంఘంలో పాతుకుపోయిన కుల,మత ద్వేషాలు, మూఢాచారాలు, అసమానతల గురించి తీవ్ర నిరసనను వ్యక్తీకరించారు. ముఖ్యంగా ఈ సప్తశతిలో గురువుల గురించి చాలా పద్యాలు ఉన్నాయి. నిజాయితీగల గురువుల గురించి కపట గురువుల గురించి ఎన్నో పదునైన పద్యాలు రచించారు.

మామూలుగా గురువు అంటే పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడని అర్థం 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ " అని అన్నారు. తల్లిదండ్రులతోపాటు గురువును కూడ దేవునిగా గౌరవించారు.

"అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీల్య తం యేన తస్మైశ్రీ గురవేనమః "

అజ్ఞానమనే చీకటిని పోగొట్టి, జ్ఞాన నేత్రాలను తెరిపించే గురువుకి నమస్కారం అని గురువుకి మన సమాజంలో ఉన్నత స్థానమిచ్చారు. గురువు అంటే విద్యలు నేర్పేవాడనే అర్థం. కౌరవపాండవులకు ధనుర్విద్యాగురువు ద్రోణుడు. కృష్ణుని గురువు సాందీపని. ఆధునిక యుగంలో రాధాకృష్ణన్, అబ్దుల్‌కలాం ఆదర్శగురువులుగా పేరు పొందారు. మన ప్రభుత్వం వారు రాధాకృష్ణన్ పుట్టినరోజే గురుపూజాదినోత్సవం నిర్వహిస్తున్నారు.

కాని బ్రహ్మంగారి కాళికాంబా సప్తశతిలో గురువు అమిత జ్ఞాన సంపన్నుడు, అందరినీ సమానంగా చూచే సమదృష్టిగలవాడు, యుక్తాయుక్తవిచక్షణ గలవాడు, కులమత భేదాల్లేని సరికొత్త సమాజంకోసం కలలుకనే ఒకానొక స్వాప్నికుడు.

ఈ సప్తశతిలో మంచి గురువుల గురించి, దొంగ గురువుల గురించి ఎన్నో విభిన్నమైన పద్యాలున్నాయి. ఇవన్నీ మూఢనమ్మకాలపై, అసమానత్వంపై ఎక్కు పెట్టిన అస్త్రాలు,

సంఘం వీపుమీద చరచిన కొరడాదెబ్బలు, దొంగ గురువులపై మోగించిన రుంజనాదాలు. సంప్రదాయవాదుల గుండెల్లో గురిపెట్టబడిన తుపాకీ తూటాలు.

అరచేతిలో ఇమిడే సెల్‌ఫోనులో ప్రపంచాన్ని చూచే నేటి నెట్ యుగంలో కూడ ఫలానా ఉంగరం పెట్టుకొంటే ఉద్యోగం వస్తుందని, కోరుకొన్న అమ్మాయితో పెళ్ళి అవుతుందని ప్రచారాలు చేస్తున్నారు. దయ్యాల సినిమాలు, ఆత్మలు, ప్రేతాత్మల సినిమాలు వందరోజుల పండగలు చేసుకుంటున్నాయి.

ఇక దొంగ గురువులకు కరువులేదు. అనర్గళంగా, ఆధ్యాత్మిక విషయాలను ప్రవచించే స్వాములు భోగాలకు దాసులు. సర్వసంగ పరిత్యాగులు, సకల విషయాసక్తులు నిత్యానందస్వామిలీలలు, డేరాబాబా వైభవాలు, ఆశారాంగురు విలాసాలు మనందరికీ తెలిసినవే.

వీరందరు పైకి సన్యాసులు, కానీ జీవితంలో సకల భోగానుశక్తులు, పట్టుపంచెలు, పట్టెమంచాలు, విందుభోజనాలు, వేల ఎకరాల ఆశ్రమాలు, సొంత విమానాలు, ఆధ్యాత్మిక ప్రచారాల మాటున ఆడంబర జీవనాలు, మోక్ష సాధన ముసుగులో ముదితలతో కామక్రీడలు, ఇలాంటివాళ్ళు ఆనాడూ వున్నారు. అలాంటి దొంగ గురువుల గురించి

"ఉల్లిగడ్డలకును నుపదేశమిచ్చెడి/ కల్ల గురువు లెల్ల కడలదిరిగి /లల్లె గాండ్ర శిష్యులుగ చేసి కొందరు/ కాళికాంబ/ హంసకాళికాంబ" అని ఉల్లిపాయలక్కూడ ఉపదేశమిచ్చే దొంగగురవుల బండారాలపై మాటల చెర్నాకోలలు ఝళిపిస్తారు.

ఇలాంటి గురువుల గురించి పరము దిక్కటించు దిరుగుచనుండగా! కల్లగుల్ల గురుడు కాన వచ్చె/చుండు నెత్తిమీదనుండిన పేనుగా "చుండు పేనయినట్లు మంచిగురువు కోసం వెదుకుతుంటే మోసం చేసే గురువుదొరికాడని వ్యాఖ్యానిస్తారు.

"తనకు దారి తెలుప తన వెంట గురుడుండ/ కల్ల గురుల పైనకాంక్షలేల/కల్ల సత్యములకు నెలల గురుడుండె" ఆ దారి తెలియని తనకు దారి చూపించడానికి అసలైన గురువు వుండగా, ధనాన్ని సమయాన్ని వ్యర్థపరిచే దొంగ గురువెందుకు అని దొంగ గురువులపై తన తన ఆగ్రహాన్ని ప్రదర్శిస్తారు.

నిజమైన గురువుల గురించి, వారి గొప్ప తనాన్ని గురించి ఎన్నో పద్యాలున్నాయి ఈ సప్తశతిలో. "గురుడు చూపుగురుతు పరికించినంతనే। గబ్బుగీము వంటి మబ్బుతొలగు/ మబ్బు తొలగు నరుడు మహనీయుడై పోవు"

శిష్యునికి అసలైన గురువు దొరికితే అతనిలోని అజ్ఞాన మేఘాలు తొలగిపోతాయి. అప్పుడు మానవుడే మహనీయుడౌతాడు అని అంటాడు. బ్రహ్మంగారు ఎప్పుడూ దేవుడు గొప్పవాడని చెప్పలేదు. నారాయణుని కన్నా నరుడే గొప్ప వాడని చెప్పిన మానవతావాది.

మంచి గురువు ఎలా ఉండాలో, అతని లక్షణాలేమిటో నూటిగా ఇలా అంటాడు. ''విద్య విశ్వమందు వివరింపకుండెనా/ గురుని గురుతకుప్ప కూలిపోవు/ బుద్ధిగలుగు గురుడె పూర్ణస్వరూపుడా'' గురువుకి శిష్యులనందరినీ సమానంగా చూడగలిగే బుద్ధి వుండాలి. తనకు తెలిసిన విద్యను శిష్యునికి అర్థమయేటట్లు, అరటిపండు ఒలిచి చేతిలో పెట్టాలి. అలా చెప్పకపోయినట్లైతే గురువుకు గొప్పతనం ఉండదు అని అంటారు.

కౌరవ పాండవుల ధనుర్విద్యాగురువు ద్రోణాచార్యుడు. తనకు తెలిసిన విద్యారహస్యాలన్నీ అర్జునుడికి చెప్తాడు. ఎఱుకల వాడన్న కారణంగా ఏకలవ్యునికి విలువిద్య నేర్పలేదు. పైగా తను స్వయంగా అతనికి విద్య నేర్పకపోయినా తన విగ్రహం పెట్టి విలువిద్య నేర్చుకున్నందుకు బొటనవేలును గురుదక్షిణగా అడుగుతాడు. విలువిద్యలో అర్జునుడికి ఎవరూ ఎదురు లేకుండా చేస్తాడు. అందుకే అతడు ఎంత విలువిద్యావిశారదుడైనప్పటికీ చరిత్రపుటల్లో ఆయనపై ఆ కళంకం ఇప్పటికీ చెరిగిపోలేదు.

బ్రహ్మం గారు కేవలం ఆధ్యాత్మిక వేత్తకాదు. ముక్కుమూసికొని ' ఈ ప్రపంచం ఏమైపోతే నాకేం' అని అడవుల్లోకి వెళ్ళి తపస్సు చేసికోలేదు. సంఘంలో ఒక సభ్యునిగా జీవించాడు. సమస్యలను పట్టించుకొన్నాడు. తీవ్రమైన కులభేదాల గురించి

"కులము మతము వాదములు తర్కమునబోవు గ్రురు కటాక్షమున్న నెఱుకపోవు'' గురువు దయ ఉన్నట్లైతే కులమతభేదాలు తొలగిపోతాయి అని అంటారు. హిందూ సమాజంలో కులాల మధ్య కలహాలు, మతాల మారణహోమాలు ఎక్కువ. హిందూ ముస్లిం వైషమ్యాలే కావు. శైవవైష్ణవుల మధ్య ఘోర యుద్ధాలు జరిగాయి. రక్తం ఏరులై పారింది. మా మతం గొప్పదంటే మా మతం గొప్పదని పరస్పరం కలహించారు. అన్నదమ్ముల్లా మెలగాల్సిన వారు శత్రువుల్లా ప్రతిపక్షాల్లా మారిపోయారు. హింస చెలరేగింది. అహింసా హంసగుండెల్లో

గురిచూసి తుపాకీ తుటాలు పేల్చారు. ఈ హింసకు మనసు వికలమైన బ్రహ్మంగారు 'అల్పాక్షరముల అనల్పార్ధరచన' అన్నట్లు చిన్న చిన్న మాటల్లో గొప్ప భావాన్ని విప్పి చెప్పారు. 'వదలవలయు జాతివర్ణవ్యవస్థలు / పట్టుదలయు గురుని పాదయుగము/" మంచి గురువును ఆశ్రయిస్తే జాతుల మధ్య అంతరాలు, కులాల మధ్య అంతరాలు తొలగిపోతాయని అంటారు. ఈ దేశంలో కులవ్యవస్థ మఱ్ఱిచెట్టులా ఊడలు దిగి పాతుకుపోయింది. వటవృక్షం కన్నా బలమైనది వర్ణవ్యవస్థ. "ఈ దేశం ఎప్పుడైనా ధనిక దేశం కావచ్చు / నాస్తిక దేశం కావచ్చు / కానీ కులంలేని దేశం మాత్రం కాబోదు /" అని మందరపు హైమవతి ఒక కవితలో అన్నట్లు ఈ దేశంలో కులాహంకారం ఎన్ని తరాలు గడిచినా నశించదు. పూర్వం అంటరానితనం జాడ్యం వుందంటే నేటి అణుయుగం ఆధునిక యుగంలోనూ ఈ కులభేదం నశించలేదు. చుండూరు, కారంచేడు, లక్షింపేట, ప్యాపిలి, వేంపెంట మొ॥ చోట్ల దళితులపై తీవ్రదాడులు చేసారు. మానవత్వానికే మాయని మచ్చ తెచ్చారు.

కులమతాల భేదంతో తల్లడిల్లితే సమాజాన్ని గురించి కులమతాల జాడ్యములోన దపియించు / దీనజనుల సేదదీర్చువాడ/ మానవుండె ధరను మాధవుండనువాడు" అని అంటారు. కులమతాల జబ్బులతో బాధపడే ప్రజలను సేదదీర్చే మానవుడే మాధవుడనే సత్యాన్ని చెప్తారు.

మంచిగురువు ఎలాంటివాడో చాలా పద్యాల్లో వివరించారు బ్రహ్మంగారు. ఈ లోకంలో నిజమైన గురువులు చాలా తక్కువ. నిజమైన గురువు శిష్యరికంలో శిష్యుడు రాణిస్తాడు. దానికి ఉదాహరణగా చాలామంది గురుశిష్యులు ఉన్నారు. బ్రహ్మంగారు, సిద్దయ్య అలాంటివారే. పరుసవేది వలన బంగారమగు నిన్ను / గురుని వలన శిష్యవరుడు వెలుగు/ మంచి సాహచర్యమెంచి చూచుట మేలు" పరుసవేది బంగారమైనట్లు మంచి గురువువలన మంచి శిష్యుడు రూపొందుతాడని అంటారు. మంచిశిష్యులు, మంచిగురువులు కలసి మంచి సమాజాన్ని రూపొందిచగలరని, అప్పుడు సంఘంలో సుఖం, శాంతి ఉంటాయని అంటారు. "గురుశిష్యులెల్ల పరిపాలననాపరుల్/పారమార్థికులగ ప్రబలిరేని/సంఘమందు సుఖము శాంతి వర్థిల్లును" అని సమాజం హాయిగా వుండాలంటే గురువులు, శిష్యులు, పాలకులు సంఘం పట్ల బాధ్యతగా మెలిగితే ఒక నవ సమాజం ఏర్పడుతుందని అంటారు.

బ్రహ్మంగారు కేవలం ఒక ఆధ్యాత్మిక వేత్తగాదు. ఛాందస భావాలు లేని ఒక అభ్యుదయవాది. జనక మహారాజులా రాజర్షి తానొక స్వామినని అహంకరించలేదు. సమాజంలో జీవిస్తూ, సమాజంలోని సమస్యలను అవగతం చేసుకొని, అన్యాయాలను ధిక్కరించాడు. చిన్నప్పుడు కాలజ్ఞానం రాసేటప్పుడు అచ్చమ్మగారి ఆవుల్ని కాస్తూ కష్టపడి జీవించారు.

కాలజ్ఞానంలో వున్న విషయాలను, నవాబుకి, గరీబుకీ అందరికీ సమానంగా పంచిపెట్టాడు. అందరూ సమానమేనని చాటి చెప్పారు. సిద్ధయ్యను శిష్యునిగా స్వీకరించి తన కొడుకులతో సమానంగా చూసాడు. తనకు తెలిసిన విద్య తనకే సొంతం అనుకోలేదు. అందరికీ అన్నీ తెలియాలి అనుకొన్నాడు. మూఢవిశ్వాసాలను ఖండించాడు. ఆడంబర వేషధారణను, కులమత ఛాందస మూఢ విశ్వాసాలను ఖండించాడు. ఆడంబర వేషధారణను, కులమతఛాందస భావాలకు వ్యతిరేకంగా ఎన్నో పద్యబాణాలను గురిచూసి గుండెల్లో గుచ్చాడు.

వైష్ణవులు భుజాలపై శంఖుచక్రాల ముద్రలు వేసికొంటారు. ముద్రలు వేసుకొని భుజాలు కాల్చుకొన్నంత మాత్రాన మనసు మారదుకదా! బుద్ధిమార్చేవాడే పరిపూర్ణమైన గురువని "మాకు మీకు గురుడు మాధవుడే కదా! నిడిది అడ్డబొట్టు నిందయేమి! మతము కల్పితమ్ము మార్గమొక్కటెకదా" పువ్వులు వేరైనా పరిమిళమొక్కటే. రాముడన్నా, అల్లా అన్నా, క్రీస్తు అన్నా ఒకటై "అబద్ధాలాడవద్దు నిజంచెప్పు, దొంగతనం చేయగూడదు, పరస్త్రీలను కన్నతల్లుల్లా చూడమని అని మతాలన్నీ ముక్తకంఠంతో ఘోషిస్తున్నా, ఈ నిలువుబొట్లు, అడ్డబొట్లు ఎందుకు అని అంటారు. వేరు వేరు మతాలైన హిందూ, మహమ్మదీయ ద్వేషాలే కాదు. హిందూ మతంలోనే శైవుల మధ్య వైష్ణవుల మధ్య విరోధం. వీరశైవులు శివుడికంటె గొప్పదేవుడు లేడని, వీరవైష్ణవులు, విష్ణుమూర్తికంటే గొప్పదేవుడు లేడని వాగ్వివాదాలు, మధ్యయుగంలో వీరిద్దరి మధ్య జరిగిన యుద్ధాల్లో రక్తం ఏరులైపారింది.

ఇంకా ఆనాడు విగ్రహారాధన విపరీతం. తోటి మనిషి కష్టాల్లో వుంటే సాయంచేయకపోయినా దేవుడి గుడికి వెళ్ళి కొబ్బరికాయలు కొట్టి హుండీలో డబ్బులు వేస్తాడు. గుడిబయట ఆకలిగొన్న బిచ్చగానికి పైసా వేయడు. ఈ విగ్రహారాధనను ఖండిస్తూ" మనసు పొరలనీక/మాయలబడబోక/చిలిపిరాళ్ళ పూజచేయబోక / గురుని పూజ చేయపరమ లాభమ్మగు/" మనసును నిగ్రహించుకొని, మాయలో పడకుండా,

విగ్రహారాధన చేయకుండా, మంచిగురువును గౌరవిస్తే మంచిది అంటారు. ఇక్కడ విగ్రహారాధన అని సంస్కృతపదం వాడకుండా, అచ్చతెలుగు మాట చిలిపి రాళ్ళపూజ' అని ప్రయోగిస్తారు. అందరూ దేవుళ్ళుగా భావించే విగ్రహాలను రాళ్ళు అంటారు. ఇంతటితో ఆయన ఆగ్రహం ఉపశమించలేదు. చిలిపి రాళ్ళపూజ' అని చురకత్తిలాంటి వ్యంగ్యాస్త్రాన్ని ఉపయోగించారు.

మనిషి కష్టపడి పనిచేసి ఫలితాన్ని పొందకుండా, ప్రాణంలేని విగ్రహాలను పూజిస్తారెందుకు, మతం, సమాజం ఎందుకిలాంటి భావాల్ని ప్రోత్సహిస్తున్నాయి? ప్రతి సంవత్సరం శ్రీరామనవమికి రాముడి పెళ్ళి అంటూ ఎంతో డబ్బు ఖర్చు పెడతారు పాలకులు, ప్రజలూ కానీ ఆ డబ్బుపెడితే పేదవాళ్ళు పిల్లలకు పదిమందికి పెళ్ళిళ్ళు చేయవచ్చును. అభిషేకాల పేరిట దేవుడికి పాలతో, తేనెతో, పెరుగుతో అభిషేకాలు చేస్తూ ఎంతో ధనవ్యయం చేస్తుంటారు. గుక్కెడు పాలు లేక గొంతుతడారిపోయి మరణించిన బీదపిల్లలు ఎందరో వీటన్నిటినీ చూసి చలించిన బ్రహ్మంగారు తన తీవ్ర విమర్శనాస్త్రాలను సంధించారు. "వన్నెలైదుగల్లు ప్రతిమలకై గుళ్ళు గోపురాలు కూడుగుడ్డలిచ్చి /ప్రాణమున్నవారి పట్టించుకోరేమి" ప్రాణంలేని విగ్రహాలకు గుళ్ళుకట్టి పట్టుబట్టలు కట్టి, నైవేద్యాలు పెట్టి ప్రాణమున్న మనుషుల కష్టాలు పట్టించుకోరేమిటి అని విగ్రహారాధకులు ఉలిక్కిపడేలా ముక్కుసూటిగా ప్రశ్నిస్తారు.

ఈ సందర్భంలో ఇలాంటి పద్యం లాటిదే జాషువా పద్యం ఒకటి

*"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలువేలు*
*వ్యయించుగాని దుః*
*ఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్*
*మెతుకు విదల్పదీ భరతమేదిని ముప్పది మూడుకోట్లదే*
*వతలెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులాఋనే "*

గుర్తుకు వస్తుంది.

జాషువా 20 దశాబ్దపు కవి.జాషువాకంటే 5,6 శతాబ్ధాలకు ముందే ఇలాంటి పద్యం రాసాడంటే బ్రహ్మంగారెంతటి అభ్యుదయవాదో ఎంత ఆలోచనాశీలో తెలుస్తుంది. ఉన్నాడో, లేదో అనే సంశయాత్ముడైన దేవుణ్ణి పూజించకుండా కష్టపడి పనిచేయమంటాడు. సకల సద్గుణ సంపన్నుడైన గురువుని గౌరవించమంటాడు. గురువుకి సేవ చేయమంటాడు. అతణ్ణే నమ్మమంటాడు. గురువుగూడ శిష్యునికి కలిగే అనుమాలను తీర్చగలని అంటాడు. *"శిష్యునకును బోధ చేసెడి గురుమూర్తి / సంశయములనెల్ల సమయజేయ / తత్వమెరిగి యతడు ధన్యోస్మియనవలె"* గురువు నిత్య విద్యార్థి, నిరంతరం అతడు జ్ఞాన సముపార్జన చేస్తుంటేనే శిష్యుని అనుమానాలు తీర్చగలడు. శిష్యుని సందేహాలు తీర్చినపుడే గదా అతనిలో జ్ఞానదీపం వెలుగుతుంది.

గురువు గొప్పదనాన్ని తెలిపే ఎన్నో పద్యాలు ఈ కాళికాంబా సప్తశతిలో వున్నాయి. *"చెట్టు పుట్టలకు చెయ్యెత్తి మ్రొక్కుచు / వట్టి మాటలిట్లు వదరనేల / దిట్టమైన గురుడు దేదీప్యమైయుండు"* అన్ని విషయాలు తెలిసిన అసలైన గురువుండగా చెట్లకు పుట్లకు నమస్కారం చెయ్యడమెందుకు అని అంటారు. మనదేశంలో రావిచెట్టుకు, వేపచెట్టుకు పెళ్లి చేస్తారు. నాగులచవితినాడు పుట్టలో పాలుపోసి ప్రదక్షిణలు చేస్తారు. ఇవన్నీ ఎందుకు మీలోని అజ్ఞానాన్ని పోగొట్టే గురువుండగా అని బ్రహ్మంగారు అంటారు.

సందర్భం వచ్చినప్పుడల్లా మనుషుల్లో నాటుకుపోయిన కులమతాల జాడ్యం గురించి, మూఢవిశ్వాసాల గురించీ తన కలంకత్తిని ఝుళిపించారు. ఇది ఇరవై ఒకటో శతాబ్దం. అత్యంత ఆధునికకాలం. ఐనా మానవులు మాత్రం ఆదిమయుగానికి వారసులు. సాంకేతికంగా అత్యంత అధునాతన పరికరాలు కనిపెట్టారు. కానీ మానసికంగా కులమతాల రొచ్చుగుంటలో దొర్లే వరహాలు. సమస్త ప్రపంచాన్ని అరచేతిలో చూస్తే సాధనాలు కనిపెట్టాడు. అంతరిక్షం యానం చేస్తూన్నాడు గానీ సంకుచితమైన జాతుల, కులాల నాలుగ్గోడల మధ్య ఊపిరాడకుండా నలిగి పోతున్నాడు.

విస్మరించాల్సిన కులం, మతం, జాతి విశ్వరూపం దాలుస్తున్నాయి. పేర్ల చివర కులాల ముద్రలు. కుల సంఘాలు, మతసంఘాలు, జాతుల సమూహాలు ఎవరికి వారే ఒక గుంపుకు పరిమితమై భావాలు వెర్రితలలు వేస్తూన్నాయి. ప్రతి ఒక్కరు ఆలోచనా నేత్రాల్ని మూసివేసి అంధులై నడుస్తున్నారు. సమాజాన్ని చీకటిలో ముంచేస్తున్నారు.

వైజ్ఞానిక యుగంలోనూ గ్రహణం పట్టినప్పుడు, పట్టువిడుపుల స్నానాలు చేసే సైన్సు టీచర్లు, ఇళ్ళు కడిగే విద్యావంతుల్ని చూసినపుడు ముందుకు నడవాల్సిన సమాజం వెనక్కి వెళ్ళడానికి పోటీ పడుతుందేమిటి అని బాధ కలుగుతుంది.

పరీక్షలకు ముందు హాల్ టిక్కట్లు దేవుడి ముందుపెట్టి పూజచేసే విద్యార్థులు, ఉపగ్రహ ప్రయోగానికి ముందు

దేవుడిగుళ్ళో పూజలు చేసే శాస్త్రవేత్తలు, ఫ్రిజ్‌లు కూలర్లు కొన్నపుడు కుంకుమబొట్లు పెట్టి, పసుపురాసి కొబ్బరికాయలు కొడుతున్న విద్యాధికులు, కొత్త వాహనాలు కొన్నప్పుడు గుళ్ళో పూజలు చేయించే భక్తులను చూచినపుడు మన చదువు కేవలం డిగ్రీలకు మాత్రమే పరిమితమా అని ఆవేదన గలుగుతుంది.

దసరా వస్తే ఎర్రబట్టలతో భవానీలు, కార్తీకమాసంలో నల్లని బట్టల అయ్యప్పలు వీధుల్ని భక్తిరసప్రవాహంతో ముంచెత్తుతారు. ఆ సందర్భంలో వాళ్ళను పిలిచే ప్రత్యేకమైన పిలుపులు. విద్యార్థులు కూడ అదే బట్టలతో పాఠశాలకు వెళ్ళడం ఇవన్నీ చూసినపుడు 16,17వ శతాబ్దంలో బ్రహ్మంగారు అభ్యుదయ భావాలతో రాసిన ***"వదలవలయు జాతి వర్ణవ్యవస్థలు / పట్టవలయు గురుని పాదయుగము/"*** పద్యాలను చదివినపుడు ఆయనలో కులమతాల కతీతంగా ఆలోచించే మానవతా వాదం మన మనసులను తాకుతుంది.

కులమత భేదాలతో కొట్టుకొంటున్న సమాజాన్ని మార్చగలవాడు సద్గురువుకే ఉంది అంటారు. ఈ సప్తశతిలో "గురుని బోధ వినక కోట జన్మములెత్తి / ఎంత చదువతత్వ మెఱుకపడదు. గురువు చెప్పింది సరిగ్గా వినకపోతే ఎన్ని జన్మలెత్తినా ఆ బోధనలు అర్థంకావు అని నగ్న సత్యాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

ఆధునిక విద్యా విధానంలో ఆడియో వీడియోలు, డిజిటల్ పద్ధతులు ఎన్నో వచ్చాయి. గైడ్‌లు, క్వశ్చన్ బ్యాంకులు ఎన్నో ఉన్నాయి. ఎన్ని ఉన్నా గురువు చెప్పినపుడు వింటేనే ఎంత జటిలమైన విషయాలైనా అర్థమౌతాయి.

ఇలాంటి గురువుదగ్గర శిష్యుడెలా వుండాలో ఈ పద్యంలో వివరిస్తారు. గురుని సేవ శిష్యపరమాణు దొనరుప / చెలగి గురుని యంత శిష్యుడగును / గురుడశిష్యుడన్న గురుతు శూన్యమౌను॥ గురువుకి శిష్యుడు త్రికరణ శుద్ధిగా సేవచేస్తే గురువుగారంత గొప్పవాడవుతాడు. పూర్వం గురుకులాలుండేవి. రాజకుమారుడైనా గురువుదగ్గరకు వెళ్ళి చదువుకొనేవాడు. గురువుకి సేవ చేసి మెప్పించేవాడు. దానికి గురువు కటాక్షించి తన విద్యలన్నీ నేర్పేవాడు. కచుడు శుక్రమహర్షి దగ్గర అలాగే చదువుకొని మృతసంజీవనీ విద్య సంపాదించాడు. ఉదంకుడు గురుపత్ని కుండలాల కోసం పాతాళ లోకానికి వెళ్ళి తెచ్చి గురువుకి ఇస్తాడు.

ఈ సప్తశతిని చదువుతుంటే బ్రహ్మంగారు కేవలం ఆధ్యాత్మిక విషయాలకే పరిమితమైన వారుకాదని, సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను నిశితంగా పరిశీలించడమేకాక వాటిమీద తన ఆధునిక భావాల ఆయుధాలను ప్రయోగించాడని అర్థమౌతుంది.

ఏకాలమందైనా ప్రజలు సుఖంగా జీవించాలంటే మంచిరాజులుండాలి కానీ అలాంటి రాజులు ఎప్పుడూ తక్కువే. అందరూ భోగలాలసులు. స్వార్థపరులు, అధికారమదాంధకారులు, అలాటివారిని గురించి "నాల్గుయుగములందు న్యాయమ్ముగా జూడ / నెన్నదగిన రాజులెవరు గలరు/ అని నాలుగు యుగాల్లో న్యాయంగా పాలించిన రాజులేదని ఉన్నమాట చెప్పారు. ఇక్కడ అలాంటి రాజులు లేరంటే ప్రజలు ఎన్నో బాధలు పడ్డారని ఆ బ్రహ్మంగారి భావన. ఎలాంటి కష్టాలు లేకుండా ప్రజలు సంతోషంగా ఉండాలని ఆయన కోరిక.

ఈ సప్తశతిలోని పద్యాలు చదివాక ఒక కొత్త సమాజం కోసం ఆయన పడిన తపన ప్రతి అక్షరంలోను కనబడుతుంది. మూఢనమ్మకాలను వ్యతిరేకించడానికి ఆయన పడిన తపన ప్రతి అక్షరంలోను కనబడుతుంది. మూఢనమ్మకాలు, కుల, మత బేధాలు లేని సమ సమాజంకోసం ఆయన పడిన ఆరాటం, ఆవేదన ఎంత తీవ్రమైనదో అర్థమౌతుంది. న్యాయమైన పరిపాలన కోసం ఆయన కలవరించారు. ప్రజల పక్షాన నిలిచే పాలకుల కోసం కలలు కన్నారు. ప్రజలు మూఢవిశ్వాసాల ఊబిలో దిగకుండా, హేతుబద్ధంగా ఆలోచించి, అభ్యుదయ పరంగా, ముందుకు నడవాలని, కులమతాల వైషమ్యాలకు లోనుకాకుండా పరస్పరం మానవతా పరిమళాల విరిమాలలను అందించుకోవాలని, ఆలోచనాలోచనలు తెర్చి అభ్యుదయ పథంలో ఆనంద రహదారులలో పయనించాలని ఆయన కోరిక ఎన్నో శతాబ్దాలకిందటే బ్రహ్మంగారు ఇంతటి అభ్యుదయభావాలతో ఇలాంటి పద్యాలు రాసినందుకు ఎంతో ఆశ్చర్యం కలుగుంది. ఆయన రాసిన ఇంతకాలానికి పరిస్థితులు మారనందుకు సిగ్గుతో తలవంచక తప్పడంలేదు.

కాళికాంబా సప్తశతిలో బ్రహ్మంగారు చెప్పిన కులమత భేదాల్లేని సమాజం కోసం ఎదురు చూద్దాం. సకల ప్రజల సుఖం కోసం, అభ్యుదయం కోసం పాటుపడే గురువులు ఈ సంఘంలో గౌరవింపబడాలని, అలాంటి రోజుకోసం మనమంతా ఎదురుచూద్దాం. ♦

# కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు







కేంద్ర సాహిత్య అకాడమీ 2019 సంవత్సరానికి గాను బాల సాహిత్య పురస్కారాన్ని, యువ పురస్కారాన్ని జూన్ 14న ప్రకటించింది. తెలుగులో 'తాత మాట వరాల మూట' కథల సంపుటికి గాను ఈ పుస్తక రచయిత బెలగాం భీమేశ్వరరావుకు 2019 బాల సాహిత్య పురస్కారం వచ్చింది. ఈ పురస్కార ఎంపికలో ప్రముఖ రచయితలు దాసరి వెంకటరమణ, దీర్ఘాసి విజయభాస్కర్, దర్భశయనం శ్రీనివాసాచారిలు జ్యూరీ మెంబర్స్‌గా వ్యవహరించారు. బెలగాం భీమేశ్వరరావు గారిది విజయనగరం జిల్లా పార్వతీపురం. ఉపాధ్యాయులుగా పనిచేశారు. 'వజ్రాల గుహ'ను 'స్వతంత్ర భారతం', 'పనసపళ్లు' గేయాలు, 'తేనె చినుకు' ''చుక్‌చుక్ రైలు', 'కొంగల తెలివి' 'ఎగురలేని పక్షులు', 'మంచికి మంచి', 'పాపం బంగారయ్య', 'తీరిన అనుమానం', 'లేగదూడ సంరక్షణ', 'వృక్షపురాణం' మొదలైన బాలల కథలు, గేయాలు, గేయ కథలు రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ సాహిత్య పురస్కారాన్ని తెలుగులో 2019 కి 'కొంగవాలు కత్తి' నవలకు గాను గడ్డం మోహన రావుకు లభించింది. ఈ పురస్కార ఎంపికకు ప్రముఖ రచయితలు జూకంటి జగన్నాథం, డా॥ సి. మృణాళిని, రావికంటి వసునందన్‌లు జ్యూరీ మెంబర్స్‌గా వ్యవహరించారు. 'కొంగవాలు కత్తి' రచయిత గడ్డం మోహన్‌రావు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారాం మండలం ఆజీపూర్ గ్రామానికి చెందినవారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీలో పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చిందుల ఎల్లమ్మ, చిందుల హంస, రేణుకా ఎల్లమ్మ కథ (మచ్చయ్య దాసు విరచితం) నేను చిందేస్తే, చిందు జాంబవ పురాణం , కడియం డేవిడ్‌తో కలిసి 'అతడు అబ్రహాం' నవల తదితర పుస్తకాలు రాశారు. ♦

## పసిపాపను నేను

**- కమ్మరి శ్రీనివాస్ చారి**
**9177324124**

*నవమాసాలు అమ్మ కడుపులో*
*రక్తమాంసాల మధ్య పరిచయం*
*లేని ఒంటరి జీవితాన్ని గడిపిన పసిపాపను నేను*
*కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టి*
*నవమాసాల పాలబుగ్గ వయసులో*
*పాపాత్ముడి చేతిలో బలైన పసిపాపను నేను*



*పరాయివాడైనా పాపాయిలా నన్ను నవ్విస్తాడనుకున్నాను*
*కాని కామంతో*
*కాటేస్తాడని కలలో ఊహించని పసిపాపని నేను*
*అమ్మఒడికి దూరమై ఆడి పాడే*
*వయసులో అందమైన ప్రపంచం*
*నుండి నేడు అదృశ్యమైన పసిపాపను నేను*

*కామంతో కళ్లు మూసుకుపోయి*
*సిగ్గులేని సభ్యసమాజంలో తలదించి*
*తనువును చాలించిన పసిపాపను నేను*

*ఏ ఘడియలో నిద్ర లేచానో కాని*
*మలి ఘడియ రాకముందే కానరాని*
*లోకానికి చేరుకున్న కన్నీటి పసిపాపను నేను*

*పాలబుగ్గల నా పసి బాల్యం*
*తల్లిదండ్రుల సాక్షిగా కామాంధుడి*
*చేతిలో స్మశానానికి దగ్గరైన పసిపాపను నేను*
♦

# బాల సాహిత్యం



**- కొడవటిగంటి కుటుంబరావు**

మనదేశంలో బాలసాహిత్యమంటూ ఇప్పుడిప్పుడే వస్తున్నది. బెంగాలీ, హిందీ మొదలైన భాషలలో రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం కూడా బాల పత్రికలుండినట్టు తెలుస్తుంది. తెలుగులో మాత్రం బాలపత్రికలు స్వాతంత్ర్యం వచ్చే రోజులలోనే బయలుదేరాయి.

నా చిన్నతనంలో బాలసాహిత్యమంటూ వేరే లేదు. నాకు చదవటమూ, రాయటమూ రాగానే సుమతీ శతకం కంఠస్తం చెయ్యమన్నారు. వావిల కొలను వారు రచించిన పాకెట్‌సైజు కథల పుస్తకాలేవో ఉండేవి. భాగవతం నుంచి కుచేలోపాఖ్యానం, రుక్మిణీ కళ్యాణం, ప్రహ్లాద చరిత్ర, గజేంద్రమోక్షం లాంటి కథలు చదివాను. వాటిలోని కొన్ని పద్యాలు నాకిప్పటికింకా జ్ఞాపకం ఉన్నాయి.

అర్ధ శతాబ్దం క్రితం ఇదే బాలసాహిత్యం. నిజానికిది పిల్లలకోసం ప్రత్యేకించి రాసిన సాహిత్యం కాదు. పెద్దల సాహిత్యమే. పెద్దల సాహిత్యంలో పిల్లలకు పనికి వచ్చేదంతా పిల్లల సాహిత్యంగా చలామణీ కావటం మన సంప్రదాయం. ఈ కారణంచేతనే మనం ఈ రోజు బాలసాహిత్యం గురించి పాశ్చాత్యుల అభిప్రాయాలు అరువు తెచ్చుకొని లాభం లేదు.

ఇంచు మించు ఇరవై ఏళ్లుగా బాలసాహిత్యంలో నాకు గల సంబంధాన్ని బట్టి బాలసాహిత్యం ఎలా ఉండాలి. ఎలా ఉండకూడదు అన్న అభిప్రాయాలు కొన్ని ఏర్పరుచుకున్నాను. కొంతకాలమయాక వీటికి కాలదోషం పట్టవచ్చు. ప్రస్తుతానికి ఈ నా అభిప్రాయాలు సముచితమయినవని భావించి వాటిని ఇక్కడ చెబుతున్నాను.

పశుపక్ష్యాదులు పాత్రలుగాగల నీతికథలూ; దేవతలూ, రాక్షసులూ, మాంత్రికులూ, అతీతశక్తులూ మొదలైన వాటితో కూడిన దేవతా కథలూ (ఫెయిరీ టేల్స్); గడిచిపోయిన యుగాలకూ, సమాజానికీ సంబంధించిన జానపద కథలూ బాల సాహిత్యంలో ప్రముఖస్థానం కలిగి ఉంటాయి.

**వాస్తవికత**

పైన చెప్పిన కథలలో వాస్తవికతలకు చోటు లేదు. “బుల్లి చేపలచేత మాట్లాడించటంలోనే ఉన్నది చిక్కంతా” అన్నాడట ఆలివర్ గోల్డ్‌స్మిత్. చేపలూ, కాకులూ, ఎలుకలూ మాట్లాడటం వల్ల వాస్తవికత పోతుందని అతను భయపడి ఉంటాడు. కాని బాల సాహిత్యంలో అలాటి వాస్తవికత అనవసరం. పిల్లలు తాము వినే (చదివే) కథలలోని సన్నివేశాలనూ, సంఘటనలనూ తమ పరంగా అన్వయించుకోనవసరం లేదు. వాళ్లు వాటికి ఎడంగా ఉండే ఆనందం పొందాలి. అనగనగా ఒకరాజు. ఆ రాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చి ఎండవేశారు...

ఏ రాజు? ఏడుగురు చేపల వేటకు పోయి ఏడు చేపలేనా తెచ్చారు? ఏడు చేపలు ఎండవేస్తే ఎవరి ముక్కులోకి? ఇలాంటి సందేహాలు వేటికీ కథలో తావు లేదు.

కొన్ని నీతికథలను ఆధునికం చెయ్యాలని కొందరు ప్రయత్నిస్తారు. ఇది పొరపాటు. మాంసంముక్క నోట కరుచుకున్న కాకిని నక్క, "కాకి బావా, కాకి బావా! ఒక పాట పాడు!" అనగానే ఈ ఆధునిక కాకి మాంసం ముక్కను కాలికింద పెట్టుకొని, పాట పాడి నక్కను "ఫూల్" చేస్తుంది. ఇది నీతికథ కాదు. జర్నలిజం.

పిల్లల కథలు వర్తమాన జీవితానికి సంబంధించి ఉండాలనీ, అందులో వాస్తవికతకు చోటు కలిగించాలనీ కొందరు కొన్ని రకాల రచనలు చేస్తారు. మాటవరుసకు "సీత పుట్టినరోజు పండుగ" అనుకోండి. సీతకు పుట్టినరోజు పండుగ చేస్తారు. బామ్మ తలంటి పోస్తుంది. నాన్నారు తెచ్చిన కొత్త పూల పరికిణీ కట్టుకుంటుంది. మామయ్య తెచ్చిన పూల జాకెట్టు వేసుకుంటుంది. అన్నయ్య తెచ్చిన కొత్త రిబ్బను, ఎంచక్కా పెట్టుకుంటుంది. అమ్మ పూరీలూ. జిలేబీలూ. మైసూరుపాకూ, బాదం హల్వా చేసి పెడుతుంది. ఇదే విధంగా తంతు జరిగిపోతుంది. ఇది పిల్లల కథ కాదు. పెద్దవాళ్లు నెలల పిల్లలతో (వాళ్ళ కర్థమవుతుందనుకునీ. వాళ్ళ భాషే మాట్లాడుతున్నామనుకునీ) "ఓంతిలా! అయి కావాలా?" అన్నట్టుగానే ఉంటుంది ఇలాంటి కథ కూడాను. ఇటువంటి కథలు మరీ జాస్తిగా చదివితే పిల్లలకు తమ పరిసరాల మీద చాలా రోత పుడుతుంది. సినిమాలో చూపే ప్రేమ నిజమనుకున్నవాడు వాస్తవ జీవితంలోని ప్రేమ చూసి అనుకున్నట్టుగా పిల్లలు పెద్దవాళ్ళయాక. వంచింప బడ్డామనుకోగలరు. ఎందుకంటే ఈ కథల్లో ఉండేది "స్టెరిలైజ్" చేసిన జీవితం. వాస్తవంగా ఉన్నట్టు భ్రమ గొల్పే అవాస్తవం. చేపలూ, కొంగలూ మాట్లాడే కథలు ఇలా మోసం చెయ్యవు.

**మౌలిక భావాలు**

బాల సాహిత్యం పిల్లల మెదడులో కొన్ని మౌలికమైన భావాలను బలంగా నాటాలి. ధైర్య సాహసాలూ, నిజాయితీ స్నేహ పాత్రత, త్యాగబుద్ధి కార్యదీక్షా, న్యాయమూ మొదలైనవి జయించటం ద్వారా సంతృప్తిని కలిగించే కథలు. ఎంత అవాస్తవికంగా ఉన్నా, పిల్లల మనస్సులకు చాలా మేలు చేస్తాయి. దురాశా, ఓర్చలేనితనమూ, అధికార గర్వమూ, క్రూరత్వమూ, కృతఘ్నతా, అధర్మమూ, స్వార్థమూ మొదలైనవి శిక్షించబడటం కూడా పిల్లలకు తృప్తి నివ్వాలి.

కొన్ని కొన్ని సద్గుణాలు ఒక్కొక్క సమయంలో దౌర్బల్యంగా పరిణమించటమూ. ప్రమాదం తెచ్చి పెట్టటమూ జరుగుతుంది. భూతదయ చాలా మంచిదే. నిస్సహాయులపట్ల దయ చూపటం వరకూ ఇబ్బందిలేదు. కాని దుర్మార్గులపట్ల చూపే దయ ప్రమాదాలకు దారి తీస్తుంది. అందుచేతనే, బోను నుంచి పులిని విడిపించిన బ్రాహ్మడి కథలో ముఖ్యాంశం బ్రాహ్మడి జాలి కాదు. అది తెచ్చిపెట్టే ప్రమాదమే. ఆ ప్రమాదాన్ని నక్కయుక్తిగా తప్పిస్తుంది. యుక్తి కథలకు బాల సాహిత్యంలో మంచి స్థానం ఉంది.

స్థూలంగా చెప్పాలంటే, పిల్లలలో దౌర్బల్యాన్ని పెంపొందించేది మంచి బాలసాహిత్యం కాదు. మహాసత్వుల కథలు ఉత్తమ బాలసాహిత్యం. ఒక లక్ష్యం పెట్టుకున్నాక మహాసత్వుడైనవాడు ఎన్ని ప్రమాదాలనూ లక్ష్య పెట్టడు. అటువంటి పాత్రలు గల కథలు ఎంత హెచ్చుగా చదివితే పిల్లలకు "కారెక్టర్" అంత బాగా ఏర్పడుతుంది. మన దేశాలలాంటి పేద దేశాలలో పిల్లలకు డబ్బుమీద దృష్టి ఏర్పడటంకన్న "కారెక్టర్" ఏర్పడటం చాలా అవసరం.

రాక్షసులను మనుషులు జయించటమూ, ధనికులను వాళ్ళ సేవకులు భంగపరచటమూ, అతి సామాన్యమైన వ్యక్తులలో అసాధారణ శక్తులుండటమూ లేదా వారికవి లభ్యం కావటమూ – ఇలాటి ఇతివృత్తాలుగల జానపద కథలు ప్రపంచమంతటా ఉన్నాయి. వాస్తవ సంప్రదాయాలకు ఎదురు వెళ్లే ఈ కథలు చదవటం వల్ల కూడా పిల్లలకు కొంత లాభం ఉన్నది. ముఖ్యంగా, చిన్న పిల్లలకు దొంగల భయమూ, దయ్యాల భయమూలాటివి అతి తేలికగా అబ్బుతాయి. ఆ భయాలను తగ్గించే దొంగల కథలూ, దయ్యాల కథలూ పిల్లలు చదివి ఉండటం మంచిది.

దేవుడిమీద భక్తినీ, మత విశ్వాసాలనూ ప్రచారం చెయ్యటానికే రచించిన కథలు పిల్లలకు చెప్పటం అంత మంచిదికాదు. కథల్లో దేవతలూ, భక్తులూ ఉండరాదని కాదు. దేవుణ్ణి నమ్ముకుంటే అన్ని సుఖాలూ ఒనగూడతాయన్న అభిప్రాయాన్ని పెద్దలు కలిగి ఉండటం ఎంత తప్పో. పిల్లలకు యివ్వటం అంతకు పదింతలు తప్పు. కథలో నెగ్గవలసినది మనుష్య యత్నమూ. మనిషి సద్బుద్ధీనూ. ఇది చాలా ముఖ్యం.

**రచనా విధానం**

బాలసాహిత్యం రాసేటప్పుడు కథనం పెద్దవాళ్ళు పిల్లలతో మాట్లాడుతున్నట్టుండాలనుకోవటం నా బుద్ధికి చాదస్తంగా కనిపిస్తుంది. "అప్పుడేమయిందనుకున్నారూ?" "రాజుకో కూతురుందనుకున్నాం కాదూ?"…. "చూశారా. వాడి దుర్మార్గం వాణ్ణి ఏ స్థితికి తెచ్చిందోనూ?" ఇలా అడుగడుగునా బాల పాఠకులను తట్టుతూ ఉండటం అనవసరం అనుకుంటాను.

రచనలో వ్యర్థపదాలూ, ప్రకృతి వర్ణనలూ, సౌందర్య వర్ణనలూ పిల్లలను అంతగా ఆకట్టవు. "కీకారణ్యం", "కటిక చీకటి", "పండు వెన్నెల", "పెద్ద కెరటాలతో ఉప్పెన" ఇలాటి మాటలతో వాళ్లు ఎంతైనా ఊహించుకోగలరు.

పాత్రలు చాలా మంచివాళ్లయినా కావాలి. చాలా చెడ్డవాళ్లయినా కావాలి. చాలా తెలివిగల వాళ్లయినా కావాలి. వట్టి మూర్ఖులైనా కావాలి. చాలా అందంగానైనా ఉండాలి. వికారంగానైనా ఉండాలి. ఓ మాదిరి మంచీ, సుమారైన తెలివీ, ఎటూగాని అందమూ బాలసాహిత్యానికి అనవసరం. పాత్రల అంతస్సంఘర్షణలు కూడా అంతే.

పిల్లల కోసం రాయటం ఒక గొప్ప కళ. తెలుగులో ఆ కళను చెప్పుకోదగినంతగా వృద్ధి చేసిన వారెవరూ ఉన్నట్టు కనబడదు. కొందరు పాత్రోచితభాష ప్రవేశ పెట్టాలని హీన పాత్రల చేత యాసగా మాట్లాడించటం లాటి ప్రయోగాలు చేస్తారు. నా దృష్టిలో ఇది కూడా ఈనాటికి పొరపాటే. కథల్లో సంభాషణలు ఉండక తప్పదు. కాని వాటిలో అంత వాస్తవికత నిరుపయోగం.

**బాల గేయాలు, ఇతర రచనలు**

అదృష్ట వశాత్తు ఈనాడు మనలో చక్కని బాలగేయాలు రాసేవారున్నారు. నిజానికి పెద్దవాళ్ళకన్న పిల్లలు గేయాలను ఎక్కువగా ఆనందించగలరు. బాలగేయ రచనలు పిల్లలకు ఎంతగా అందుతున్నాయో నాకు తెలీదు. కొన్నిటికి బహుమతులు కూడా లభించాయనుకుంటాను.

పిల్లలకు విజ్ఞానం కూడా కొంతవరకు అవసరమే. ఈ స్పూత్నిక్ హైడ్రోజన్ బాంబు యుగంలో వాళ్లు తెలుసుకోదగిన వైజ్ఞానిక విషయాలు ఎన్నో ఉన్నాయి. ఆకాశానా, భూమిమీదా, సముద్రం అడుగునా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఆరోగ్య సంబంధమైన అంశాలు చిన్నతనం నుంచీ తెలుసుకోదగినవి ఎన్నయినా ఉన్నాయి. అడివిలో చెట్లలాగా ఈనాటి పిల్లలు వీటిని గురించి ఏమీ తెలుసుకోకుండా పెరగటం చాలా తప్పు.

**బాల గ్రంథాలు**

బాల గ్రంథాలు చూడటానికి అందంగా ఉండాలి. అచ్చు చక్కగా ఉండాలి. బొమ్మలు ఊహలను కదిలించేవిగా ఉండాలి. వాటిలో ఎలాటి అచ్చు తప్పులూ ఉండరాదు.

అవి చవగ్గా కూడా ఉండాలి.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ రెండూ కుదరవు. అందుకని కమ్యూనిజం వచ్చేదాకా ఈ సమస్యను తడిపి ఉంచటానికీ వీల్లేదు.

ఈ సమస్యను పరిష్కరించటానికి ప్రస్తుతం ఉన్న మార్గాలు ఏవంటే:

ఒకటి, పిల్లలకోసం వేసే పుస్తకాలకు ప్రభుత్వం, లేక ప్రభుత్వాలు సబ్సిడీలు యివ్వటం.

రెండు, ప్రచురణ కర్తలు ఈ పుస్తకాలను అనేక వేల సంఖ్యలో ముద్రించటం (లక్షల సంఖ్యలో కాకపోతే).

పుట్టిన రోజు పండుగలకూ, ఇతర పండుగలకూ పెద్దవాళ్ళు పిల్లలకు మిఠాయి వగైరాలతో బాటు చక్కని పుస్తకాలు కూడా బహుకరించటం. ఇతర దేశాలలో ఇరవై అయిదు రూపాయల ఖరీదుచేసే పిల్లల పుస్తకాలు సైతం అచ్చవుతున్నాయి. పెద్దవాళ్ళు బహూకరించక పోతే నిత్య ఖర్చులో నుంచి పిల్లలు అలాటి పుస్తకాలు కొనటం సాధ్యమా?

పిల్లల పుస్తకాల ప్రచురణ ఆంధ్రలోనే చాలా వెనకపడి ఉన్నట్టు కనబడుతుంది. మంచి ముద్రణాలయాలు లేకపోవటమూ. బాల పుస్తకాల ప్రచురణ పెట్టుబడిదార్లను ఆకర్షించక పోవటమూ అందుకు కారణాలు కావచ్చు. పిల్లలకు తగినట్టుగా బొమ్మలు వేసే చిత్రకారులు కూడా చాలా తక్కువగానే ఉన్నట్టు కనిపిస్తారు.

పిల్లల పుస్తకాలకు గిరాకీ రాగానే అందరూ బొమ్మల రామాయణాలూ, బొమ్మల భారతాలూ ప్రచురించారు. రామాయణ భారతాలు పిల్లలకు అనవసరమనను గానీ, వాటికన్న చాలా మంచి బాలసాహిత్యం ఉన్నది – రాసేవాళ్ళూ, వేసేవాళ్ళూ ఉంటే.

***(సంవేదన త్రైమాసిక పత్రిక, అక్టోబర్ 1968 సంచిక నుండి. సంపాదకులు: రాచమల్లు రామచంద్రారెడ్డి)***

◆



19.05.1938 - 10.06.2019

# సాంస్కృతిక యోధుడు గిరీష్ కర్నాడ్

- డాక్టర్ హెచ్. పల్లవి

మనసులోని మాటలకు తెరలఖ్ఖర లేకుండా పుసుక్కున మాట్లాడితే జీవితం గిరీష్ కర్నాడ్లా ఉ ంటుందేమో..

భారత బ్రిటిష్ రచయిత వి.ఎస్. నైపాల్ జీవన సాఫల్య పురస్కారం తీసుకొబోతుంటే, అంతలేసి రచయితలూ ఉన్న నిండు సభ లో ఆయన ముస్లిం వ్యతిరేక భావజాలాన్ని తిట్టగలిగిన వాడు,

గౌరి లంకేశ్ వర్ధంతి రోజు, నాదీ అదే దారి, నన్నూ చంపండన్నట్టుగా మెడలో బోర్డు తగలేసుకొని కూర్చోగలిగినవాడు...

నాటకాలు వ్రాసి సమాజంలోని అజ్ఞానపు కలుపును పెరికివేయాలనుకునే అమాయకుడో..మూర్ఖుడో..

తాను వ్రాసిన నాటకం కనీసం 200 ఏండ్లు జనం చదవాలనుకునే స్వార్థపరుడు...

పని తప్ప పదవులంటె లెక్కలేనివాడు..

ట్రోఫీలు, మొమెంటోలు, ఫోటోల వంటి చెత్తని ఇంట్లో పోగు చేసుకోవడం ఇష్టం లేని అతి శుభ్ర పరుడు...

తన నాటకాలు గొంతు చించుకుని అరుస్తున్నా, ఇంకా ఎవరికైనా తన గురించి అర్థం కాలేదేమోనని చేతిలో పలక పట్టుకుని ప్రతి అణగారిన ఆశకూ ఊపిరూడినవాడు.. కొనఊపిరితో కూర్చోగలిగినవాడు..

గీతాంజలి గొప్పదైతే అయ్యింది గాని రవీంద్రుడు గొప్ప నాటకకర్త ఏంకాదు అని అలవోకగా అనగలిగినవాడు..

అన్నన్ని మాటలు అనకూడని వాళ్ళని అని కూడా పద్మశ్రీలు, పద్మభూషణులు, జ్ఞాన పీఠ్లూ అందుకోగలిగిన వాడు...

సంప్రదాయం ఒక నిశ్చలమైన జడపదార్థమని భావించి పూజించేవారికి...మన సంప్రదాయం లో హేతువు, ప్రశ్న అంతర్భాగమని, తర్కం తోనే మన సంప్రదాయం జీవనది గా భాసిల్లుతోందనీ తన రచనల ద్వారా చేరవేసే ప్రయత్నం చేసినవాడు...ఆ ప్రయత్నం చేసినందుకు హిందుత్వ ద్వేషి అని పేరు పడ్డ వాడు..

భగవద్గీత, ఉపనిషత్తులు కొందరికి రాతి పై చెక్కిన శాసనాలు కావచ్చు కానీ, ఈయనకు మాత్రం అవి వ్యక్తిత్వానికి నిచ్చన మెట్లు..

స్త్రీ ని గౌరవం, జాలి, దయ, వంటి బంధనాలలో కాకుండా తప్పొప్పులు చేయగల ఒక మామూలు మనిషిగా చిత్రించి, వారి పైనున్న బరువును దింపిన మనిషితనం..

'హయవదన' లో కాళికాదేవినే వాంగ్యోక్తులకు ఉపయోగించుకునే నైపుణ్యం..

**Oxford scholar** కావచ్చు, బహుభాషా ప్రజ్ఞాశాలి కావచ్చుగాని ... మాట్లాడిన భాష పేరు నిర్భీతి..

స్వేచ్ఛను చొక్కాలా తొడుక్కొని...

నిజమనే కళ్ళజోడు పెట్టుకొని...

## కవిత

# మిథ్యాభివృద్ధి



- మామిడిశెట్టి శ్రీనివాసరావు
7386030717

*ఎటు చూసినా అభివృద్ధి ప్రచారాలే*
*గట్టు తెగిన గోదారిలా*
*అదేంటి చిట్టి తల్లీ!*
*నువ్వు ఆకలితో చచ్చిపోయావంటారేంటి?*
*ఇది ప్రతిపక్షాల కుట్ర కాదు కదా*
*ఎక్కడైనా మట్టి నుంచి అన్నం పండించుకుని*
*తినడం విన్నాం కానీ*
*ఇలా మట్టినే అన్నంగా తిని*
*అసువులు బాయడం ఇప్పుడే వింటున్నాం*
*అయినా పోయిన దానివి నిశ్శబ్దంగా రెండో కంటికి*
*తెలియకుండా పోవాలి కానీ ఇలా శబ్దమై*
*మా గుండెల్లో యుద్ధమై మోగుతావేంటి?*
*ప్రతి రోజు డప్పులు కొట్టుకుని మరీ గొప్పలు చెప్పుకునే*
*మా నాయకులేమైపోవాలి?*
*వాళ్ళ మోచేతి నీళ్ళు తాగి తెగ బలిసిన*
*మా మీడియా పులులేమై పోవాలి?*
*మీలాంటి ఎందరికో అతీతంగా మేము నిర్మించుకున్న*
*ఈ నాగరికత నగరాలు ఒక్కసారిగా*
*భళ్ళున బ్రద్దలై పోవా?*
*ధనాన్ని తప్ప దైన్యాన్ని కనలేని*
*ఈ అభివృద్ధి సమాజాలు సమాధులుగా మారిపోవా?*
*గుప్పెడు మెతుకుల కోసం వెతికీ వెతికీ*
*కృంగి కృశించి సెలవంటూ బురఖాలు కప్పుకున్న*
*మా బ్రతుకుల మీద ఉమ్మేసి వెళ్ళిపోయావు*
*మట్టిలో పుట్టి మట్టినే తిని చివరకు ఆ మట్టిలోనే*
*కలిసిపోయి నిఖార్సైన మట్టి మనిషిగా మిగిలావు*
*మేము మాత్రం ఏనాడో మట్టితో ప్రేగుబంధాన్ని*
*తెంచేసుకుని వట్టి మనుషులుగా మిగిలిపోయాం*
*కాంక్రీట్ జంగిల్‌లో కరెన్సీ నోటులైపోయాం*
*నీ ఆకలి కేకల్ని ఆర్పలేని మా మిథ్యాభివృద్ధిని*
*ఎప్పటికైనా నిండు మనస్సుతో క్షమిస్తావు కదూ!* ♦

---

ప్రశ్ననే సిరా గా పోసుకొని ...జానపద ఇతిహాస పాత్రలతో రంగస్థలం పై ఆయన ఆడించిన ఆటలు సమాజాన్ని దులిపేవే... ఆలోచన నేర్పేవే..

సమాజం లో హేతువాద స్ఫూర్తిని వ్యాపింపచేయడానికి కళలకంటే గొప్ప మార్గమేది?

సమాజం పట్ల స్పందన ఒక బాధ్యతగా కలిగిన విశిష్టమైన కళా విప్లవకారుల కుటుంబం ఇక మరికాస్త చిక్కిపోయింది.

తానొకరిని విమర్శించినా.. తననొకరు విమర్శించినా.. ఆటలో అరటిపండులా తీసుకోగలిగినవాడు..

నచ్చని పుస్తకాలను కాల్చేయాలని... అర్ధం కాని మనుషులను చంపేయాలని అనుకునే కొత్త జాతి మనుషుల మధ్య ఆయనొక ఏకాకి తరం...

'చావు పుట్టుకలు వ్యక్తిగత విషయాలు... ఆ మధ్య లో ఏమి చేస్తామన్నదే ముఖ్యం' అని తానే ఎప్పుడో అన్నట్టుగా గొప్పగా బ్రతికి.. నిశబ్దంగా వెళ్ళిపోయినవాడు..

నాటక రంగానికి చాలా దశాబ్దాలుగా దూరమైన తెలుగువారికి పొరుగు రాష్ట్రం లోని గిరీష్ కర్నాడ్ తన నాటక రచన ద్వారా పంపిన సందేశాలు దురద ృష్టవశాత్తు అపరిచితాలే.

అయినా అడపా దడపా వేసే సినిమా పాత్రలు, ఎప్పుడో వేసిన మాల్గుడి కథల లోని స్వామి తండ్రి పాత్ర, అప్పుడెప్పుడో దూరదర్శన్ లో వచ్చిన 'టర్నింగ్ పాయింట్' లో పిల్లపెద్దలను సమంగా టీవీ ల ముందు కూర్చోపెట్టి చెప్పిన విజ్ఞాన విశేషాలు...ఇవన్నీ కాక ఆయన స్ఫురద్రూపం, కంచు కంఠం అన్నిటివలన గిరీష్ కర్నాడ్ మనకు చిరపరిచితులే.

కాకతాళీయంగా బ్రతుకుతున్న మనుషులకు జీవించడమంటె ఏమిటో చూపించి పోయిన ఎనభై ఒక్క ఏండ్ల స్వతంత్ర గమనం ..ధిక్కారానికి స్వరం అరువిచ్చిన గిరీష్ కర్నాడ్ .... ఇక ప్రతి స్వతంత్ర స్వరం లోనూ జీవించి ఉంటారు. ♦

# స్వీకారం




## ఎడారిపాట కవిత్వం

**గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి**

వెల : 100/- పేజీలు: 176

ప్రతులకు : 9493375447

**ఉ**త్సాహశాలిత్వంతో పాటు, ఆవేశం, ఆవేదన, కాల్పనికత తగుపాళ్ళలో కలిగి సామాజిక సమకాలీన రుగ్మతల మీద స్పందిస్తూ ఒక కంగాళీ తనం దుర్మార్గాన్ని, దోపిడీ విధానాన్ని ఎత్తిచూపుతూ కవిత్వమై ప్రవహిస్తున్నది కవి గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి ఎడారిపాట.

**- కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి**




## కాలమిచ్చిన తీర్పు

**తురగా జయశ్యామల**

వెల : 150/- పేజీలు: 185

ప్రతులకు: 09820003133

**కా**లరహితమైనదేదీ ఉండదు. 'కాలమిచ్చిన తీర్పు' మనుషుల నిర్ణయమే..! చాలా ఏళ్ళ క్రితం రాసిన నవలికలైనా కాలాన్ని గెలిచాయి. చదివించే గుణంతో ఇంకా నిలిచి ఉన్న అదే సమస్యల పట్ల ఆలోచనల్ని రేకెత్తించే ఈ రచనలు పాఠకుల ఆదరణను మళ్ళీ మళ్ళీ తప్పక చూరగొంటాయనీ ఆశిస్తున్నాను.

**- డా॥ చిల్లర భవానీ దేవి**




## అనంత యాస

**రాయపాటి శివయ్య**

వెల :100/- పేజీలు: 120

ప్రతులకు: 9885154281

**నే**ను మాట్లాడే భాష, యాసలో దాగివున్న ప్రత్యేకత, నా మాట తీరు నన్ను ఈ పుస్తకాన్ని రాయడానికి ప్రేరేపించాయి. అనంతపురం మాండలిక పదాల మీద పనిచేయాలనే ఆలోచన నాకు చదువుకునే రోజుల్లోనే బీజం పడిందని చెప్పవచ్చు.

**- రాయపాటి శివ**




## దక్షిణాఫ్రికా నానీలు

**రాపోలు సీతారామరాజు**

వెల : 50/- పేజీలు: 80

ప్రతులకు: +27727747549

**సా**మాజికత, దేశీయత, కవితాత్మకత ముప్పేటలుగా అల్లుకుపోయిన వైనం నానీల్లో వుంది. ముఖ్యంగా కవి యొక్క హృదయ సరళత. పునరుక్తి కాకపోతే నేను మళ్ళీ అంటాను. ఇదంతా నానీల నిర్మాణ విశిష్టత భావాలను ఒదిగించుకొనే అక్షయపాత్రత. అయితే మంచి నానీ పుట్టాలంటే మాత్రం భావ సాంద్రత తప్పనిసరి. ఇది రాజు కవిత్వంలో పుష్కలంగా వుంది.

**- డాక్టర్ ఎన్. గోపి**




## మట్టి వాసన కవితా సంపుటి

**మేరెడ్డి యాదగిరి రెడ్డి**

వెల :80/- పేజీలు: 81

ప్రతులకు: 9949415796

**యా**బయ్యేండ్ల సాహితీ ప్రస్థానం ఎన్నో ఎన్నెన్నో మలుపులు ఈ 'మట్టివాసన' కవితా సంపుటి నా అయిదవ పుస్తకం గతంలో 'మట్టి కథలు, కొలిమి కథలు, బొడ్రాయి కథలు, రైతు నానీలు పుస్తకాలుగా వచ్చాయి. ముఖ్యంగా నేను కథకున్ని వంద దాకా కథలు యాభయి పిల్లల కథలు రాయడం జరిగింది. అప్పుడప్పుడు సందర్భానుసారంగా రాసుకున్న కవితల పుస్తక రూపమే ఈ 'మట్టివాసన'' కవితా సంపుటి.

**- మేరెడ్డి యాదగిరి రెడ్డి**




## కవిత 2018

**సంపాదకులు: విశ్వేశ్వర రావు**

**సహకారం:**

**నామాడి శ్రీధర్, బండ్ల మాధవరావు**

వెల :150/- పేజీలు: 174

ప్రతులకు: 0866-2433359

**ఈ** మధ్య కవితలనేకం అన్ని విధాలా ప్రాథమిక స్థాయిలో ఉండటవే కూర్పరికి నిరాశ కలిగిస్తున్నది. ఓ కవిని అయిదు కవితల్లోంచి ఒక్క కవితనీ ఎంచుకొనలేని పరిమితి ఎదురవుతుంది. ఇంకొక కవివి రెండు కవితల్లోంచి దేనికది తేల్చుకోలేనంత హృద్యంగా భాసిల్లుతుంది.

**- నామాడి శ్రీధర్**

## ఎడారిపాట ఆవిష్కరణ




సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జూన్ 2న కర్నూలు నగరంలోని పింగళిసూరన తెలుగుతోటలో సాహితీ స్రవంతి జిల్లా నాయకులు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి ఎడారి పాట కవిత్వం ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు సంఘం రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. పుస్తకాన్ని ప్రముఖకవి జి.వెంకటకృష్ణ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కవి తన పాత్రను వ్యక్తీకరిస్తూ తనకు తెలిసిన విషయాలను అక్షరీకరిస్తాడన్నారు. గౌరెడ్డి రాయలసీమ రైతుకుటుంబం నుంచి వచ్చిన కవిగా ఆర్ద్రతతో కవిత్వం రాశాడని ఇందులో రైతు పడే కష్టాలని, బాధల్ని వర్ణించాడన్నారు. భారతదేశంలోని రైతు సమస్యలు, స్త్రీ బాధలు వివరించడం, రాజకీయ వ్యవస్థలోని లోపాలు చెప్పడం ఈ కవిత్వంలో గొప్ప విషయమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, కర్నూలు రేడియో స్టేషన్ సంచాలకులు రొక్కం కామేశ్వరరావు రచయిత ఇనాయతుల్లా , తెలుగు భాషా వికాస ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి జెయస్సార్కె శర్మ, సిల్వర్ జూబిలీ కళాశాల తెలుగు శాఖాధిపతి ఆచార్య దండెబోయిన పార్వతి దేవి, డా.వి.పోతన్న, ముద్రిక కళాస్రవంతి అధ్యక్షులు భాస్కర్, పెన్షనర్స్ అసోషియేషన్ నాయకులు రంగారెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మెన్ పాండురంగారెడి, కవులు సయ్యద్ జహీర్ అహ్మద్, నల్లబోతుల నాగమణి, కళ్యాణ దుర్గం స్వర్ణలత, జి.ఉమామహేశ్వర్, మహేశ్వరయ్య, యస్.సుధాకర్, సుబ్బన్న, ప్రగతి విజ్ఞానకేంద్రం కన్వీనర్ జెయన్ శేషయ్య తదితరుల పాల్గొన్నారు. ప్రారంభానికి ముందు పింగళిసూరన విగ్రహానికి పూలమాల వేశారు. సభలో ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు యంపి బసవరాజు పాట పాడి వినిపించారు. ♦

## సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, చిత్తలూరి సత్యనారాయణకు పురస్కారం

పాతూరి మాణిక్యమ్మ స్మారక రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం 2017 సంవత్సరానికి చిత్తలూరి సత్యనారాయణ "నల్ల చామంతి" కవితా సంపుటికి, 2018 సంవత్సరానికి సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి "బడి" కవితా సంపుటికి అందించనున్నట్లు పాతూరి అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2017 సంవత్సరానికి ప్రముఖ కవయిత్రి శిలాలోలిత 2018 సంవత్సరానికి ప్రముఖ రచయిత దాట్ల దేవదానం రాజు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించినట్లు తెలిపారు. విజేతలకు జూన్ 30న నెల్లూరు పురమందిరంలో సత్కరించి ఐదువేల రూపాయల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.



*మహబూబ్ నగర్‌లో తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో లిటిల్ స్కాలర్స్ హై స్కూల్‌లోని కాళోజి హాలులో మే4 న "భావ ప్రకటన స్వేచ్ఛ" అంశంపై జరిగిన సభ. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న వల్లబాపురం జనార్దన వేదిక పై డా. పరిమళ్, నందిగామ కిశోర్ కుమార్, జలజం సత్యనారాయణ, వి.పుష్పలత, యం.డి ఖాజామైనద్దీన్ వున్నారు.*




*విశాఖపట్నం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 15న పబ్లిక్ లైబ్రరీ మినీహాలులో మహాకవి శ్రీశ్రీ 36వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో శ్రీశ్రీ సాహిత్యంపై డి.వి.సూర్యారావు, శ్రీశ్రీ సినిమాపాటలలో అభ్యుదయం అన్న అంశం పై గరిమెళ్ళ నాగేశ్వరరావు హృద్యంగా ప్రసంగించారు. యువకవులు శ్రీశ్రీ కవితలను పఠించారు.*

### సాహిత్య ప్రస్థానంలోని విశేష రచనకు ప్రతీ సంవత్సరం

## డాక్టర్ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం



డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి, మహాలక్ష్మి దంపతులు

అనంతపురం జిల్లా, కదిరికి చెందిన ఎద్దుల మహాలక్ష్మి తన భర్త పేరుతో ప్రతీ సంవత్సరం సాహిత్య ప్రస్థానం మాసపత్రిక సహకారంతో డాక్టర్ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం అందించనున్నారు. అందుకోసం సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు ఒక లక్షాయాభైవేల రూపాయలను అందజేసారు. ఆ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వడ్డీగా వచ్చిన మొత్తంతో ప్రతీ సంవత్సరం జనవరిలో ఈ పురస్కారాన్ని అందించడం జరుగుతుంది. సాహిత్య ప్రస్థానంలో జనవరి నుండి డిసెంబర్ వరకూ ప్రచురించిన కథ, కవిత, వ్యాస ప్రక్రియలలో ఉత్తమమైన ఒకటి లేదా రెండు రచనలకు నగదు పురస్కారాన్ని అందించడం జరుగుతుంది. ఎద్దుల మహాలక్ష్మి తన భర్త డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి ప్రగతిశీల భావాలను, సాహిత్య అభిమానాన్ని గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతపురం జిల్లా కదిరిలో సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సభ్యులు పి. కుమారస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న సాహిత్య కార్యక్రమాలకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. తెలుగు భాషా సాహిత్య కృషికి ఎద్దుల మహాలక్ష్మి అందిస్తున్న తోడ్పాటుకు సాహిత్య ప్రస్థానం అభినందనలు తెలియజేస్తున్నది. ♦

## విశాఖలో శ్రామిక జనకవనం



కవులు, రచయితలు ఉద్యమాలతో మమేకమవ్వాలని ప్రముఖ కవి, సాహితీవేత్త, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి కోరారు. ప్రజల బాధలు పట్టని రచనలతో సమాజానికి ఉపయోగం ఉండదన్నారు. ఐదేళ్లలో భారతదేశంలో అసహనం పెరిగిపోయిందని, దాన్ని సహించే కవిత్వానికి అర్థం లేదన్నారు. విశాఖలోని శివాజీ పార్కు దరి వైజాగ్ ఫెస్ట్, సాహితీ స్రవంతి ఆధ్వర్యాన శ్రీశ్రీ 109వ జయంతి ఉత్సవాలు, మే డేను పురస్కరించుకుని ఏప్రిల్28న నిర్వహించిన శ్రామిక జనకవనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కవిత్వాన్ని రాచరికపు కోటల నుంచి రచ్చబండల వద్దకు తీసుకొచ్చినట్లు నేటి సమస్యలపై ఈ తరం కవులు ప్రశ్నలు సంధించాలన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు, రాష్ట్ర అకాడమీ వైస్‌ఛైర్మన్ అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ కష్టజీవుల తరపున నిలబడని కవిత్యం అనవసరమని అభిప్రాయపడ్డారు. సామాజిక దృష్టి కోణం కవికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణమన్నారు. ప్రముఖ కవి రామతీర్థ మాట్లాడుతూ శ్రీశ్రీ రచనా శైలిని ఈనాటి సమస్యలకు అద్దం పట్టేలా నేటి కవుల రచనలు చేయాలని కోరారు. వైజాగ్ ఫెస్ట్ కార్యదర్శి అజశర్మ మాట్లాడుతూ కవులు సామాజిక లక్ష్యంతో ముందుకు కదలాల్సిన అవసరముందని, దాన్ని మరింత పెంచేందుకు ఈ శ్రామిక జనకవనం మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎవి.రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గంటేడ గౌరినాయుడు, రామసూరి, డిఆర్‌కె నాయుడు, సుదీప్ కవితలు చదివి వినిపించారు. రాష్ట్ర సాహితీ అకాడమీ సభ్యులు జగద్ధాత్రి, సిఐటియు విశాఖ నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ పాల్గొన్నారు. ♦

## ఎద్దుల సిద్ధారెడ్డి మహాలక్ష్మి సాహిత్య పురస్కార సభ




సాహితీ స్రవంతి, కదిరి అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కదిరి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జూన్ 1న ఎద్దుల సిద్ధారెడ్డి మహాలక్ష్మి సాహిత్య పురస్కారాలను కవులు రచయితలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు పిల్లా విజయ కుమారస్వామి రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సాహిత్యం భావ ప్రచారానికి తోడ్పడుతుందని, అదే సందర్భంలో సామాజిక మార్పులకు దోహదం చేస్తుందని కూడా అన్నారు. సామాజిక అంశాలపైన కవిత్వం రాయమన్నప్పుడు జిల్లావ్యాప్తంగా సుమారు 70 మంది కవులు కవిత్వాన్ని రాశారన్నారు. మన జిల్లాలో కథా సాహిత్యం కూడా బాగా అభివృద్ధి చెందుతోందని అందులో మహిళలు బాగా రాస్తారని ఆయన అన్నారు. కదిరి ప్రాంతంలో చాలా మంది సాహిత్యకారులు ఉన్నారని వారిని ప్రోత్సహించేందుకు సాహితీస్రవంతి ఎల్లప్పుడూ కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఎద్దుల సిద్ధారెడ్డి గతంలో తెలుగు లెక్చరర్గా పనిచేసి కడప లో పదవీ విరమణ అనంతరం ఫిబ్రవరి మాసంలో ఆయన మరణించారు. ఆయన జయంతి సందర్భంగా ఆయన పేరిట కవిత్వానికి, కథలకు పురస్కారాలను అందజేయడానికి సాహిత్య పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆ పోటీలో వచ్చిన కవితలను పరిశీలించి పురస్కారానికి ఆవుల వెంకటేశ్వర్లు రాసిన 'ఒక ముగింపు కోసం' కవితను ఎంపికచేశారు. ఈ పోటీకి న్యాయ నిర్ణేతగా తెలుగు ఉపన్యాసకులు సుందరమోహన్ రెడ్డి వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ కవులు సాహిత్యాన్ని సృజించడానికి ప్రధాన ప్రేరకులు గురువులేనని అన్నారు. కదిరి అభివృద్ధి వేదిక కన్వీనర్ జె.వి. రమణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుదూర ప్రాంతాల నుంచి కదిరి వచ్చినవారు సాహిత్యం పట్ల ఎంతో మక్కువ ఉన్న వారని , ఇది సాహిత్యాభివృద్ధికి తప్పకుండా దోహదం చేస్తుందని ఆయన అన్నారు. సిద్ధారెడ్డి సతీమణి మహాలక్ష్మి మాట్లాడుతూ త్వరలో రాయలసీమ సాహిత్యంపై సదస్సును సిద్ధారెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేయాలని దానికి తన సహకారం అందిస్తానని తెలిపారు. తర్వాత ఎద్దుల సిద్ధారెడ్డి మహాలక్ష్మి కవితా పురస్కారాన్ని ఉరవకొండ కు చెందిన ఆవుల వెంకటేశ్వర్ల కు అందజేశారు. ఎద్దుల సిద్ధారెడ్డి కథా పురస్కారాన్ని తాడిపత్రికి చెందిన పోరాల శారదాదేవి కి అందజేశారు. శారదా దేవి ధనమేరా అన్నిటికి మూలం అనే కథను మాండలికంలో అద్భుతంగా రాశారని న్యాయనిర్ణేతలు కవిత, ప్రగతి కొనియాడారు. ఈ సందర్భంగా శారదా దేవి మాట్లాడుతూ ఇదే తనకు లభించిన ప్రథమ పురస్కారమని అన్నారు. తన పిల్లలకు మార్గదర్శకంగా ఉండేందుకు తాను రాస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, విశ్వనాథరెడ్డి ,మహాలక్ష్మి వసంత కుమార్ రెడ్డి ,అవధాని మురళి ,చిన్నారావు, వందన, ఉమామహేశ్వరి ,కృష్ణవేణి, గంగరాజు, సమరసింహా రెడ్డి, లాయర్ గురులింగస్వామి, స్వాతి, ముస్తఫా ,తదితర కవులు రచయితలు పాల్గొన్నారు. ◆

## కొత్తపల్లి నరేంద్రబాబు స్మారక సాహిత్య పురస్కారం-2019

"కవిత్వం బతకాలి - కవి మిగలాలి అనే నినాదంతో కవిసమ్మేళనం సాహిత్య వేదిక"ను స్థాపించి, సాహితీసేవే పరమావధిగా భావించి అనేక సాహితీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన "కొత్తపల్లి నరేంద్ర బాబు" జ్ఞాపకార్థంగా వారి సేవల్ని కొనసాగించే ప్రయత్నంలో భాగంగా ప్రతియేటా వారిపేరుతో పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు కొత్తపల్లి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరంలో ప్రచురించిన కవిత్వ సంపుటాలను 4 సంపుటాలను కొత్తపల్లి సురేష్ ( అక్షరమాలి), 6-1-149-1, జన్మభూమి రోడ్డు, లక్ష్మీనగర్, అనంతపురం 515001 చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 9493832470, 9908830477 ద్వారా సంప్రదించవచ్చును.

## 'నీళ్లింకని నేల' కథా సంకలనం ఆవిష్కరణ



రాయలసీమ అస్తిత్వాన్ని నీళ్ళింకని నేల కథలు బలంగా వ్యక్తీకరించాయని, ఈ కథలు సీమ కన్నీటి సాగరాలని రాయలసీమ ఉద్యమ నేత భూమన్ పేర్కొన్నారు. తెలుగు కళా స్రవంతి దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా రాయలసీమ ప్రచురణలు వెలువరించిన మొదటి పుస్తకం 'నీళ్ళింకని నేల' కథల సంకలనాన్ని కర్నూలు ఎంపిపి హాలులో మే 29న ప్రముఖ సాహిత్యవేత్త భూమన్ ఆవిష్కరించారు. ఈ సభకు ప్రముఖ సముద్ర శాస్త్రవేత్త, తెలుగు కళాస్రవంతి అధ్యక్షులు డాక్టర్ ఎంపిఎం.రెడ్డి అధ్యక్షత వహించారు. భూమన్ మాట్లాడుతూ వలసలు, కరువు, కష్టాల సేద్యం, వీటితోపాటు ఆత్మీయమైన సంస్కృతి, సొగసైన భాష కలిగిన సీమ జీవనచిత్ర ప్రతిబింబంగా ఆవిష్కృతమైన ఈ కథలు మన బతుకుల్ని, జీవనచిత్రాన్ని కన్నీళ్లతో లిఖించాయన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన ఈ కథలకు చేసిన ప్రయత్నం అరుదైనది అనడం కంటే చరిత్రలో నిలిచిపోయేదన్నారు. నీళ్లింకని నేల రాయలసీమ కథల సంపుటి పుస్తకాన్ని ప్రముఖ రచయిత బండినారాయణ స్వామి సమీక్షించారు. రాయలసీమ గొంతుకగా, ఉద్యమ స్వరాలుగా కథలు నిలిచిపోతాయని తెలిపారు. అనంతపురానికి చెందిన ప్రముఖ చిత్రకారులు కుంచెశ్రీ చిత్రించిన రాయలసీమ ప్రచురణల లోగోను రాయలసీమ ఉద్యమనేత బొజ్జా దశరథరామిరెడ్డి ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా హాజరైన కేంద్రసాహిత్య అకాడమి యువపురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ రెడ్డి, రాయలసీమ ప్రచురణల గౌరవ సంపాదకులు పి.మారుతి, సంపాదకులు ఇనయతుల్లా, కెంగారమోహన్ మాట్లాడారు. గజల్ గాయకులు మహమ్మద్ మియా, ఎంపి.బసవరాజుల బృందం ఆలపించిన రాయలసీమ గీతాలు అలరించాయి. ♦

## సామర్లకోటలో కందుకూరి శత వర్ధంతి సభ

సాహితీ స్రవంతి సామర్లకోట శాఖ ఆధ్వర్యంలో మే 22న బి. కృష్ణా రావు అధ్యక్షతన కందుకూరి శత వర్ధంతి సభ జరిగినది. సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నాగేశ్వరరావు, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జోస్యుల కృష్ణబాబు కార్యక్రమంలో వక్తలుగా పాల్గొన్నారు. సాహిత్య యుగకర్త సంఘసంస్కర్త నవయుగ వైతాళికుడు కందుకూరి అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు యువకులు తమ కవిత్వాన్ని చదివి వినిపించారు. ఈ సభలో సాహితీస్రవంతి సామర్లకోట శాఖ కన్వీనర్ అంగర



గోపాలక్రిష్ణమచార్యులు, కో-కన్వీనర్ భైరవ స్వర్ణకుమార్ ఎస్.జానకి, కెనడీ, ఎస్ సత్యం నాయుడు, బేబీ కొండ, సీపీ కృష్ణమూర్తి యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు ♦

**కళాకారుడు ప్రపంచాన్ని ఏకకాలంలో చాలా పార్శ్వాల నుంచి దర్శించాలి; ప్రస్తుతం ఉన్నదాంట్లో జీర్ణించి పోతూ వున్న గతాన్ని, మెరుగవుతూ, రూపుతీసుకుంటూ ఉన్న భవిష్యత్తునీ రెండింటినీ చూడాలి."**

**- మక్సీం గోర్కీ**




విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో సంగమం ఆధ్వర్యంలో జూన్ 13న జరిగిన గిరీష్ కర్నాడ్ సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు ఎం.వి.ఎస్. శర్మ. చిత్రంలో దివికుమార్, బుడ్డిగ జమిందార్, అరసవిల్లి కృష్ణ, ఉషా ఎస్. డ్యానీ, బోస్, అనిల్, శాంతిశ్రీ




అనంతపురంలోని నలంద జూనియర్ కళాశాలలో సాహితీస్రవంతి, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న మల్లెల్ల నరసింహమూర్తి. చిత్రంలో సాహితీస్రవంతి బాధ్యులు రవిచంద్ర, యమున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర, నగర కార్యదర్శి ఆలం తదితరులు




విజయవాడలో సంగమం ఆధ్వర్యంలో మేధావుల, రచయితలు, జర్నలిస్టులు, దళితులు, మైనారిటీలపై మతోన్మాదుల దాడులకు వ్యతిరేకంగా జూన్ 13న లెనిన్ సెంటర్ నుండి రాఘవయ్య పార్కు వరకు జరిగిన రచయితలు, మేధావుల నిరసన ప్రదర్శన



విజయవాడలో విజయవాడ బుక్ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో జూన్ 23న జరిగిన రామతీర్థ సంస్మరణ సభలో మాట్లాడుతున్న రమ్యభారతి పత్రిక సంపాదకుడు చలపాక ప్రకాష్. చిత్రంలో నందూరి రాజగోపాల్, జి.వి. పూర్ణచంద్, పల్లవి వెంకటనారాయణ




విజయనగరం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 16న గురజాడ స్వగృహంలో జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్. చిత్రంలో డాక్టర్ మేడిపల్లి రవికుమార్, పాయల మురళీకృష్ణ



విశాఖపట్నంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా జూన్ 15న విశాఖ బీచ్లోని శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం. చిత్రంలో సాహితీస్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎ.వి. రమణారావు, సందీప్, పట్టాభి, ఆర్.కె.ఎస్.వి. కుమార్, జి.వి.రమణ, అరుణ్జీ, మూర్తి, రాంప్రభు, ఎం.బి. మూర్తి, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో కందుకూరి శతవర్ధంతి సభ



కందుకూరి వీరేశలింగం శత వర్ధంతి సందర్భంగా గురజాడ అప్పారావు స్టడీసర్కిల్, ఐద్వా, జ్యోతిరావుపూలే విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో యుటిఎఫ్ హాల్లో జూన్ 11న సమావేశం జరిగింది. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగుజాతి అభివృద్ధిలో కందుకూరి రచనలు, ఆయన సంస్కరణలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. ఆ రోజుల్లోనే బాల్య వివాహాలపైనా, వితంతు వివాహాలపైనా, ఆడపిల్లల చదువుల కోసం పోరాడారని గుర్తు చేశారు. అప్పట్లో ఆడపిల్ల గడప దాటకూడదనే నిబంధన ఉండేదని, అటువంటి రోజుల్లో పాఠశాలలు ఏర్పాటుచేసి చదువు చెప్పించే విధంగా ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయనను మించిన సంఘ సంస్కర్త లేరని ఆరోజుల్లోనే పలువురు ప్రశంసించేవారని గుర్తుచేశారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ మాట్లాడుతూ కందుకూరి రచనలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కందుకూరి మూఢనమ్మకాలపై చేసిన పోరాటాలను ఈ రోజు అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కందుకూరి భావాలను అందుకోవడంలో సమాజం ఇంకా వెనకబడే ఉందన్నారు. జ్యోతిరావుపూలే విజ్ఞానకేంద్రం కన్వీనర్ కె.రామ్మోహనరావు, గురజాడ అప్పారావు స్టడీసర్కిల్ కన్వీనర్ రావి వెంకట్రావు తదితరులు మాట్లాడారు. మచిలీపట్నం ఐద్వా కార్యదర్శి జ్యోతి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ♦

## గుడివాడలో కందుకూరి శతవర్ధంతి సభ



కృష్ణాజిల్లా గుడివాడలోని ఎన్టిఆర్ ఇండోర్ స్టేడియంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జూన్ 8న కందుకూరి వీరేశలింగం శత వర్ధంతి సభ జరిగింది. సాహితీస్రవంతి గుడివాడ కన్వీనర్ లంకా సురేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాజమండ్రిలోని కందుకూరి వీరేశలింగం హార్ధిక కళాశాల తెలుగు హెచ్ఓడి డాక్టర్ పి.వి.బి సంజీవరావు మాట్లాడుతూ సాహితీ సేవ, సంఘ సంస్కరణకు నడుం బిగించిన వైతాళికుడు కందుకూరి వీరేశలింగమని, సమాజ అభివృద్ధి స్త్రీ విద్యతోనే సాధ్యమని ఆనాడు కందుకూరి తెలిపారన్నారు. తన సాహిత్యం ద్వారా ఆ రోజుల్లోనే ఒంటరిగా మహిళ వివక్షత, బాల్య వివాహాలపై పోరాటం చేశారన్నారు. కొత్త సాహిత్యాన్ని సృషిస్తూ 10వేల పుటలను రచించారన్నారు. తన పత్రికల ద్వారా పరిశోధన జర్నలిజానికి ఆద్యులుగా నిలిచారన్నారు. మరణించి వందేళ్ళు అవుతున్నా వీరేశలింగంను మరువలేని పరిస్థితి నెలకొందన్నారు. సంస్కృత సాహిత్యం, ఆంధ్ర సాహిత్యాన్ని, శాస్త్ర గ్రంధాలను రచించిన వ్యక్తి కందుకూరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో 50 సాహితీ సంస్థలు, మేధావి, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, దళిత సంఘాలు పాల్గొన్నాయి. ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ సామాజిక సంస్కరణలకు తన రచనల ద్వారా పోరాడిన వ్యక్తి, ఆద్యుడుగా నిలిచిన వ్యక్తి వీరే శలింగం అన్నారు. కందుకూరి చనిపోయి 100 ఏళ్ళు అవుతున్నా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారన్నారు. అస్తవ్యస్త పరిస్థితుల్లో సమాజాన్ని సంస్కరించడానికి నడుం బిగించి, కడవరకు పోరాడారన్నారు. ప్రముఖ రచయిత వెన్నా వల్లభరావు మాట్లాడుతూ మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా కందుకూరి అనేక రచనలు చేశారన్నారు. తెలుగుభాషా వికాస సమితి అధ్యక్షులు డి.ఆర్.బి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు బాష ఉన్నంతకాలం వీరేశలింగం ప్రజల స్మరణలో ఉంటారన్నారు. శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామల ప్రసాద్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ళ నారాయణ రావు, బి.వి. శ్రీనివాస్, డి.ఆర్.బి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ♦

## ‘వెలుతురు వాకిట’ పుస్తకావిష్కరణ సభ



సమాజాన్ని మార్చేందుకు రాసే సాహిత్యం సజీవంగా ఉంటుందని ప్రముఖ సాహితీవేత్త తెలకపల్లి రవి అన్నారు. శ్రీశ్రీ 110 జయంతి సందర్భంగా విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాహితీస్రవంతి ఆధ్వర్యాన మే 28న జరిగిన ‘వెలుతురు వాకిట’ పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడుతూ ‘వెలుతురు వాకిట’ పుస్తక రచయిత రెడ్డి శంకర్రావు శ్రామికుల జీవితం స్పృశించేలా కవితలు రాశారని కొనియాడారు. ప్రపంచీకరణ ఆధిపత్య పోకడలను ఎండగడుతూ, దానికి పిండం పెట్టడం ఒక్కటే మనముందున్న కర్తవ్యమని గుర్తు చేశారన్నారు. ప్రస్తుతం స్త్రీని తక్కువ చేసి చూడడం ఎక్కువవుతుందన్నారు. స్త్రీ ఔనత్యం, గొప్పతనం గురించి చెప్పేవారు పెరగాలన్నారు. కవులు ప్రతిధ్వని లాంటివారని కొనియాడారు. సామాజిక వాస్తవాలను గ్రహించే సాహిత్యం రావాలని అన్నారు. విజయనగరం సాహిత్య సభల్లో పాల్గొని ప్రసంగించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. పుస్తకావిష్కర్త అప్పలనాయుడు మాట్లాడుతూ సామాజిక మార్పునకు సాహిత్యం కత్తిలాంటిదని పేర్కొన్నారు. సాహిత్యం, కమ్యూనిజం రెండూ సమాజంలోని దుర్మార్గాలను రూపుమాపేందుకు పుట్టినవని, ఉద్యమకారులు రాసే సాహిత్యానికి బలం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సభాధ్యక్షులు గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ కవి జనంలో కలిసిపోవాల్సి ఉందన్నారు. అటువంటి సాహిత్యం రాణిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ కవి రామసూరి, రచయిత పాయల మురళీకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, కవులు, సాహిత్య వేత్తలు పాల్గొన్నారు. ♦

## ‘అద్వంద్వం’ కవితా సంపుటి ఆవిష్కరణ



కాకినాడ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జూన్ 11న గాంధీభవన్‌లో డా: జోశ్యుల కృష్ణబాబు గారి అధ్యక్షతన పుప్పాల శ్రీరామ్ రాసిన “అద్వంద్వం” కవితాసంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. పి.ఆర్. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చప్పిడి కృష్ణ కవితాసంపుటిని ఆవిష్కరించారు. ప్రధాన వక్తగా విజయనగరంనుండి విచ్చేసిన యువ కవి పాయల మురళీకృష్ణ ప్రసంగించారు. అనంతరం అనిల్ డ్యానీ, సుంకర గోపాల్ ఆత్మీయ ప్రసంగం చేశారు. గనారా, వుయ్యూరు హనుమంతరావు, మార్ని జానకిరామ చౌదరి, పద్మావతి, మురళీకుమారి గ్రంథంపై తమ స్పందన తెలియజేసారు. రచయిత శ్రీరామ్ తన స్పందన తెలిపారు. ఎఱ్ఱాశాస్త్రి వందన సమర్పణతో సభ ముగిసింది. ♦

**గతానికి సంబంధించిన అపోహల్ని తొలగించడమే కాకుండా వర్తమానానికి సంబంధించిన సంక్షోభాన్ని పరిష్కరించి, భవిష్యత్తును సుగమం చేయడమే సామాజిక దృక్పథం- ప్రజాపరమైన ఈ సామాజిక దృక్పథం, సాహిత్య రంగంలో కూడా గీటురాయి కావాలి. అనివార్యమైన వర్గపోరాటాల సమాజంలో క్రియాశీలంగా వుంటేనే కవికి సరైన భావాలు వస్తాయి.**

**- జ్వాలాముఖి**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# గుర్రం జాషువా

28.09.1895 – 24.07.1971



అట్టడుగు కులంలో పుట్టి అనేక అవమానాలు ఎదుర్కొని నిలబడ్డారు. 'గబ్బిలం' వంటి ఖండ కావ్యాలతో దళితుల హృదయవేదనను అద్భుతంగా ఆవిష్కరించారు. 'పిరదౌసి', 'కాందిశీకుడు', 'ముంతాజ్‌మహల్' వగైరా ఖండకావ్యాలు రాసి కవికోకిల, నవయుగ కవి చక్రవర్తి అని బిరుదులు పొందారు.

SAHITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 28.06.2019


# ప్రజాశక్తి బుక్ హౌస్ తాజా ప్రచురణలు

కందుకూరి వీరేశలింగం తన జీవితకాలంలో చేసిన అసాధారణ కృషి తెలుగుప్రజలను విశేషంగా ప్రభావితం చేసిన విషయం మీకు తెలిసిందే. ఆనాడు సమాజంలో పేరుకుపోయి ఉన్న మూఢత్వాన్ని, ఛాందసత్వాన్ని తన ఆధునిక భావాలతో చీల్చిచెండాడు. ఒకవైపు సంఘసంస్కరణ ఉద్యమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూనే మరోవైపు తన పదునైన కలంతో అద్భుతమైన రచనలు చేశాడు. వీరేశలింగం రచనలు ఏ కోణంలో చూసినా ఈనాటికీ విశేషమైన ప్రాసంగికతను కలిగి ఉన్నాయి. కందుకూరి మరణించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో మరోసారి కందుకూరి సంఘసంస్కరణ ఉద్యమాన్ని, వారి రచనలను ఈ తరానికి గుర్తుచేయడం అవసరమని భావించి కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి బుక్‌హౌస్ ఈ దిగువ తెలిపిన పుస్తకాలను ప్రచురించింది. విలువైన ఈ పుస్తకాలను ప్రస్థానం పాఠకులకు ప్రత్యేక రాయితీతో ప్రజాశక్తి బుక్‌హౌస్ అందిస్తుంది.



## కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్రము

తొలినవలగా ప్రాచుర్యం పొందిన కందుకూరి వీరేశలింగం నవల 'రాజశేఖర చరిత్ర'. తొలినవలగానే కాకుండా ఆనాటి సమాజాన్ని వాస్తవిక దృష్టితో రికార్డు చేసిన రచనగా కూడా గుర్తింపు పొందింది. తప్పనిసరిగా చదవవలసిన పుస్తకం.

పేజీలు : 184,
ధర : 140/-

## స్వీయచరిత్ర సంగ్రహము కందుకూరి వీరేశలింగం



కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్రను ప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు సంక్షిప్తీకరించారు. అత్యుత్తమ జీవిత చరిత్రల్లో ఈ పుస్తకం కూడా ఒకటి. కందుకూరి జీవితంలోని ప్రతి సంఘటనా ఉత్తేజం కలిగిస్తుంది. ఆధునిక వైతాళికుడి జీవితం విలువైన అనుభవాల సమాహారం.

పేజీలు : 192,
ధర : 150/-



## క్రాంతి ఖడ్గం కందుకూరి

పేజీలు : 56,
ధర : 35/-

ఈ పుస్తకాన్ని ఐద్వా మహిళా సంఘం ప్రచురించింది. కందుకూరి మహిళల సంక్షేమానికి ఎటువంటి కృషి చేశారో తెలియజేస్తూ, ఆయన సేవలను విభిన్న కోణాలలో విశ్లేషిస్తూ మహిళా ప్రముఖులు, రచయిత్రులు, కవయిత్రులు రాసిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

## సంఘసంస్కరణ దస్తూరి మన కందుకూరి



పేజీలు : 336,
ధర : 270/-

ప్రముఖ రచయిత, విమర్శకుడు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన వ్యాస సంకలనం ఇది. ఇందులో సీనియర్ సాహిత్య వేత్తల వ్యాసాలతో పాటు సమకాలీన ప్రముఖ రచయితల వ్యాసాలు ఉన్నాయి. కందుకూరి జీవిత, సాహిత్యాల గురించి, ఈనాడు కందుకూరి ప్రాసంగికత గురించి ఆలోచింపచేసే వ్యాసాల సంకలనం.

## యుగపురుషుడు వీరేశలింగం



పేజీలు : 336,
ధర : 270/-

ప్రముఖ రచయిత, సామాజిక, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి సంపాదకత్వంలో పునర్ముద్రించిన అలనాటి విలువైన పుస్తకం ఇది. తెలికిచర్ల వెంకటరత్నం, దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆవుల సాంబశివరావు సంపాదకత్వంలో 'యుగపురుషుడు' పేరుతో స్మారక సంచికగా వెలువడింది. ఆనాటి పెద్దలు కందుకూరిని ఎలా చూశారో ఈ పుస్తకం చెబుతుంది.

## ప్రజాశక్తి బుక్ హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం.


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059